అనుదినం... జనస్వరం

ఉమ్మడి ఆదిలాబాద్

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక



12 పేజీలు | బుధవారం 1 మే 2024 | www.navatelangana.com

వెట్టిచాకిరి బతుకులు..!

- కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు
- అమలుకు నోచుకోని కనీస వేతనాలు
- పని ప్రదేశాల్లో కనిపించని మౌలిక వసతులు
- 8గంటల పనికి తూట్లు..పట్టించుకోని అధికారులు
- నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం

సంపద సృష్టికర్తలైన కార్మికుల హక్కులు హరించుకుపోతున్నాయి. శ్రమకు తగిన ఫలితం రావడం లేదు. అరకొర వేతనాలు..చాలీచాలని జీతాలతో బతుకీడుస్తూ దుర్భర జీవనం గడుపుతున్నారు. పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య దుకాణాల్లో ఏండ్ల తరబడి పనిచేస్తూ రోజువారీ పొట్ట నింపుకుంటున్నారే కానీ..వారి జీవితాలు మాత్రం మారడం లేదు. కనీస వేతనాలు అమలు కాకపోవడం ఓ సమస్య అయితే.. అదనపు పని భారం మరో సమస్యగా మారుతోంది. పోరాడి సాధించుకున్న 8గంటల విధానానికి ప్రభుత్వాలు తూట్లు పొడవడటం..కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయకపోవడం వంటి కారణాలు శ్రామికులకు గుదిబండగా మారుతున్నాయి. పని ప్రదేశాల్లో సౌకర్యవంతంగా జీవించడానికి కనీస మౌళిక వసతులు కూడా లేకపోవడం.. పర్యవేక్షించాల్సిన అధికారులు మామూలుగా తీసుకుంటూ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వంటి సమస్యల కారణంగా కార్మికుల బతుకులు దయనీయంగా మారుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నేడు ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని నవతెలంగాణ ప్రత్యేక కథనం..

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. సగటు కూలీ సైతం పెరిగిన ధరలకు అనుగుణంగా ఉండటం లేదు. ఫలితంగా వివిధ ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో పనిచేస్తున్న శ్రామికులు ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. రోజువారీగా నిత్యావసర సరకుల ధరలు పెరగడం.. వాటికి అనుగుణంగా ఖర్చులు పెరుగుతున్నా వేతనాలు మాత్రం పెరగకపోవడం తీవ్ర సమస్యగా మారుతోంది. ముఖ్యంగా కేంద్రప్రభుత్వం వివిధ పథకాలు(స్కీం) వర్కర్లకు సంబంధించి నిబంధనల ప్రకారం కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాల్సి ఉంటుంది. కానీ కేవలం నెలకు రూ.10వేల నుంచి రూ.16వేల వరకు మాత్రమే వేతనాలు చెల్లిస్తోంది. మరోపక్క ఆరోగ్య కార్డులు, ఇన్సురెన్సు వంటి సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నా అలాంటి చర్యలు చేపట్టడం లేదు. ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు సైతం కనీస వేతనాలు అమలు కావడం లేదు. మరోపక్క వ్యాపార, వాణిజ్య సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు దుకాణాల యజమానులు సంక్షేమ నిధి జమ చేయాల్సి ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా కార్మికులు ప్రమాదాలకు గురైన సందర్భాల్లో వారికి ప్రభుత్వాల నుంచి ఎలాంటి ఆర్థిక సాయం లభించడం లేదు. కేంద్రం 2021లో నూతనంగా ప్రవేశపెట్టిన ఈ శ్రమ్‌కార్డులు సైతం అసంఘటిత రంగ కార్మికుల వద్ద పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. అవగాహన లేమి కారణంగా వేలాది మంది కార్మికులు ఈ కార్డులు పొందకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన ప్రయోనాలు పొందలేకపోతున్నారు.



కనీస సౌకర్యాలకు దూరం..!

పని ప్రదేశాల్లో కార్మికులు కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. కనీస మౌళిక సదుపాయాలు లేకపోవడంతో అరకొర వసతుల మధ్యనే జీవనం సాగించాల్సి వస్తోంది. మరోపక్క ఇటుకబట్టీలు, జిన్నింగ్, స్పిన్నింగ్ మిల్లులు, కంకర క్వారీలతో పాటు వివిధ రకాల పరిశ్రమల వద్ద కనీసం ఉండేందుకు గదులు కూడా

మిగతా..7లో...

శ్రమదోపిడీకి గురవుతున్న బీడీకార్మికులు

- అక్రమార్జనే పనిగా పెట్టుకున్న టేకేదార్‌లు
- అంతా మామూలుగానే తీసుకుంటున్న అధికారులు
- పట్టించుకోని కార్మిక సంఘాలు



బీడీలు చుడుతున్న మహిళా కార్మికులు

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

పొద్దస్తమానం పనిచేస్తూ నెత్తురునే చెమటగా మలిచి బీడీలు చుట్టే కార్మికులను టేకేదారులు అడ్డగోళుగా దోచుకుంటున్నారు. సెంటర్ ఇన్‌చార్జీలు, టేకేదార్‌లు కుమ్మక్కై కార్మికుల శ్రమను దోచుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. కార్మికుల సమస్యలను పట్టించుకోవాల్సిన సదరు శాఖాధికారులు 'మామూలుగా' మారడంతో వీరి దోపిడిని ఎవరూ నిలువరించలేని పరిస్థితి నెలకొంది. కార్మిక సంఘాలు సైతం ఏమీ పట్టనట్లుగా వ్యవహరించడంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోలేని స్థితిలో ఉన్నామని కార్మికులు వాపోతున్నారు. టేకేదార్‌లు చేస్తున్న దోపిడిని లోతుగా పరిశీలిస్తే గాని ఎవరికి అంతుబట్టని పరిస్థితి ఉంది. మండలంలో చార్ భాయ్, టెలిఫోన్, దేశాయ్, శివాజీ, సూపర్, ఎస్‌జే, వాణి, లంగర్ ఠాకూర్ తధితర రకాల సంస్థలకు సంబంధించిన బీడీ కంపనీలు కొనసాగుతున్నాయి. వీటన్నిటిలో కలిపి మండలంలో పీఎఫ్ కలిగిఉన్న కార్మికులు సమారు 5500 మంది, నాన్ పీఎఫ్ కార్మికులు 4000 మంది పనిచేస్తున్నారు.

నగదు చెల్లింపుల పేరుతో కూలీ తగ్గింపు...

బీడీ కార్మికులు 1000 బీడీలు చిట్టితే రూ. 240 కూలీ ఉంది. అయితే నగదు చెల్లింపు పేరుతో టేకేదార్‌లు రూ.180 మాత్రమే చెల్లిస్తు మోసం చేస్తున్నారు. ఇదేమిటని అడిగితే నాన్ పీఎఫ్ కార్మికులకు ఇలానే చెల్లిస్తామని పేర్కొంటున్నారు.

ఫారం దిగిన ప్రతిసారీ 1500 బీడీలు అదనం..

కార్మికులు తమ పనిదినాలు పూర్తి చేసిన సదరు నెలకు సంబంధించిన బీడీల నమోదును పూర్తిగా లెక్కకట్టి డబ్బులు చెల్లించాలి. కాని సదరు టేకేదార్ ముందుగానే 1500 బీడీలను కొతపెట్టి ఆన్‌లైన్ చేస్తారు. ఈలెక్కన ఒక్కో కార్మికురాలు నుంచి రూ.360 అక్రమంగా దోచు కుంటున్నారు. ఇవే కాకుండా ప్రతినిత్యం మాపు ఇచ్చేటప్పుడు చాటన్ పేరుతో మూడు గుల్ల కట్టలు అంటే 75 బీడీలు అదనంగా తీసుకుంటారు. ఈ 75 బీడీల కూలీ లెక్క కడితే ప్రతి రోజు ఒక్కో కార్మికురాలు రూ.18 నష్టపోతుంది. ఇలా టేకేదార్‌లు, సెంటర్ ఇన్‌చార్జీలు కలిసి కార్మికులను మోసం చేస్తూ, సొమ్ము చేసుకుంటున్నారు. వీరు చేసే దోపిడి తతాంగం ఎవరికీ అంతుబట్టకుండా సాగిస్తారు.

పీఎఫ్ నమోదుకు రూ.5వేల నుంచి 8వేలు వసూలు..

కార్మిక శాఖ నిబంధనల ప్రకారం 20 మంది సంఖ్య దాటి ఉన్న ప్రతి బ్రాంచిలో సదరు కార్మికులకు పీఎఫ్ కార్డ్ జారీ చేయాలి. కాని టేకేదార్ లు అలా చేయకుండా ఉద్యేశ పూర్వకంగా కాలయాపన చేసి కార్మికులు పీఎఫ్ కోసం ఎదురు చూసే పరిస్థితులు సృష్టిస్తున్నారు. పీఎఫ్ కార్డు జారీకోసం రూ.5వేల నుంచి 8వేలు ఇచ్చిన వారికే కార్డు వస్తుందని అక్రమంగా వసూలు చేస్తున్నట్లు పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. నాన్ పీఎఫ్ కార్మికులుగా ఉంటేనే తమకు అన్నిరకాలుగా లాభం చేకూరుతుందనే ఉద్యేశంతోనే టేకేదార్‌లు సదరు సంస్థలకు తమ పేర్లను పంపించారని చెబుతున్నారు. డబ్బులు ఇచ్చుకోలేని స్థితిలో ఉన్న కార్మికులకు పీఫ్ జారీచేసే అవకాశమే ఉండదని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.

ప్రశ్నిస్తే ఆకు, తంబాకులో కోత..

టేకేదారులు చేస్తున్న అక్రమాలను ఎవరైనా ప్రశ్నిస్తే సదరు కార్మికుల ఆకు, తంబాకులో కోత విదిస్తూ ఇబ్బంది పెడతారని, వారు చేస్తున్న అక్రమాలను ఎవరికైనా చెప్పాలని చూస్తే చాటన్ పేరుతో బీడీలను ఫారంలో నమోదు చేయకుండా బెదిరిస్తారని తెలిపారు. ఈ పరిస్థితిలో తమకు చేసేందుకు మరో ప్రత్యామ్నయం మౌనంగా ఉండక తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తనిఖీలకు వచ్చినప్పుడు జాగ్రత్తలు..

ఎవరైనా అధికారులు, సంఘ నాయకులు గాని బ్రాంచిలను తనిఖీ చేసేందుకు వచ్చినప్పుడు టేకేదార్‌లు తెలివిగా జాగ్రత్తపడుతారు. వారికి ఉన్న అంతర్గత సమాచారంతో ముందుగానే వారి కంపెనీలో పనిచేసే ఒకరిద్దరు కార్మికులను మచ్చిగ చేసుకొని వారితో మాట్లాడిస్తారు. తాము చేస్తున్న కంపెనీలో టేకేదార్, సెంటర్ ఇన్‌చార్జీ ఎలాంటి మోసాలు చేయడం లేదని చెప్పించి, ఇతర కార్మికులు నోరువిప్పకుండా చేస్తారని పలువురు కార్మికులు వివరించారు.

కార్మికులను దోచుకుంటే ఊరుకునేది లేదు



బీడీ కార్మికులను దోచుకునే టేకేదార్‌లు, సెంటర్ ఇన్‌చార్జీలు తమ విధానం మార్చుకోవాలి. కూలీల శ్రమను దోచుకొని సొమ్ము చేసుకోవడం మంచిది కాదు. పద్దతి మార్చు కోకుంటే కార్మికులతోనే సరైనా గుణపాఠం చెబుతాం.

సునారికారి రాజేశ్, బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రదాన కార్యదర్శి

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం...



బీడీ కార్మికులను దోచుకునే బ్రాంచ్, సెంటర్ నిర్వాహకులపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. నేను ఇక్కడ ఇన్‌చార్జి అధికారిగా పనిచేస్తున్నాను. ఈ ప్రాంత కార్మికుల ఫిర్యాదు చేస్తే, చర్యలు తీసుకుంటాం. ఇక నుంచి ప్రత్యేక దృష్టి సారిస్తాను.

జి.రాజలింగం, కార్మికశాఖ అధికారి, నిర్మల్

ఉపాధి అవకాశాలు.. ఈ-శ్రమ్‌తో ప్రయోజనాలు ..

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అసంఘటిత రంగంలోని కార్మికులకు ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు సంఘటిత రంగ కార్మికులతో సమానంగా ప్రయోజనాలు కల్పించేందుకు ప్రభుత్వం 2021 సంవత్సరం ఆగస్టులో ఈ-శ్రమ పోర్టల్‌ను ప్రారంభించింది. ఈ పోర్టల్ ద్వారా దేశంలోని అసంఘటిత రంగ కార్మికులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి, అన్ని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వారికి అందజేయడమే ప్రభుత్వ ఉద్దేశం. ఇందుకోసం కూలీలకు ఈశ్రమ్ కార్డులు అందజేస్తున్నారు. ప్రభుత్వ పథకాల నుంచి సులభంగా ఉపాధి పొందే అవకాశాలను చూపుతున్నారు.

ఈ శ్రమ్ కార్డ్ అంటే...

ఈ శ్రమ్ కార్డ్ అనేది కార్మికులకు ప్రభుత్వం జారీ చేసిన ప్రత్యేక కార్డు. ఇది కార్మికుడు అసంఘటిత రంగంలోని వాడని రుజువు చేస్తుంది. ఇప్పుడు కార్మికులు తమ ప్రయోజనాలను పొందేందుకు పెద్దగా పరుగులు తీయాల్సిన అవసరం ఉండదు. దీన్ని చూపించడం లేదా సమర్పించడం ద్వారా అసంఘటిత రంగ కార్మికులకు అందుబాటులో ఉన్న అన్ని ప్రయోజనాలు అందుతాయి.

ఈ శ్రమ్ కార్డ్ ప్రయోజనాలు...

ఈ శ్రమ్ కార్డు పొందిన కూలీలు దేశంలో ఎక్కడైనా ఉపాధి పొందడం సులభమవుతుంది. డేటాబేస్‌లో వారికి సంబంధించిన డేటా వల్ల వారు పనిని సులభంగా పొందుతారు. ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదైన కార్మికుడికి రూ.2 లక్షల ప్రమాద భీమా కవరేజీ ఉంటుంది. పోర్టల్‌లో నమోదైన కార్మికుడు ప్రమాదానికి గురైతే, మరణం లేదా పూర్తి అంగవైకల్యం సంభవించినప్పుడు రూ.2 లక్షల మొత్తం ఇస్తారు. అదే సమయంలో కార్మికుడు పాక్షికంగా అంగవైకల్యం కలిగి ఉంటే ఈ-బీమా పథకం కింద లక్ష రూపాయలకు అర్హులు. ఈ కార్డు సహాయంతో అసంఘటిత రంగ కార్మికులకు ప్రధాన మంత్రి శ్రమ యోగి మాన్‌ధన్ యోజన, స్వయం ఉపాధి కోసం జాతీయ పెన్షన్ పథకం, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ప్రజా పంపిణీ వ్యవస్థ, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, జాతీయ ప్రభుత్వ పథకాలైన సామాజిక సహాయ పథకం, ఆయుష్మాన్ భారత్, నేత కార్మికులకు ఆరోగ్య పథకం, ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన, ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం వంటి వాటి ద్వారా ప్రయోజనం పొందుతారు.

నమోదు ప్రక్రియ, షరతులు...

అసంఘటిత రంగంలో పనిచేసే 16 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల ఎవరైనా ఈ కార్డు కోసం నమోదు చేసుకోవచ్చు. వర్కర్ స్వయంగా లేదా ఈశ్రమ్ పోర్టల్ హెచ్‌టీటీపీఎస్://ఈశ్రమ్.గావ్.ఇన్ ద్వారా కామన్ సర్వీస్ సెంటర్‌ని సందర్శించడం ద్వారా నమోదు చేసుకోవచ్చు. నమోదు పూర్తిగా ఉచితం. కార్మికులు పోర్టల్ లేదా కామన్ సర్వీస్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్ కోసం ఎటువంటి చెల్లింపులు చేయనవసరం లేదు.

ఏ పత్రాలు అవసరమవుతాయి...

పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ కోసం, కార్మికులు పేరు, వృత్తి, చిరునామా, విద్యార్హత, నైపుణ్యం వంటి సమాచారాన్ని అందించాలి. మీరు రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ నెంబర్‌ను నమోదు చేసిన వెంటనే అక్కడ ఉన్న డేటాబేస్ నుంచి వర్కర్ మొత్తం సమాచారం పోర్టల్‌లో స్వయంచాలకంగా కనిపిస్తుంది. వ్యక్తి మిగిలిన అవసరమైన సమాచారాన్ని పూరించాలి. కార్మికుడు ఈశ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ నెంబర్, ఆధార్ లింక్ చేసిన మొబైల్ నెంబర్. బ్యాంక్ ఖాతా అవసరం ఒక కార్మికుడికి ఆధార్‌తో లింక్ చేయబడిన మొబైల్ నెంబర్ లేకపోతే, సమీపంలోని కస్టమర్ సర్వీస్ పాయింట్‌ను సందర్శించి బయోమెట్రిక్ ప్రమాణీకరణ ద్వారా నమోదు చేసుకోవచ్చు.



ఈ శ్రమ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



ఈ శ్రమ్ కార్డుతో చాలా ప్రయోజనాలు ఉన్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 129538 మంది ఈ శ్రమ్ కార్డుదారులు ఉన్నారు. అర్హులైనవారు ఇంకా ఎవరైనా ఉంటే ఈ శ్రమ్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలి. తమ మొబైల్ ఫోన్‌లలో లేదా, సమీప ఇంటర్నెట్ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ శ్రమ్ కార్డుతో లభించే ప్రయోజనాలు అందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఏదైనా సందేహాలు, వివరాల కొరకు మా కార్యాలయాన్ని లేదా ఈ శ్రమ్ వెబ్ సైట్‌ను సందర్శించాలి

రాజలింగు, జిల్లా సహాయ కార్మికశాఖ అధికారి, ఆదిలాబాద్.

50 ఆశ్రమ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత

నవతెలంగాణ-ఉట్నూర్

పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఉమ్మడి అదిలాబాద్ ఆశ్రమ పాఠశాలలో 50 ఆశ్రమ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయని ఐటిడిఎ పిఓ ఖుష్బు గుప్తా అన్నారు. ఇదే మాదిరిగా వచ్చే విద్యా సంవత్సరంలోనూ ఆశ్రమ పాఠశాలలు అన్నీ వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా, నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులను కోరారు. ప్రతి ఆశ్రమ పాఠశాలలో మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఈ సందర్భంగా పేర్కొంటూ విద్యార్థులను అభినందించారు.

కార్మిక సంక్షేమ మండలి అమలు చేస్తున్న పథకాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంక్షేమం పెంపొందించుటకు కావాల్సిన ఆర్థిక సాయం అందించుటకు ఆంధ్రప్రదేశ్ కార్మిక సంక్షేమ నిధి చట్టం 1987 (తెలంగాణ అనుసరణ ఉత్తర్వులు 2014) చేసి, దీని ద్వారా సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి, ఆ నిధిని నిర్వహించుటకు సంక్షేమ మండలిని ఏర్పాటు చేసింది. కార్మికులకు ప్రయోజనం చేకూర్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశపెట్టాయి. కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా సంఘటిత, అసంఘటిత కార్మికులకు ఆర్థికంగా చేయూతనిస్తున్నాయి. మే1న కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్మికులకు సంక్షేమ మండలి ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రయోజనాలు, అవకాశాలపై నవతెలంగాణ ప్రత్యేక కథనం

పథకాలు.. ప్రయోజనాలు.. అవకాశాలు..

వైద్య సహాయం : క్యాన్సర్, కిడ్నీ, బ్రెయిన్ ట్యూమర్, గుండె జబ్బు, పక్షవాతం, ఎయిడ్స్, గర్భసంచి చికిత్స, ట్రామాకేర్ (ప్రమాదాలలో గాయాలకు చికిత్స) కింద చికిత్స పొందుతున్న కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు రూ.20వేల వరకు ఆర్థిక సాయం అందిస్తుంది. చికిత్స ప్రారంభించిన సంవత్సరంలోపు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవాలి. ఈఎస్ఐ వర్తించు కార్మికులకు, యాజమాన్యం ద్వారా వైద్య సాయం పొందుతున్న కార్మికులకు ఈ పథకం వర్తించదు.

ప్రమాద మరణ ఆర్థిక సాయం..

ఈ పథకం కింద రూ.30వేలు చెల్లిస్తారు. కార్మికుడు ప్రమాదంలో మరణించిన తేదీ నుంచి సంవత్సరంలోపు అతని కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకుంటే ఈ సాయం అందుతుంది.

సహజ మరణ ఆర్థిక సాయం..

ఈ పథకం కింద రూ.10వేలు అందుతుంది. కార్మికుడు మరణించిన తేదీ నుంచి సంవత్సరంలోపు అతని కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకుంటే ఈ సాయం అందుతుంది.

అంగవైకల్యానికి ఆర్థిక సాయం..

ప్రమాదం కారణముగా అంగవైకల్యము సంభవిస్తే రూ.20వేల వరకు ఆర్థిక సాయం అందుతుంది. ఈఎస్ఐ, నష్టపరిహారం చట్టము కింద వచ్చే కార్మికులకు ఈ పథకం వర్తిస్తుంది. అంగవైకల్యము 25శాతం నుంచి 40శాతం వరకు రూ.10వేలు, అంగవైకల్యము 41శాతం నుండి 49శాతం వరకు రూ.15వేలు, అంగవైకల్యము 50శాతం ఆపైన రూ.20వేలు చెల్లిస్తారు. ప్రమాదం జరిగిన సంవత్సరంలోపు కార్మికులు దరఖాస్తు చేసుకోవాలి.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం...

మరణించిన కార్మికుని అంత్యక్రియల ఖర్చులకు గాను రూ.5వేలు చెల్లిస్తారు. కార్మికుడు మరణించిన తేదీ నుంచి సంవత్సరంలోపు అతని కుటుంబసభ్యులు దరఖాస్తు చేసుకుంటే ఈ సాయం అందుతుంది.

వివాహ కానుక...

కార్మికుని కుమార్తె (కుటుంబంలో ఒక్కరికి మాత్రమే) మహిళా కార్మికురాలి వివాహ సందర్భంగా రూ.10వేలు ఫిక్స్ డిపాజిట్ రూపంలో అందచేస్తారు. కార్మికుని నెలసరి వేతనం రూ.16వేలు మించరాదు. వివాహము జరిగిన ఆరునెలలలోపు ధరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు నాటికి కనీసం మూడు సంవత్సరాల సంక్షేమనిధి సభ్యులుగా ఉండాలి.

ప్రసూతి సాయం...

ఈ పథకం కింద ప్రసవించిన మహిళా కార్మికురాలికి, కార్మికుని భార్యకు రూ.5వేలు (ఇద్దరు పిల్లలకు మాత్రమే) ఆర్థిక సాయం అందచేయబడుతుంది. కాన్పు అయిన సంవత్సరంలోపు దరఖాస్తు చేసుకోవాలి. ఈఎస్ఐ వర్తించు కార్మికులకు, యాజమాన్యము ద్వారా ప్రత్యామ్నాయ వైద్య సాయం పొందుతున్న కార్మికులకు ఈ పథకం వర్తించదు. కార్మికుని నెలసరి వేతనం రూ.16వేలు మించరాదు.

ఆదర్శ కుటుంబ ప్రోత్సాహకం...

ఈ పథకం కింద కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న వారికి రూ.2వేలు అందజేస్తారు. ఆపరేషన్ అయిన సంవత్సరంలోపు దరఖాస్తు చేసుకోవాలి. కార్మికుని నెలసరి వేతనం రూ.16వేలు మించకూడదు. (ఈ పథకమునకు కార్మికుడు, కార్మికురాలు, కార్మికురాలి భర్త, కార్మికుని భార్య అర్హులు)

విద్యా ప్రోత్సాహకం...

ప్రతి సంవత్సరం స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తారు.

ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనం : పదో తరగతి రూ.వెయ్యి, ఐటీఐ, రూ.వెయ్యి, పాలిటెక్నిక్ రూ.1500, ఇంజినీరింగ్ రూ.2వేలు, మెడిసిన్ రూ.2వేలు, లా రూ.2వేలు, బీఎస్సీ (హార్టికల్చర్) రూ.2వేలు, బీఏ. ఎంఎస్ రూ.2వేలు, బీబీఏ రూ.2వేలు, ఎంబీఏ రూ.2వేలు, డిఎంహెచ్ఎస్ రూ.2వేలు ఈ పథకంలో లబ్ధి పొందుటకు ప్రతి సంవత్సరం జనవరి మొదటి వారం నుంచి ఫిబ్రవరి 15వ తేదీలోపు ధరఖాస్తు చేసుకోవాలి. కార్మికుని నెలసరి వేతనం రూ.16వేలు మించకూడదు.

ప్రత్యేక విద్యా ప్రోత్సాహకం...

వికలాంగులైన విద్యార్థులకు సంవత్సరానికి ఒకసారి రూ.4వేలు స్కాలర్‌షిప్ కింద అందజేస్తారు.

కుటుంబ ఆదాయము పెంచుటకు...

కార్మికుల కుటుంబ ఆదాయాన్ని పెంచుటకు కుటుంబ సభ్యులకు కుట్టుపని, ఎంబ్రాయిడరీ వంటి వృత్తులలో హైదరాబాద్‌లోని కార్మిక సంక్షేమ మండలి కార్యాలయంలో ఉచిత శిక్షణ అందిస్తారు.

వార్షిక క్రీడోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ...

కార్మికులలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించుటకు ప్రతి సంవత్సరం, కార్మికులకు క్రీడోత్సవాలు సాంస్కృతిక పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తారు.

• పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



అర్హులైన కార్మికులు అందరూ కార్మిక శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. కార్మికుడిగా గుర్తింపు పొందిన ప్రతి పథకాలు వర్తిస్తాయి. ఆర్థిక లబ్ధిపొందేందుకు ఈ పథకాలు ఎంతగానో దోహదపడతాయి. అర్హులైన కార్మికుడు మా కార్యాలయాన్ని సందర్శిస్తే ఆ కార్మికుడికి మా వంతుగా వంద శాతం లబ్ధి చేకూర్చే ప్రయత్నం చేస్తాము. సంక్షేమ మండలి అమలు చేస్తున్న పథకాల పూర్తి వివరాల కోసం ధరఖాస్తుల కోసం ఈ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.లేబర్.తెలంగాణ.గావ్.ఇన్‌ను సందర్శించండి.

రాజలింగు, జిల్లా సహాయ కార్మికశాఖ అధికారి, ఆదిలాబాద్

పొగ చూరుతున్న బీడీ కార్మికుల బతుకులు

• రోజురోజుకూ భరోసా కోల్పోతున్న వైనం • పని దినాలు లేక, ఉపాధి దొరకక కుటుంబమంతా వీధిన పడుతున్న వైనం • పట్టించుకోని ప్రభుత్వాలు



నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ జిల్లా అంటేనే వ్యవసాయానికి పేరు పెట్టిన ప్రాంతం. 80 శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి ఉన్నారు. కాగా అలాగే 60 శాతం మంది బీడీ కార్మికులు బీడీలు చుడుతూ తమ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నారు. వ్యవసాయంలో అతివృష్టి అనావృష్టి వచ్చినప్పుడల్లా పంట నష్టం వాటిల్లినప్పుడల్లా బీడీ పరిశ్రమతో మహిళలు బీడీలు చేసి ఎంతో కొంత కుటుంబానికి ఆసరాగా నిలిచేవారు. ఇదంతా గత పది సంవత్సరాల క్రితం ఉన్న పరిస్థితి కానీ ప్రస్తుతం రోజురోజు బీడీ కార్మిక రంగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన చట్టాలు నిబంధనలతో వారి బతుకుల్లో పొగ చూరుతుంది. అంతే కాకుండా భరోసా లేకుండా బతుకులు కొనసాగుతున్నాయి. వేరే ఇతర ఉపాధి అవకాశాలు లేక కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. పూట గడవడమే కష్టంగా మారుతూ వస్తుంది. ప్రభుత్వాలు మాత్రం బీడీ కంపెనీపై సవతి ప్రేమను చూపెడుతుంది. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక మొండి చేయి చూపిస్తున్నాయి. దీంతో బీడీ కార్మికుల బతుకులు వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి.

రోజురోజుకూ భరోసా కోల్పోతున్న వైనం...

నిర్మల్ జిల్లాలో 60 వేలకు పైగా పీఎఫ్ ఉన్న బీడీ కార్మికులు ఉన్నారు. అలాగే 40 వేలు మంది పీఎఫ్ లేని వారు ఉన్నారు. అయితే పీఎఫ్ ఉన్న కార్మికులకు ప్రభుత్వం ఇస్తున్న జీవన భృతి రూ.2016 కొందరు మందికే వస్తున్నాయి. పలు నిబంధనల పేరు మీద చాలామందికి పీఎఫ్ ఉన్న బీడీ కార్మికులకు ఈ జీవన భృతి వర్తించడం లేదు. అధికారులను, ప్రజాప్రతినిలను ప్రశ్నిస్తే ఏదో సాకుతో పీఎఫ్ ఇవ్వడం లేదు. ఇక ఇలా ఉండగా పీఎఫ్ లేని వారి పరిస్థితి అయితే మరి దారుణంగా మారింది. గతంలో ఒక్క నెలలో 23 రోజులుపైగా పని దినాలు ఉంటే ప్రస్తుతం అవి సగానికి పని దినాలు ప్రస్తుతం పడిపోయాయి. దీంతో బీడీ కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

ఉపాధి లేక వీధిన పడుతున్న దుస్థితి...

గత పది సంవత్సరాల క్రితం నెలకు 23 రోజుల నుంచి 26 రోజుల వరకు బీడీ కార్మికులకు పని దినాలు ఉండేవి. వారు ఖాళీ సమయంలో వెయ్యి బీడీలు రోజు చేసేవారు. దీంతో వారికి తగిన కూలీ రేటు దొరికేది అయితే కేంద్రంలో ఎప్పుడైతే బీజేపీ ప్రభుత్వం వచ్చిందో అప్పటి నుంచి బీడీ కార్మికుల బతుకులు చిన్నాభిన్నమయ్యాయి. పెద్దపెద్ద పరిశ్రమలైన సిగరెట్ కంపెనీలపై 80 శాతం పుర్రె, క్యాన్సర్ గుర్తులు పెట్టి జీఎస్టీ అమలు చేశారు. అవి పెద్ద పరిశ్రమలు కావడంతో వాటికి అంతగా నష్టాలు కలగక పోవచ్చు. కానీ బీడీ పరిశ్రమ మాత్రం గ్రామీణ వ్యవస్థలో ఉపాధి అందించే ఓ ఆర్థిక ప్రయోజనం కలిగించే విధంగా ఉండేది. వాటిపై లక్షల మంది దేశవ్యాప్తంగా బీడీ తయారీపై కుటుంబాలు ఉన్నాయి. అవి కూడా నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలే, ఈ బీడీ పరిశ్రమపై ఆధారపడి ఎంతో కొంత ఆర్థికంగా బీడీలు తయారుచేసి, ఆర్థికంగా ఆసరా పొందేవారు. అయితే కేంద్ర ప్రభుత్వం వాటిని పరిధిలోకి తీసుకోకుండా బీడీ ప్యాకింగ్ పై 80శాతం పుర్రె గుర్తు క్యాన్సర్ గుర్తులు పెట్టాలని నిబంధనలు జారీ చేసింది. అలాగే నూతనంగా జీఎస్టీని తీసుకువచ్చింది. ఏకంగా 28శాతం జీఎస్టీని బీడీ కంపెనీలపై భారం మోపింది. దీంతో బీడీ పరిశ్రమలు నిర్వీర్యం అవుతూ వచ్చాయి. అలాగే గతంలో 23 రోజులు పైగా నెలకు పని దినాలు బీడీ కార్మికులకు ఉంటే, 1000 బీడీలకు గాను ఎంతో కొంత వచ్చేవి. దీంతో వారి కుటుంబంలో కొంతమేర ఆర్థిక పరిస్థితి కష్టకాలంలో ఆదుకునేది. కానీ ప్రస్తుతం బీడీ పరిశ్రమలు మూతపడటంతో పది రోజులు కూడా పది దినాలు బీడీ కార్మికులకు దొరకడం లేదు. అది కూడా బీడీ కంపెనీలు కేవలం రోజుకు రూ.500 బీడీల చెప్పుకునే తీసుకోవడం వల్ల వెయ్యి బీడీలు చేసే కార్మికులు ప్రస్తుతం 10 రోజుల అనుకుంటున్న దశలో వారికి నెలలో ఐదు రోజులు పని దినాలు దొరుకుతున్నాయని చెప్పుకోవచ్చు. ఇది ఇలా ఉండగా 1000 బీడీలకు గాను ప్రభుత్వ నిబంధనల ప్రకారం కార్మికుల చట్టాల ప్రకారం రూ.300 ఇవ్వాలి కానీ ప్రస్తుతం రూ.130 బీడీ కంపెనీలు కార్మికులకు ఇస్తున్నారు. దీంతో ప్రశ్నించేవారే లేకుండా పోయారు. ఒకవేళ కార్మికులు ప్రశ్నిస్తే వారి సంబంధిత గుర్తింపు కార్డును రద్దు చేస్తామంటూ బీడీ కంపెనీ యజమానులు భయాందోళనలకు గురి చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నామ్మాత్రంగా గతంలో రూ.2016 జీవన భృతి ఇవ్వగా, కానీ కేంద్రం పెట్టిన 80శాతం క్యాన్సర్, పుర్రె గుర్తులు జీఎస్టీ పై ఎన్నడు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 4000 జీవన భృతి ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చింది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉండటంతో ఇది అమలు కావడం లేదు. అయినా ఇప్పటికీ ఎన్నికల కోడ్ పేరుతో ఇచ్చే ఆ నాలుగు వేల జీవన భృతి అమలు చేయలేకపోయింది. దీంతో బీడీ కార్మికుల్లో ఆందోళనలో నెలకొంది. జీవన భృతితో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమ బీడీ పరిశ్రమ అభివృద్ధిపై ఆసక్తి చూపెట్టి పని దినాలు కల్పిస్తే బీడీ కార్మికులకు వారి కుటుంబాలకు కొంత ఆసరాగా ఉంటుంది.

బీడీ కార్మికులకు జీవన భృతితో పాటు పని దినాలు పెంచాలి

రోజురోజుకు బీడీ పరిశ్రమలు నిర్వీర్యం అవుతున్నాయి. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల బీడీ కార్మికులు తమ ఉపాధిని కోల్పోతున్నారు. ప్రభుత్వాలు ఇచ్చే జీవన భృతితో పాటు పని దినాలు పెంచాలి. అలాగే ఎలాంటి నిబంధనలు లేకుండా ప్రతి ఒక్కరికి జీవన భృతిని అందజేయాలి.

కట్ల లక్ష్మి, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు, నిర్మల్

ప్రోత్సాహం కరువు..!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని జిన్నింగ్ పరిశ్రమలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అవసరమైన ప్రోత్సాహకాలు లభించకపోవడంతో నష్టాల బాటన పయనమవుతున్నాయి. ఇప్పటికే కొన్ని జిన్నింగ్ మిల్లులు మూతపడగా.. మరికొన్ని అదే దారిలో ఉన్నట్లు కనిపిస్తోంది. అధిక విద్యుత్ ఛార్జీలు, ఏండ్ల తరబడి జీఎస్టీ బకాయిలు పెండింగ్‌లో ఉండటం, మార్కెట్ ఫీజును కూడా అమాంతం పెంచడం కారణంగా ఇక్కడ పండిస్తున్న పత్తి పంటను రైతులు మహారాష్ట్రకు తరలించడం వంటి కారణాలతో జిన్నింగ్ పరిశ్రమలు అవరోధాలు ఎదుర్కొంటున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఫలితంగా జిన్నింగ్ మిల్లులను నడపడమే కష్టంగా మారుతోందని యజమానులు చెబుతున్నారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించి ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు దృష్టిసారించకపోవడం మూలంగా వేలాది మంది ఉపాధికి దూరం కావాల్సి వస్తోందనే వాదన వినిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని జిన్నింగ్ పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక కథనం..

- సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న పత్తి పరిశ్రమ
- కష్టాలు భరిస్తూ.. నష్టాల్లోకి నెట్టివేయబడుతున్న వైనం
- మహారాష్ట్రకు తరలివెళ్తున్న ఆదిలాబాద్ పత్తి
- సమస్యల వలయంలో జిన్నింగ్ పరిశ్రమలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటేనే పత్తి పంటకు ప్రధాన కేంద్రంగా పిలుస్తారు. ఈ పంటకు అనుబంధంగా అనేక జిన్నింగ్ పరిశ్రమలు వెలిశాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 200వరకు జిన్నింగ్ మిల్లులు నెలకొల్పగా.. వేలాది మంది వీటి ద్వారా ఉపాధి పొందేవారు. కానీ పరిశ్రమలకు ప్రభుత్వాలు రాయితీలు ఇవ్వకపోవడం కారణంగా అనేక పరిశ్రమలు నష్టాలు మూటగట్టుకున్నాయి. ఫలితంగా ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 90 నుంచి 100వరకు మాత్రమే జిన్నింగ్ పరిశ్రమలు కొనసాగుతున్నాయి. మిగితా వాటిని గోదాములుగా మార్చడం..ఇతర అవసరాలకు వినియోగించుకోవడం వంటి సందర్భాలున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో నాణ్యమైన పత్తి పండటం మూలంగా అంతర్జాతీయంగా డిమాండ్ ఉంటుంది. కొన్నేండ్ల క్రితం వరకు ఓ వెలుగు వెలిగిన ఈ జిన్నింగ్ పరిశ్రమలకు అవసరమైన ప్రోత్సాహం లేకపోవడం కారణంగా అవస్థల వలయంలో చిక్కుకుంటున్నట్లు తెలుస్తోంది. పక్కనున్న మహారాష్ట్రతో పోల్చితే ఇక్కడ విద్యుత్ మినిమం ఛార్జీలు ఎక్కువగా ఉంటుంది. ఇక్కడకు..అక్కడకు ప్రతి నెలా సుమారు రూ.50వేల వరకు బిల్లులో తేడా వస్తుందని వ్యాపారులు చెబుతున్నారు. ముఖ్యంగా జిల్లాలో ఏడాదిలో కేవలం 4నెలలు మాత్రమే జిన్నింగ్‌లు పనిచేస్తుంటాయి. మిగితా ఎనిమిది నెలలు మిల్లులు నడవకుండా ఖాళీగా ఉన్నప్పటికీ విద్యుత్ ఛార్జీలు మాత్రం తప్పనిసరిగా చెల్లించాల్సి వస్తోంది. ఇలా ప్రతి ఏటా రూ.4లక్షల వరకు కేవలం ఈ ఛార్జీలు చెల్లించేందుకే వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మహారాష్ట్రకు మన పత్తి..!

మహారాష్ట్రలో రైతులకు మార్కెట్ ఫీజు మినహాయింపు ఉంటుంది. ఇదే మన దగ్గర మాత్రం రైతులు కచ్చితంగా మార్కెట్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఒకప్పుడు కిలో పత్తికి కేవలం రూ.40వరకు మార్కెట్ ఫీజు ఉండగా.. ప్రస్తుతం కిలోకు రూ.70నుంచి రూ.80వరకు ఈ ఫీజు చెల్లించాల్సి వస్తోంది. ఫలితంగా ఉమ్మడి జిల్లాలోని అనేక మంది రైతులు నాణ్యమైన పత్తిని పొరుగు రాష్ట్రానికి తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. దీంతో మన దగ్గర నాణ్యమైన పత్తి మార్కెట్‌కు రాకపోగా.. కొరత ఏర్పడటం కారణంగానూ సమస్యలు తలెత్తుతున్నాయి. దీని కారణంగా రాష్ట్ర ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలో రావాల్సిన ఆదాయం కూడా పొరుగు రాష్ట్రానికి వెళ్లిపోతోంది. మరోపక్క 2014-15 నుంచి జీఎస్టీ బకాయిలు ఇప్పటికీ రావడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ఇలాంటి సమస్యల కారణంగానూ జిన్నింగ్‌లు నడపటం కష్టంగా మారుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోపక్క జాతీయంగా మార్కెట్‌లో బేళ్ల ధరల్లో హెచ్చుతగ్గులు ఉండటం..అమాంతం ధరలు తగ్గిపోవడం కారణంగానూ వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలుస్తోంది. ఫలితంగా జిన్నింగ్ మిల్లులు నడిపించడం కష్టంగా మారడంతో ఈ పరిశ్రమలు మూతపడుతున్నాయని తెలుస్తోంది.

ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాలి

రాజు చింతావార్, జిల్లా అగ్రో ఇండస్ట్రీస్ సంఘం అధ్యక్షుడు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమలకు అవసరమైన రాయితీలు కల్పించాలి. ఇప్పటికే జీఎస్టీ అమలవుతున్న దృష్ట్యా మార్కెట్ ఫీజు మినహాస్తే రైతులు పత్తిని ఇక్కడే విక్రయించేందుకు అవకాశం ఉంటుంది. మరోపక్క విద్యుత్ ఛార్జీలపైనా ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంటే బాగుంటుంది. ప్రభుత్వాలు అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తే పరిశ్రమలు కొనసాగడంతో పాటు పలువురికి ఉపాధి లభిస్తుంది.

కార్మిక హక్కుల సాధనకు సీఐటీయూ కృషి

నవతెలంగాణ-నస్పూర్



కార్మికులను చైతన్యవంతం చేసి స్వతహాగా పోరాటం చేసి హక్కుల సాధనకు సీఐటీయూ కృషి చేస్తుందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు గుల్ల బాలాజీ అన్నారు. నేడు కార్మికుల దినోత్సవం సందర్భంగా కార్మికులకు, కర్షకులకు ప్రపంచ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. సీఐటీయూ పోరాటంలో భాగంగానే సింగరేణిలో సొంతింటి కలను గత నాలుగు సంవత్సరాలుగా కార్మికులకు అవగాహన కల్పిస్తూ పోరాటం చేపడుతున్నామన్నారు. అంతే కాకుండా నిరవధిక నిరాహార దీక్షకు పూనుకుంటే ప్రభుత్వం, యాజమాన్యం కలిసి దీక్షను భగ్నం చేసిన కార్మికులకు అవగాహన కల్పిస్తూ ఉండడం వల్ల పెద్ద సంఖ్యలో యూనియన్‌లో చేరుతున్నారని తెలిపారు. ఇప్పుడు కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం చేత కూడా సింగరేణి కార్మికుల సొంతింటి కలను గురించి మాట్లాడేలా చేయడంలో ముందున్నామని, సమస్య ఏదైనా అవగాహన కల్పించడం కేవలం సీఐటీయూతోనే సాధ్యమని అన్నారు. అన్ని ఏరియాల్లో యువ కార్మికులు స్వచ్ఛందంగా యూనియన్‌లో చేరుతూ బలోపేతం చేస్తున్నారని పేర్కొన్నారు.

కార్పొరేట్ అస్పత్రి ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-నస్పూర్



కార్మికులకు మెరుగైన చికిత్సను అందించేందుకు ప్రతి రీజియన్‌లో ఒక కార్పొరేట్ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని టీబీజీకేఎస్ ఏరియా మాజీ వైస్ ప్రెసిడెంట్ కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలుపుతూ నవ తెలంగాణతో మాట్లాడారు. సింగరేణిలో సకలజనుల సమ్మెకు వేతనాలు ఇప్పించ్చిన ఘనత టీబీజీకేఎస్‌కు దక్కుతుందని తెలిపారు. అలాగే కార్మికుల క్వార్టర్‌లకు ఎలక్ట్రికల్ ఛార్జ్ రద్దు చేపించి ఉచిత ఏసీ సౌకర్యాన్ని కల్పించామన్నారు. లాభాల వాటాని 16 శాతం నుండి 32 శాతనికి పెంచామని, ఇల్లు కట్టుకునే కార్మికునికి రూ.10 లక్షల రుణాన్ని ఇప్పించి వడ్డీ రియంబర్స్ ఇప్పించామని, ఐటీఐ, ఐఐఎం చదివే కార్మికుల పిల్లలకు ఫీ రియంబర్స్మెంట్ ఇచ్చే విదంగా చేశామని, సింగరేణిలో కూడా మహిళలకు ఉద్యోగ అవకాశాన్ని కల్పించామన్నారు. కార్మికులకు పదవి విరమణ చేసేలోగా సొంతింటి కలను నిజం చేయాలని, బొగ్గు గనులలో కార్మికులు ప్రాణాలకు తెగించి పనులు చేస్తున్నారని వారికి ఐటీ మాఫీ చేయాలన్నారు. సింగరేణి పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్ను తీసుకురావాలని తెలిపారు.

నవతెలంగాణ

పెట్రోల్ బంకుల్లో కనిపించని సౌకర్యాలు

- నిబంధనలు విస్మరిస్తున్న యాజమాన్యాలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

తనిఖీలు మరిచిన అధికారులు

జిల్లాల్లోని పెట్రోల్ బంకుల్లో కనీస సౌకర్యాలు కనిపించడం లేదు. వాహనదారులకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని నిబంధనలు చెబుతున్నా ఆయా బంకుల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. కనీసం తాగునీరు లేకపోవడం.. మరుగుదొడ్లు, మూత్రశాలలు మచ్చుకైనా కనిపించకపోవడం, వాహనాల్లో గాలి కొట్టించే సౌకర్యం లేకపోవడం వంటి సమస్యలు కనిపిస్తున్నాయి. నిరంతరం తనిఖీలు చేపడుతూ నిబంధనలు పక్కాగా అమలు చేయించాల్సిన అధికారులు అటువైపు దృష్టిసారించడం లేదు. ఫలితంగా ఆయా బంకులకు వెళ్తున్న వేలాది మంది వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. కనీస సౌకర్యాలు తీర్చుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బంకు యాజమాన్యాలు యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నా పౌరసరఫరాలశాఖ అధికారులు అటువైపు దృష్టిసారించడం లేదు. మామూలుగా తీసుకుంటూ సౌకర్యాలపై కన్నెత్తి చూడటం చూడటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ రూరల్



పెట్రోల్ బంకుల్లో కనీస నిబంధనలు పాటించడం లేదు. ఆయా బంకుల యాజమాన్యాలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. తొలుత అన్ని సౌకర్యాలు కల్పిస్తామని అనుమతులు తీసుకుంటున్న యాజమాన్యాలు బంకులు ప్రారంభించిన తర్వాత వాటిని విస్మరిస్తున్నారు. పెట్రోల్ బంకు ప్రారంభించే సమయంలో తాగునీటి వసతి, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణంతో పాటు వాహనాల టైర్లలో గాలి కొట్టించే పరికరం సైతం అందుబాటులో ఉంచుతారు. అనేక వాటిలో వీటిని ఏర్పాటుచేసి అనుమతులు తీసుకుంటున్నా..కొన్ని బంకులు మాత్రం కేవలం తాగునీటి సౌకర్యం మాత్రం అందుబాటులో ఉంచి అన్ని ఉన్నట్లు అనుమతులు తీసుకుంటున్నారు. తీరా ఏర్పాటుచేసిన తర్వాత ఆయా సౌకర్యాలేమీ కనిపించడం లేదు. మరికొన్ని చోట్ల తాగునీటి డబ్బాను ఏర్పాటుచేసినా అందులో నీళ్ల ఉండటం లేదు. వాటి పక్కన అపరిశుభ్ర వాతావరణం ఉండటంతో తాగేందుకు కూడా ఇష్టపడటం లేదు. మరోపక్క కొన్నింటిలో మినహా అనేక చోట్ల మరుగుదొడ్లు, మూత్రశాలలు మచ్చుకైనా కనిపించడం లేదు. అధికారులు ఎవరూ తనిఖీలు చేయకపోవడం మూలంగా ఆయా బంకుల యాజమాన్యాలు సౌకర్యాలు కల్పించడం లేదనే ఆరోపణలున్నాయి.

తప్పని ఇబ్బందులు..!

పెట్రోల్ బంకుల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 64 పెట్రోల్ బంకులు ఉండగా.. ఉమ్మడి జిల్లాలో పరిధిలో సుమారు 250వరకు ఉంటాయని అధికారవర్గాలు చెబుతున్నారు. వీటి పరిధిలో రోజూ వేలాది వాహనాలు పెట్రోల్, డీజిల్ పోయించుకుంటాయి. ఈ సమయంలో వాహనదారులు, ప్రయాణికులు దాహం వేస్తే తాగునీరు కూడా లభించని పరిస్థితి ఉండటం లేదు. ముఖ్యంగా చాలా చోట్ల మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు అవస్థలు పడాల్సి వస్తోంది. చాలా చోట్ల గాలి కొట్టించే సౌకర్యం లేకపోవడమూ వాహనదారులకు సమస్యగా మారుతోంది. పౌరసరఫరాలశాఖ పరిధిలో ఉండే ఈ పెట్రోల్ బంకుల్లో సౌకర్యాలపై ఆ శాఖ అధికారులు ఆరా తీయాల్సి ఉంటుంది. కానీ మామూలుగా తీసుకుంటూ వీటి వైపు దృష్టిసారించకపోవడం మూలంగా యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలున్నాయి. కిందటేడాది నుంచి అధికారులు తనిఖీలు చేపట్టిన సందర్భాలు కనిపించడం లేదనే విమర్శలున్నాయి. ఎప్పటికప్పుడు పరిశీలన చేపడుతూ పెట్రోల్ బంకుల్లో సౌకర్యాలపై ఆరా తీయాల్సిన అధికారులు అలసత్వం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

సీఎం సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కెరమెరి



ఈ నెల 2న జిల్లాకు రానున్న సీఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణకు మద్దతుగా ఎన్నికల ప్రచార సభలో రేవంత్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రతి కార్యకర్త సీఎం ప్రచార సభను విజయవంతం చేసేందుకు బాధ్యతగా పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు కె. విశ్వప్రసాద్ రావు, అజ్మీరా శ్యామ్‌నాయక్, ఆడే గజేందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్, ఆత్రం లక్ష్మణ్‌రావు, నాయకులు కుసుంరావు, దండుగుల శ్రీనివాస్, తిరుపతి, వెంకటస్వామి పాల్గొన్నారు.

వెట్టిచాకిరి బతుకులు..!

(మొదటి పేజీ తరువాయి)

లేని పరిస్థితి. రేకుల షెడ్డుల్లో నివాసమంటూ పనిచేస్తున్నారు. ముఖ్యంగా మహిళలకు ప్రత్యేకంగా మూత్రశాలలు, మరుగుదొడ్ల తదితర సౌకర్యాలు ఉండాల్సి ఉన్నప్పటికీ యాజమాన్యాలు వాటికి కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయి. మరోపక్క జిల్లా కేంద్రాల్లో ఉన్న దుకాణాలు, షాపింగ్ మాల్‌లలో అక్కడ పనిచేస్తున్న వారికి కనీసం కూర్చోవడానికి కుర్చీలు కూడా ఉండటం లేదు. ఉదయం 9గంట నుంచి రాత్రి 9గంటల వరకు పనిచేస్తూ అనారోగ్యానికి గురవుతున్నారు. కచ్చితంగా 8గంటల పని విధానం అమలు చేయాల్సి ఉన్నప్పటికీ ప్రస్తుతం 12గంటల వరకు పనిచేస్తున్నారు. కేంద్రప్రభుత్వం కార్మికచట్టాల స్థానంలో లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తోంది. ప్రభుత్వ సంస్థలను ప్రయివేటీకరించడం..నూతన పరిశ్రమలను నెలకొల్పకపోవడం సమస్యల కారణంగా అనేక మంది యువతకు ఉపాధి లభించలేని పరిస్థితి వస్తోంది.

దృష్టిసారించని అధికారులు..!

కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు రూపొందించిన చట్టాలు, నిబంధనలు కచ్చితంగా అమలు చేయాల్సిన అధికారులు అటువైపు దృష్టిసారించడం లేదు. పని ప్రదేశాలతో పాటు కార్మికులకు అనేక ప్రయోజనాలు దూరమవుతున్నా పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. కనీసం దుకాణాల్లో తనిఖీలు చేపడుతున్న దాఖలాలు కూడా కనిపించడం లేదు. పని ప్రదేశాల్లో కార్మికులు దుర్భర జీవితం గడుపుతున్నా అటువైపు దృష్టిసారించడం లేదనే ఆరోపణలున్నాయి. కనీసం కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వ పథకాల అమల్లోనూ తీవ్ర నిర్లక్ష్యం కనబరుస్తున్నారనే అపవాదు ఉంది. పాలకుల పట్టింపులేనితనం.. అధికారుల పర్యవేక్షణ లేని మూలంగా కార్మికులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి తలెత్తుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సివిల్ సప్లయి కార్మికులకు దొరకని భరోసా

- ఉద్యోగులుగా గుర్తించాలంటూ డిమాండ్
- అమలు కాని జీఓలు
- ఏఐటీయూసీ అండగా పోరాటం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజలకు నిత్యాసర సరుకులు అందించే పౌరసరఫరాల శాఖలో హమాలీ కార్మికుల పాత్ర ఎంతో ఉంటుంది. సరుకులను దించడం ఎక్కించడంలో 24 గంటలు అందుబాటులో ఉంటూ పని చేస్తారు. అయినప్పటికీ వారి పనికి తగిన గుర్తింపు లేకపోవడం కనీసం వారి అవసరాలు తీర్చే వేతనాలు కూడా రాకపోవడంతో వారు పడుతున్న ఆవేదన అంతా ఇంతా కాదు. మేడే సందర్భంగా వారి కష్టాలపై ప్రత్యేక కథనం.

జిల్లాలో 60 మంది కార్మికులు

జిల్లాలో పౌరసరఫరాల శాఖ ద్వారా ఆసిఫాబాద్, జైనూర్, సిర్పూర్, కాగజ్ నగర్, బెజ్జూర్‌లో మొత్తం 5 సెంటర్లు కొనసాగుతున్నాయి. వీటిలో సరుకులను లోడింగ్ అన్‌లోడింగ్ చేడానికి మొత్తం 60 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. వీరు 10 నుండి అంతకంటే ఎక్కువ సంవత్సరాలు ఇదే శాఖలో పనిచేస్తున్న వారు ఉన్నారు. అయిన వీరి శ్రమకు గుర్తింపు లేకుండా పోతోంది.

కార్మికుల డిమాండ్లు ఇవే..



పౌరసరఫరాలో పని చేస్తున్న తమను గుర్తించడం లేదని హామీలు ఆరోపిస్తున్నారు. హమాలీ కార్మికులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి. కార్మికులకు బకాయి ఉన్న మొత్తాలను చెల్లించాని కోరుతున్నారు. మిల్లర్ల నుండి రావాల్సిన రూ.11 వేల కోట్ల మొత్తాన్ని వసూలు చేయాలని, పెరుగుతున్న ధరల కనుగుణంగా కార్మికుల రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. బస్తా రేటు క్వింటాల్‌కు రూ.35 పెంచాలని, ఈఎస్ఐ, పీఎస్ సౌకర్యం కల్పించాలని, బోనస్ రూ.10,000 పెంచుతూ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. కనీస వేతనం 26,000 ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అమలు కాని జీఓలు

రెండు సంవత్సరాలకు ఒకసారి పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచడానికి గతంలో ప్రభుత్వం జీఓ జారీ చేసింది. అయితే దీని ప్రకారం గత డిసెంబర్ నెలలో కాంట్రాక్టు ముగిసి జనవరి 1 నుండి వారి వేతనాలు పెంచాల్సి ఉంది. కానీ అదేది జరగడం లేదు. కనీసం జారీ చేసిన జీఓలు అమలు చేసేలా ప్రభుత్వం కృషి చేయాలని కార్మికులు కోరుతున్నారు.



ఏఐటీయూసీ అండగా పోరాటం

సివిల్ సప్లయి కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ మొదటి నుంచి వారికి అండగా ఉండి పోరాటం చేస్తుంది. గతంలో అనేక పోరాటాల సందర్భంగా వీరి సమస్యలు కొంతవరకు పరిష్కారం అయ్యాయి. మేడే సందర్భంగా ఈ పోరాటాన్ని మరింత కొనసాగించనున్నట్లు సంఘం నాయకులు చెబుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

సుధాకర్, సివిల్ సప్లయి కార్మికుడు



ప్రభుత్వం సివిల్ సప్లయి కార్మికులను ఆదుకోవాలి. 20 సంవత్సరాలుగా ఇదే విభాగంలో పనిచేస్తున్నాం. అయినప్పటికీ మాకు గుర్తింపు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే నాలుగో తరగతికి ఉద్యోగులుగా గుర్తించి మాకు భద్రత కల్పించాలి. గతంలో ఇచ్చిన జీఓలు అమలు చేయాలి.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి.

భోగే ఉపేందర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి



సివిల్ సప్లయి శాఖలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కారం చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలి. సేవ దృక్పథంతో సివిల్ సప్లయి శాఖను చూడాలి. కానీ ఆర్థిక వనరుల నేపథ్యంలో చూడకూడదు. కార్మికులకు సంబంధించిన జారీ చేసిన జీఓలు అమలు చేయాలి. వెంటనే రేట్లను పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సవరించాలి. జిల్లాలోని అన్ని రంగాల కార్మికులకు మే డే శుభాకాంక్షలు.

కార్మికుల ఆకాంక్షకు ప్రతీక మేడే

- అధ్వానంగా మారిన కార్మికుల పరిస్థితి
- మరో పోరాటానికి సిద్ధమయ్యే ప్రయత్నం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

1886 మే 1న అమెరికా చికాగో నగరంలోని హే మార్కెట్‌లో 8 గంటల పని దినం కోరుతూ లక్షలాది మంది కార్మికుల ప్రదర్శనపై ఆనాటి పాలకవర్గం ఆదేశాలతో పోలీసులు ప్రదర్శనకారులపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. అయిన కార్మికులు వెనక్కి తగ్గలేదు. ఆ పోరాటంతో కార్మికులు ఎనిమిది గంటల పని దినాన్ని సాధించుకున్నారు. సంఘటిత అసంఘటిత రంగాల్లో అనేక మంది పనిచేస్తున్నారు. ప్రభుత్వాలు వీరికి చేయూత ఇవ్వాల్సింది పోయి వారి బాగోగులు పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. మరోసారి 1886 పునరావృతం అవుతుందని కార్మిక సంఘాలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో మే డే ప్రత్యేక కథనం.

కార్మికుల ఆకాంక్షకు ప్రతీక మేడే

1886లో అప్పుడు ఉన్న పాలకులు కార్మికులను శ్రమ దోపిడీ చేస్తుంటే దానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి ప్రతీకగా మేడే నిలిచింది. కార్మికుల ఐక్యతకు గుర్తుగా అప్పటినుండి మే డే వేడుకలు కార్మిక సంఘాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

అధ్వానంగా మారిన కార్మికుల పరిస్థితి

పదేండ్ల బీజేపీ హయాంలో సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల పరిస్థితి అద్వానంగా తయారైంది. ప్రభుత్వం పూర్తిగా కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ కార్మిక చట్టాలను ఇష్టమొచ్చినట్లు సవరించింది. పోరాడి సాధించిన 44 చట్టాలను సవరించి నాలుగు కోడులుగా మార్చి కార్మికులకు పోరాడే అవకాశం లేకుండా చేసింది. ప్రజాస్వామ్యంలో హక్కుల కోసం పోరాడాల్సి

ఉన్నప్పటికీ ప్రస్తుత బీజేపీ హయాంలో అదేది కనిపించడం లేదు.

మరో పోరాటానికి సిద్ధమవుతున్న సంఘాలు

దేశవ్యాప్తంగా లక్షలాది మంది కార్మికులు వివిధ రంగాల్లో పనిచేస్తున్నారు. వీరి హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే దిశగా కార్మిక సంఘాలు మరో పోరాటానికి సిద్ధమవుతున్నాయి. కార్మిక ప్రజా సంఘాలు కేంద్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన నూతన కార్మిక చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఇదే జరగకుంటే రానున్న రోజుల్లో అన్ని సంఘాలు కలిసి కేంద్ర ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించనున్నట్లు వెల్లడిస్తున్నాయి.

కార్మిక చట్టాల సవరణ కోసం యుద్ధానికి సిద్ధం

అల్లూరి లోకేష్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు.



బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత అంబానీ, ఆదానీలకు కొమ్ముకాస్తూ కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి అన్యాయం చేసింది. రైతులను ఇబ్బంది పెట్టే విధంగా చేసిన రైతు చట్టాలపై ఏ విధంగానైతే వెనకడుగు వేసిందో అదే తంతాను కార్మిక చట్టాలు కూడా అవలంబించేలా ఒత్తిడి తీసుకువస్తాం. కార్మిక చట్టాలను వెంటనే పాత విధానంలోకి మార్చాలి.

కార్మికుల సమస్యలపై పోరాటమే లక్ష్యం

- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమాజ అభివృద్ధిలో కార్మికుల పాత్ర వెలకట్టలేనిది. అటువంటి కార్మికులకు ప్రభుత్వాలు పెద్దపీట వేయకపోవడం తీవ్రంగా ఖండించాల్సిన అంశం. ఏ ప్రభుత్వం వచ్చినా కార్మికులకు అండగా ఉంటామని చెబుతున్నప్పటికీ నిజజీవితంలో జరగడం లేదని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ అన్నారు. మంగళవారం ప్రపంచ కార్మిక దినోత్సవం(మేడే) సందర్భంగా నవతెలంగాణతో తన అనుభవాలు పంచుకున్నారు.

పోరాటాలతోనే సమస్య పరిష్కారం



సింగరేణికి నాలుగు బొగ్గు బ్లాక్ లను కేటాయించాలని పోరాటాలు, ధర్నాలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టాం. దీనికి అనుకూలంగా దేశవ్యాప్త సమ్మె చేయడం జరిగింది. కోల్ ఇండియాలో విదేశీ పెట్టుబడులను వెంటనే ఉపసంహరించుకోవాలని దేశవ్యాప్త సమ్మెతో పాటు, తెలంగాణ రాష్ట్రంలో సింగరేణి వ్యాప్తంగా తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. సింగరేణి కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు చేయాలని, వడ్డీ లేని రుణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులు 30 వేల మంది పనిచేస్తున్నారని, వీరందరికి కూడా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని గతంలో చేసిన సమ్మె ప్రకారం ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. సింగరేణిలో అన్ని విభాగాలు పనిచేస్తున్నటువంటి కాంట్రాక్టు కార్మికులకు సీఎం పీఎం హాస్పిటల్ సౌకర్యం లేదా ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో రద్దు చేసిన ట్రేడ్ యూనియన్ లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎస్సీఎం కార్మికులకు అండగా పోరాటం చేస్తున్నామని పాత కార్మికులను యథావిధిగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల కనీస వేతనం రూ.32వేలు ఇవ్వాలన్నారు. సివిల్ సప్లై హమాలీ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులకు జీవో నెంబర్ 15 ప్రకారం వేతనాలు ఇవ్వాలని గతంలో సమ్మె చేశామని, దీనికి అనుగుణంగా అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుని అమలుపరచడం తమ విజయమన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులలో మల్టీపర్పస్ విధానాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. రెండవ ఏఎన్ఎం లను జీవో నెంబర్ 16 ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఏఐటీయూసీ కార్మికులకు అండగా ఉండి పోరాడుతుందని పునరుద్ఘాటించారు. జిల్లాలోని వివిధ రంగాల్లో పనిచేస్తున్న సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

మిషన్ భగీరథ కార్మికుల వ్యథ

- నాలుగు నెలలుగా అందని వేతనాలు
- అప్పులు చేసి తిప్పలు పడుతున్న కార్మికులు

నవతెలంగాణ-దహెగాం

ఉద్యోగులకు వేతనాలు ఒక్కరోజు ఆలస్యంగా వస్తేనే వారు ఎంతో ఇబ్బంది పడిపోతారు. అలాంటిది నెలల తరబడి వేతనాలు రాని ఉద్యోగుల కుటుంబ పరిస్థితులు, ఆర్థిక బాధలు మాటల్లో వర్ణించలేం. అలాంటి కోవకే చెందుతారు. మిషన్ భగీరథ(గ్రిడ్)లో పనిచేస్తున్న ప్రయివేటు కార్మికులు. చాలీచాలని వేతనాల కోసం ప్రతిరోజు కష్టపడుతూ ప్రజలందరికి తాగునీరు అందించే మిషన్ భగీరథ కార్మికులు నెలల తరబడి వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్న వైనంపై నవతెలంగాణ ప్రత్యేక కథనం...

వేతనాల కోసం ఎదురుచూపులు

జిల్లావ్యాప్తంగా వందలాది మంది కార్మికులు మిషన్ భగీరథ పథకంలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్నారు. కేవలం దహెగాం మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 30 మంది కార్మికులు ఆపరేటర్, సూపర్వైజర్, హెల్పర్స్, ఫిట్టర్స్‌లుగా తమ సేవలను అందిస్తున్నారు. వీరంతా ఉదయం నుండి రాత్రి వరకు గ్రామగ్రామానికి వెళ్లి మిషన్ భగీరథ నీటిని రెండు పూటల ప్రజా అవసరాలకు అందిస్తున్నారు. చిన్నపాటి సమస్య వచ్చిన వెంటనే వెళ్లి దానిని సరిచేసి నీరు అందించాల్సి ఉంటుంది. ప్రస్తుత వేసవికాలంలోనైతే ఏ ఒక్క గ్రామానికి నీరందించకపోయిన సమస్య కఠినమవడమే కాకుండా ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. ఎండకు ఎండుతూ, వానలో తడుస్తూ, చలికి వణుకుతూ ప్రజల అవసరాలను తీర్చుతున్న తమకు మాత్రం వేతనాలు సక్రమంగా రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదంటున్నారు.

భారంగా కుటుంబపోషణ...

కుటుంబాలకు కాస్తోకూస్తో ఆసరాగా ఉందామని మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికులకు నేడు కుటుంబ పోషణ భారంగా మారింది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం భవిష్యత్తు అందంగా ఉంటుందని ఆశతో ఉద్యోగంలోకి చేరిన కార్మికులకు ఏజెన్సీలో అందించే



వేతనాల కోసం అంబేద్కర్ వినతిపత్రం అందిస్తున్న భగీరథ కార్మికులు(ఫైల్)

చాలీచాలని వేతనాలు సైతం సక్రమంగా అందించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేతనాలు పెంచడం మాట ప్రక్కన పెడితే నెలల తరబడి వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నాలుగు నెలలుగా వేతనాలు అందకపోవడంతో చేసిన అప్పులు ముట్టక, కొత్తగా అప్పు దొరకక కుటుంబ పోషణ భారంగా మారి తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులకు, ప్రజా ప్రతినిధులకు చెప్పిన ప్రయోజనం లేకుండా పోతుందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు విడుదల చేయాలని కార్మికులు కోరుతున్నారు.

వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నాం

సురేష్, ఆపరేటర్, బోర్లకుంట



నాలుగు నెలలుగా జీతం రావడంలేదు. అసలే తక్కువ జీతానికి పనిచేస్తున్నాం. దానికి తోడు నాలుగు నెలలుగా జీతం రాకపోవడంతో అప్పు పుట్టక పూటగడవడం కష్టమవుతుంది. ప్రతిరోజు ఉదయం నుండి రాత్రి వరకు గ్రామగ్రామానికి వెళ్లి నీటిని విడుదల చేద్దామంటే కనీసం బండిలో పెట్రోల్ కూడా, చిల్లర ఖర్చులకు కూడా డబ్బులు లేక ఇబ్బంది అవుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు విడుదల చేయాలి.

ఆదరణకు నోచుకోని సీఎఫ్‌సీ

గిరిజన అభివృద్ధి సంస్థ ఐటీడీఏ అమలుచేస్తున్న పథకాలలో సీఎఫ్‌సీ(కామన్ ఫెసిలిటి సెంటర్) ఆదరణకు నోచుకోవడంలేదు. మండలకేంద్రంలోని ఈ కేంద్రానికి ప్రభుత్వం చేయూతనిస్తే ఫర్నీచర్ తయారీకేంద్రం మరింత మెరుగుపడే అవకాశం ఉండగా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. యువతకు ఉపాధి కల్పించాల్సిన ఈ తయారీ కేంద్రం పనికిరాకుండా పోతోంది. వివిధ పథకాల పేరిట రూ.కోట్ల నిధులు ఖర్చు చేస్తున్న ప్రభుత్వాలు ఇలాంటి ఉపాధి కల్పించే మార్గాలపై మాత్రం దృష్టిసారించడం లేదనే విమర్శలున్నాయి. గృహ, కార్యాయాల అవసరాలకు ఉపయోగపడే వివిధ రకాల ఫర్నీచర్ తయారుచేసే ఇలాంటి కేంద్రాల పట్ల పాలకులు, అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారు. ప్రభుత్వ సహకారం లేకపోవడంతో ఈ కేంద్రం నిర్వహించడం కష్టతరంగా మారుతోందని కార్మికులు వాపోతున్నారు. పదుల సంఖ్యలో కార్మికులకు ఉపాధినిచ్చే సీఎఫ్‌సీ సెంటర్‌పై ప్రత్యేక కథనం..

నవతెలంగాణ-వాంకిడి

- మూతపడిన ఫర్నీచర్ తయారీ కేంద్రం
- ప్రభుత్వమే ఆదుకోవాలని కార్మికుల వేడుకోలు
- దృష్టి సారిస్తే వందలాది మంది యువతకు ఉపాధి

ఉమ్మడిగా రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం 1971లో రాష్ట్రవ్యాప్తంగా 56 సీఎఫ్‌సీ కేంద్రాలను ప్రారంభించింది. ఇందులో భాగంగా అప్పటి తాలుకా కేంద్రమైన వాంకిడిలో రూ.తొమ్మిది వేల పెట్టుబడితో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం నుండి ఎలాంటి ఆర్థిక సాయం అందుకోకున్నా కార్మికులు వారు తయారుచేసిన ఫర్నీచర్ అమ్మకం ద్వారా వచ్చే ఆదాయంతోనే నడిపిస్తున్నారు. 1980లో దీనిని ఐటీడీఏ ఆధీనంలోకి తీసుకుంది. నిరుద్యోగ గిరిజన యువకులకు ఫర్నీచర్ తయారీలో శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో 1987-88 సంవత్సరంలో ఐటీడీఏ అధికారులు రూ.నాలుగు లక్షలతో



షెడ్లను నిర్మించారు. కాలక్రమేనా పంట కొరత ఏర్పడడంతో 1993-94 సంవత్సరంలో మెటల్ వర్క్స్‌ను సైతం ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని గమనించిన అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ సుకుమార్ ప్రహరీగోడ, షెడ్ల నిర్మాణానికి రూ.14 లక్షల విలువ చేసే యంత్ర సామగ్రిని సమకూర్చారు. దాదాపుగా 60 మంది నిరుద్యోగులకు ఉపాధి లభించింది.

రోజువారీ నిర్వహణకు సహకారం కరువు..!

కనీస సౌకర్యాలు కల్పించబడిన రోజువారీ నిర్వహణకు తగిన సహకారం లభించలేదు. కలప, మెటల్ ఫర్నీచర్ కోసం ప్రభుత్వం ఆర్డర్ ఇవ్వడంలేదు. కనీసం నిర్మించే ధరకు కూడా కలప సరఫరా చేయడంలేదు. ప్రయివేటు



వ్యాపారం మాదిరిగానే వేలంలో పాల్గొని కలప కొనుగోలు చేయాల్సి వస్తుంది. బహిరంగ వేలం ద్వారా ఎక్కువ ధర చెల్లించడంతో ఫర్నీచర్‌కు కూడా ఎక్కువ ధర నిర్ణయిస్తున్నారు. దీంతో ఫర్నీచర్ సామాన్యులకు అందుబాటులో ఉండటం లేదు. నాణ్యత, కళాత్మకంగా తయారయ్యే ఈ ఫర్నీచర్‌కు రాష్ట్రవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. అప్పట్లో ఇక్కడ తయారుచేసిన ఫర్నీచర్‌ను రంపచోడవరం, భద్రాచలం, పాలేరు ఐటీడీఏ కొనుగోలు చేశారంటే ఆ పని తనాన్ని అంచనా వేయవచ్చు. ప్రభుత్వ రంగ సంస్థ అయి ఉండి ప్రయివేటు వ్యాపారాలతో పోటీపడి కలప వేలంలో పాల్గొంటున్నారు. ప్రభుత్వమే సబ్సిడీపై నేరుగా కలపను సరఫరా చేస్తే సౌకర్యంగా ఉంటుందని కళా నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

ప్రభుత్వం ప్రోత్సహించాలి..!

రాష్ట్రంలో, జిల్లాలో కానీ ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమయ్యే ఫర్నీచర్‌ను ప్రయివేటు వ్యాపారుల వద్ద కొనుగోలు చేస్తున్నారు. దీంతో క్రమంగా ప్రభుత్వ ఆర్డర్లు తగ్గుముఖం పట్టడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. పని లేక ఇతర వృత్తుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇందులో ప్రొడక్షన్ ఓరియంట్ బేసిక్‌పైనే కార్మికులు ఫర్నీచర్ అమ్మగా వచ్చే లాభం నుండి జీతాలు తీసుకొని సీఎఫ్‌సీని కాపాడుతున్నారు. వాంకిడి సీఎఫ్‌సీ ఇంకా పనిచేయడానికి కార్మికుల శక్తి ఫలితమేననే అభిప్రాయాలు ఉన్నాయి. మండలంలో చాలామంది నిరుద్యోగులు గిరిజన, గిరిజనేతరులు చదువుకొని ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా ఉంటున్నారు. చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ఎలాంటి పరిశ్రమలు లేవు. ఈ సీఎఫ్‌సీని ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకొని ఇక్కడ మండలంలోని నిరుద్యోగ యువతి, యువకులు ప్రత్యేకమైన శిక్షణ కేంద్రాలను ఏర్పాటుచేసి శిక్షణ ఇచ్చినట్లయితే వారికి ఉపాధి లభించడంతో పాటు ఈ కేంద్రం మరింత అభివృద్ధి సాధించడానికి ఆస్కారం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



c m y k

నిబంధనలకు పాతర..!

ఇటుక బట్టీల నిర్వాహకులు నిబంధనలకు పాతరేస్తున్నారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే వీటిని యథేచ్ఛగా ఏర్పాటుచేస్తున్నారు. జిల్లాలో ఏండ్లుగా ఇలాంటి వ్యవహారం జరుగుతున్నా ఎవరూ పట్టిచుకోవడం లేదు. విచ్చలవిడిగా ఇటుక బట్టీలు వెలుస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. నిబంధనలు పాటించకపోయినా..అక్కడ పనిచేస్తున్న కార్మికులకు కనీస సౌకర్యాలు లేకపోయినా పట్టించుకోవడం లేదు. ఫలితంగా కాలుష్యంతో పాటు కార్మికులు సైతం వెట్టిచాకిరి చేయాల్సి వస్తోంది. పనిచేస్తున్న కార్మికులకు సంబంధించి అనుమతి తీసుకోవడం.. వారికి సౌకర్యాలు కల్పించడం వంటివేమీ కనిపించడం లేదు. ఫలితంగా కార్మికులు అసౌకర్యాల మధ్యనే పనులు చేయాల్సి వస్తోంది. మరోపక్క అధికార యంత్రాంగం వీటిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టి నిబంధనలు కఠినతరం చేయాల్సిన అధికారులు మామూలుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

- విచ్చలవిడిగా వెలుస్తున్న ఇటుక బట్టీలు
- కార్మికులకు మౌళిక వసతులు కల్పించడంలోనూ అలసత్వం
- మామూలుగా తీసుకుంటున్న కార్మికశాఖ



నవతెలంగాణ- ఆదిలాబాద్ రూరల్

జిల్లాలో ఇటుకబట్టీలకు కొదువలేకుండా ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. మైనింగ్, రెవెన్యూశాఖల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉన్నా అలాంటివేమీ పట్టించుకోవడం లేదు. ఫలితంగా పంట పొలాలు, మైదాన ప్రాంతాలతో పాటు ఏజెన్సీ ఏరియాలోనూ ఇటుకబట్టీలు పెడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో గ్రామాలకు సమీపంలోనే వీటిని ఏర్పాటుచేయడంతో వాతావరణం కలుషితమై ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. వీటి నుంచి వెలువడే పొగ, దుమ్ము దూళి కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే సమీపంలోని చెరువులు, అటవీ ప్రాంతాల నుంచి మట్టి తరలిస్తూ నిబంధనలు కాలరాస్తున్నారు. ఆయా శాఖలతో పాటు పంచాయతీల అనుమతులు కూడా తీసుకోవడం లేదు. వ్యాపారమే పరమావధిగా భావిస్తూ నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నా ఆయాశాఖల అధికారులు అటు వైపు దృష్టిసారించడం లేదనే విమర్శలున్నాయి.



సౌకర్యాలు ఏవీ..?

ఇటుకబట్టీలల్లో పనిచేస్తున్న కార్మికులకు వివిధ రకాల సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. జిల్లాలో ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులను ఇక్కడకు తీసుకొస్తూ వారితో పనులు చేయిస్తున్నారు. ఈ క్రమంలో ఎంత మంది కార్మికులు పనిచేస్తున్నారో వారి వివరాలతో పాటు వారిని ఇక్కడకు తీసుకొచ్చిన మధ్యవర్తుల వివరాలతో ఆయా బట్టీల యజమానులు కార్మికశాఖ వద్ద నమోదు చేయించాల్సి ఉంటుంది. కానీ కొందరు మినహా అనేక మంది ఇటుకబట్టీల యజమానులు ఈ నిబంధనలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. మరోపక్క ఇటుకబట్టీల వద్ద కార్మికులకు నివాసం ఉండేందుకు షెడ్డు నిర్మాణం, తాగునీరు, మరుగుదొడ్లు, ప్రథమ చికిత్స పెట్టెలు తదితర సౌకర్యాలను కచ్చితంగా కల్పించాల్సి ఉంటుంది. ఒకే దగ్గర కనీసం 20మంది పిల్లలు ఉంటే తప్పనిసరిగా అక్కడ పాఠశాల ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. లేదంటే సమీపంలోని బడిలో వారిని చేర్పించాల్సి ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో కార్మికులకు నిబంధనల మేరకు సౌకర్యాలు ఉన్నాయా..? లేదా అనేది అధికారులు తెలుసుకోవాల్సి ఉండగా..అలాంటివేమీ పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఫలితంగా కార్మికులు అసౌకర్యాల మధ్యనే పనులు చేయాల్సి వస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లాలో ఇటుకబట్టీల అనుమతులు, కార్మికులకు సౌకర్యాల కల్పన విషయమై మైనింగ్, రెవెన్యూ అధికారులను ఫోన్లో సంప్రదించగా.. వారు స్పందించకపోవడం గమనార్హం.

కార్మికుల సంక్షేమంపై చిత్తశుద్ధి ఏదీ..?

- నిబంధనల పాటించని వ్యాపార, వాణిజ్య సంస్థలు
- కార్మికుల సంక్షేమ నిధికి తిలోదకాలు
- నిబంధనలు విస్మరిస్తున్నా దృష్టిసారించని కార్మికశాఖ



నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్

ఏ వ్యాపారమైనా.. వాణిజ్యమైనా విస్తరించాలన్నా..అభివృద్ధి చెందాలన్నా అందులో కార్మికుల శ్రమ తప్పనిసరిగా ఉంటుంది. కార్మికుడు లేనిదే ఏ యంత్రమూ పనిచేయని పరిస్థితి. సంపదకు మూల కారకులైన కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు పూర్తిగా విస్మరిస్తున్నాయి. ముఖ్యంగా ఆయా దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో అనేక మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. వేలాది కార్మికులు అరకొర వేతనాలతో పరిశ్రమలు, దుకాణాలు, వాణిజ్య సంస్థల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా సంక్షేమబోర్డును ఏర్పాటుచేసింది. ప్రతి ఏటా నవంబర్‌లో ఆయా దుకాణ యజమానులు వారి వద్ద పనిచేస్తున్న పని చేస్తున్న కార్మికులకు బోర్డుకు సంక్షేమ నిధి జమ చేయాల్సి ఉంటుంది. యజమాని వాటా రూ.5, కార్మికుడి వాటా రూ.2లు కలిపి రూ.7చొప్పున సంక్షేమ నిధి చెల్లించాలి. ఇలా చెల్లిస్తే కార్మికుల కూతురి పెళ్లి చేస్తే రూ.15వేల ఆర్థిక సాయంతో పాటు పదో తరగతి దాటిన తర్వాత వారి పిల్లలకు స్కాలర్‌షిప్ రావడంతో ప్రమాదవశాత్తు లేదంటే అనారోగ్యం కారణంగా మరణిస్తే దహన సంస్కారాలకు రూ.15వేలు చెల్లిస్తుంది. ఏదైనా అనారోగ్యంతో ఆపరేషన్ జరిగితే ప్రభుత్వం అవసరమైన ఆర్థిక సాయం అందిస్తుంది. గతంలో ఆయా దుకాణ యజమానులు కార్మికుల పక్షాన సంక్షేమ నిధిని జమ చేసేవారు. కానీ కొన్నేండ్ల నుంచి పూర్తిగా విస్మరించడంతో కార్మికులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనాలు దక్కడం లేదు.

నిబంధనలు బేఖాతరు..!

కార్మికుల సంక్షేమం కోసం ఆ శాఖ రూపొందించిన నిబంధనలు అమలుకు నోచుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 1300 దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు ఉండగా వీటి పరిధిలో సుమారు 5వేల మంది కార్మికుల పనిచేస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో సుమారు 20వేల మంది వరకు పనిచేస్తున్నారు. కానీ యజమానుల నిర్లక్ష్యం..కార్మికశాఖ అలసత్వం కారణంగా కార్మికులకు దక్కాల్సిన ప్రయోజనాలు దూరమవుతున్నాయనే విమర్శలున్నాయి. కచ్చితంగా 8గంటల పని విధానం అమలు చేయాల్సి ఉన్నప్పటికీ చాలా సంస్థల్లో ఈ నిబంధన అమలు కావడం లేదు. కొన్ని సంస్థలు మినహా అనేక సంస్థలు ఉదయం 9గంటల నుంచి రాత్రి 9గంటల వరకు వారితో పనిచేయించుకుంటున్నారు. వారంలో ఒక రోజు సెలవు తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుంది. సెలవు రోజు పనిచేస్తే కార్మికుడికి ఆ రోజున ఇవ్వాల్సిన వేతనంతో పాటు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఇది ఎక్కడా అమలు కావడం లేదనే పలువురు కార్మికులు చెబుతున్నారు. ముఖ్యంగా కొన్ని సంస్థల్లో కనీసం కూర్చోవడానికి కుర్చీలు కూడా ఉండవు. విధుల్లో హాజరైనప్పటి నుంచి సెలవు అయ్యే వరకు నిలబడి పనిచేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కార్మికశాఖ అధికారులు తనిఖీలు చేపడుతూ నిబంధనలపై ఆరా తీసేవారు. కానీ తెలంగాణ ప్రభుత్వం ఈజీ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్న కారణంగా ఆ శాఖ తనిఖీలు చేయడం మానేసిందనే విమర్శలు వస్తున్నాయి. కార్మికశాఖ కమిషనరేట్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకే తనిఖీలు చేయాల్సి ఉంటుంది తప్పితే తమకు తాము తనిఖీలు చేపట్టే విధానం లేదని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఇలాంటి విధానాల కారణంగా కార్మికులు నష్టపోవాల్సి వస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

దరిచేరని ఈ-శ్రమ్ కార్డులు

- దరఖాస్తులు చేసుకోలేక నష్టపోతున్న కార్మికులు
- అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం
- ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలకు దూరం

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ్ కార్డులు అర్హుల దరికి చేరడం లేదు. అసంఘటిత రంగ కార్మికులు ప్రమాదాలకు గురైతే వర్తించాల్సిన బీమా సౌకర్యాలు పొందడం లేదు. అనేక మంది వద్ద ఈ కార్డులు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి దక్కాల్సిన ప్రయోజనాలకు దూరమవుతున్నారు. ప్రభుత్వం ప్రచారం నిర్వహించకపోవడం..అవగాహన కల్పించాల్సిన అధికారులు అలసత్వం వహించడం మూలంగా వేలాది మంది అసంఘటిత రంగ కార్మికులకు నష్టం జరుగుతోంది. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి తప్పితే అమల్లోకి రావడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వాలు ఓ వైపు కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామంటూ పథకాలు ప్రవేశపెడుతుంటే.. మరోవైపు వాటిని అమలు చేయాల్సిన అధికారులు ఉదాసీన వైఖరి అవలంభించడం మూలంగా వేలాది మంది కార్మికులు అవస్థలు పడాల్సి వస్తోంది.

నవతెలంగాణ-తలమడుగు

కేంద్ర ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం 2021లో ఈ-శ్రమ్ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకంలో భాగంగా వివిధ సంస్థల నుంచి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం పొందలేని వివిధ రంగాలకు చెందిన కార్మికులందరూ ఈ శ్రమ్ కార్డులు పొందేందుకు అర్హులుగా ప్రకటించింది. ఆధార్, రేషన్‌కార్డు ఆధారంగా మీసేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకుంటే కేంద్రం ఈ శ్రమ్ కార్డును మంజూరు చేస్తుంది. ఈ కార్డు ఉంటే పనిలో భాగంగా ఏదైనా ప్రమాదం సంభవించి మరణిస్తే బాధిత కుటుంబ సభ్యులకు రూ.2లక్షలు బీమా సౌకర్యం కల్పించబడుతుంది. శాశ్వత అంగవైకల్యం ఏర్పడితే రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తుంది. ఇలాంటి ప్రమాదాలకు గురైన వారి కుటుంబ సభ్యులు ఈ శ్రమ్‌కార్డు ఆధారంగా మరణ ధ్రువీకరణపత్రం, లేదంటే అంగవైకల్యం ఏర్పడినట్లు ధ్రువపత్రం సహాయంతో మీసేవలో దరఖాస్తులు చేసుకోవాలి. అనంతరం మాన్యువల్ కాపీలను కార్మికశాఖ అధికారులకు అందజేస్తే వారు ప్రభుత్వానికి పంపిస్తారు. అక్కడ్నుంచి నిధులు విడుదల కాగానే బాధిత కుటుంబ సభ్యులకు అందజేస్తారు. ఈ సౌకర్యాన్ని వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులందరూ వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ కార్డులను ఆన్‌లైన్‌లో పొందేందుకు కేంద్రప్రభుత్వం సౌలభ్యం కల్పించింది. కానీ అధికారుల అలసత్వం కారణంగా వేలాది మంది కార్మికులు ఇలాంటి ప్రయోజనాలు పొందేందుకు దూరమవుతున్నారనే



ఆరోపణలున్నాయి.

అవగాహన లేక నష్టం..!

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంలో భాగంగా దుకాణాలు, వ్యాపార సంస్థలు, వ్యవసాయ కూలీలతో పాటు వివిధ రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికులకు ఈ కార్డులు కలిగి ఉండేలా కార్మికశాఖ అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లాలో 1,29,537మంది, మంచిర్యాల జిల్లాలో 1,08,328మంది, నిర్మల్ జిల్లాలో 94,856 మంది, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 59,276మంది మాత్రమే ఈ కార్డులు పొందారు. ఈ పథకం ప్రారంభమైన తొలినాళ్లలో కార్మికశాఖ అధికారులు అక్కడక్కడ కొన్ని రోజుల పాటు అవగాహన కల్పించి విడిచిపెట్టారు. దీంతో ఈ కార్డులు పొందే విధానం..ఎక్కడ దరఖాస్తులు చేయాలి.. ఎవరు అర్హులు..ఎలాంటి ధ్రువీకరణపత్రాలు ఉండాలి తదితర వాటిపై వేలాది మందికి అవగాహన లేని కారణంగా ఈ కార్డులు పొందలేకపోయారు. దీంతో ఏదైనా ప్రమాదాలు సంభవించిన తరుణంలో బాధిత కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి ఆర్థిక సాయం లభించడం లేదు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోతున్న అనేక పేద కుటుంబాలు ఆర్థిక వలయంలో చిక్కుకుంటున్నాయి. ఇలాంటి వారికి తోడుగా ఉంటుందని ప్రవేశపెట్టిన ఈ పథకాలు అర్హుల దరికి చేరకపోవడం అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఈ కార్డులు కలిగి ఉన్న కొందరు ఇప్పటికే ఈ పథకం అమలు కోసం దరఖాస్తులు చేసినా కేంద్రం నుంచి నిధులు రావడంలో జాప్యం జరుగుతోందని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

క్యాంపులు నిర్వహించిన అవగాహన కల్పించాం

రాజలింగు, జిల్లా సహాయ కార్మికశాఖ అధికారి, ఆదిలాబాద్

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంపై ఇది వరకు పలు చోట్ల క్యాంపులు నిర్వహించిన అవగాహన కల్పించాం. చాలా మంది దరఖాస్తులు చేసుకున్నారు. అవసరమైన వారికి ప్రయోజనాలు కూడా దక్కుతున్నాయి. ఎన్నికల తర్వాత ఈ పథకంపై మరింత విస్తృతంగా ప్రచారం నిర్వహించి అర్హులైన వారందరికీ ఈ కార్డులు అందించేలా చర్యలు తీసుకుంటాం.

సింగరేణి ప్రయివేటీకరణ ఆలోచన మానుకోవాలి

ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ పేరం శ్రీనివాస్

నవతెలంగాణ-కాసిపేట



ప్రభుత్వాలు సింగరేణి ప్రయివేటీకరణ ఆలోచనను మానుకోవాలని ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ పేరం శ్రీనివాస్ అన్నారు. ఆయన మే డే సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. సింగరేణి ప్రయివేటీకరణ వల్ల కార్మికుల భవిష్యత్తు బానిసత్వంలోకి నెట్టివేయబడుతుందని తెలిపారు. ప్రయివేటీకరణ వల్ల కార్పొరేట్ యాజమాన్యాలు తమ ఉత్పత్తులను పెంచుకునేందుకు హెచ్చుస్థాయిలో యంత్రాలను వాడడం ద్వారా శ్రామిక శక్తికి విలువ తగ్గుతుందని తెలిపారు. దాంతో కార్మిక కుటుంబాలు ఉద్యోగ ఉపాధి కరువై వీధిన పడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పకృతి అందరి సొత్తు అని దాన్ని కొల్లగొట్టి మైనింగ్ పేరుతో పకృతిని కార్పోరేటర్లకు దోచి పెట్టే హక్కు ప్రభుత్వాలకు లేదని తెలిపారు. ప్రభుత్వాలు ప్రజలందరికీ ఉపయోగపడే ఉపాధి మార్గాలను అన్వేషించాలన్నారు. సింగరేణి యాజమాన్యం కార్మిక సంక్షేమ పథకాలను అమలుపరచడంలో మరింత కృషి చేయాలని సూచించారు. యాజమాన్యం కార్మికుల విద్య వైద్యం ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. రిటైర్ కార్మికుల సంక్షేమం కోసం వారి పిల్లల భవిష్యత్తు కోసం సింగరేణి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సింగరేణి అభివృద్ధికి పాటుపడె ప్రతి కార్మికుని సంక్షేమం కోసం విలాసవంతమైన జీవన విధానం కోసం యాజమాన్యం మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు.

జనక్ ప్రసాద్‌ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-మందమర్రి

ఐఎన్‌టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్‌ను కోల్ ఇండియా మినిమం వేజ్ బోర్డు శాశ్వత సభ్యునిగా, రాష్ట్ర మినిమం వేతన బోర్డ్ అడ్వైజరి కమిటీ చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సందర్భంగా మంగళవారం నల్లాల ఓదెలు నివాసంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి- ఓదెలు దంపతులు పూలమాల వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జాతీయ నాయకులు కాంపెల్లి సమ్మయ్య, ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దుర్గం నరేష్, జిల్లా అధ్యక్షుడు నరేందర్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షోభంలో సిరామిక్స్ పరిశ్రమ..!

- గణనీయంగా తగ్గిపోయిన మట్టి పైపుల వాడకం
- ప్లాస్టిక్ పైపుల ఉపయోగం పెరగడమే కారణం
- పరిశ్రమకు గడ్డుకాలం..కార్మికుల బతుకులు ఆగం

ఒకప్పుడు కార్మికులతో కళకళలాడిన సిరామిక్(మట్టి) పైపుల తయారీ పరిశ్రమ విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటోంది. ప్రస్తుతం ప్లాస్టిక్ పైపుల వాడకం పెరిగిపోవడం కారణంగా మట్టి పైపుల పట్ల ప్రజల్లో ఆసక్తి సన్నగిల్లింది. ఫలితంగా సిరామిక్ పరిశ్రమకు గడ్డుకాలం ఎదురవుతోంది. క్రమంగా కంపెనీలు నష్టాల బాటపడుతున్నాయి. గతంలో వేల టన్నులు ఉత్పత్తి చేసే సిరామిక్ కంపెనీలు తాజాగా మట్టి పైపుల వాడకం తగ్గడంతో డీలా పడిపోయాయి. దీంతో కంపెనీల్లో పని చేసే కార్మికుల సంఖ్య క్రమంగా తగ్గిపోతుంది. వేలాది మంది కార్మికులు ఉపాధికి దూరం కావాల్సిన పరిస్థితి తలెత్తింది. రోజు వారి జీవనం కొనసాగించేందుకు కార్మికులు ఇతర పనులు వెతుక్కోవాల్సిన దుస్థితి ఎదురవుతోంది. పైపుల అమ్మకాలు లేకపోవడంతో యజమానులు సైతం కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి కనిపిస్తోంది.





నవతెలంగాణ-మంచిర్యాల

ఆధునిక కాలం నుండి మట్టి పైపులను గృహ నిర్మాణాలకు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, గ్రామాల్లో పారిశుధ్య పనులకు ఎక్కువ ఉపయోగించేవారు. గతంలో ఏండ్ల పాటు ఓ వెలుగువెలిగిన ఈ సిరామిక్ పరిశ్రమ తాజాగా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. ప్రస్తుతం ప్లాస్టిక్ పైపుల వినియోగం పెరిగిపోవడం, ఇవి మార్కెట్‌లోకి వచ్చిన నాటి నుంచి ఈ మట్టి పైపుల వాడకం పూర్తిగా తగ్గిపోయింది. క్రమక్రమంగా మట్టి పైపుల తయారీ కంపెనీలు కనుమరుగయ్యే పరిస్థితి తలెత్తుతోంది. మంచిర్యాల జిల్లాలో మొత్తం 26 మట్టి పైపుల తయారీ కంపెనీలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ఈ మట్టి పైపుల తయారీ కంపెనీలు మంచిర్యాల జిల్లాలోనే అధికంగా ఉన్నాయి. ఈ పైపుల తయారీకి ఉపయోగించే బంక మట్టి , బొగ్గు సైతం మంచిర్యాల జిల్లాలోనే అధికంగా లభిస్తుంది. కరోనాకు ముందు ఒక్కో కంపెనీ ప్రతి నెల 500 నుండి 1000 టన్నుల వరకు పైపులను విక్రయించేది. కరోనా తర్వాత ఈ పరిశ్రమ సంక్షోభాన్ని ఎదుర్కోవడంతో ప్రస్తుతం 50 టన్నుల ఉత్పత్తి కూడా చేయలేకపోతున్నామని కంపెనీ యజమానులు చెబుతున్నారు. ముఖ్యంగా మట్టి పైపుల తయారీకి ఉపయోగించే బొగ్గు విలువ కూడా క్రమంగా పెరిగిందని చెబుతున్నారు. మట్టి పైపుల తయారీ పూర్తిగా పర్యావరణ హితంగా ఉంటుంది. మట్టిపైపులతో పొల్చితే ప్లాస్టిక్ పైపుల నాణ్యత తక్కువే. మట్టి పైపులు భూమిలో వేశాక వంద సంవత్సరాలైనా చెక్కు చెదరకుండా ఉంటాయి. ఎలాంటి సూక్ష్మక్రిములు కూడా మట్టి పైపులను పాడు చేయవని కంపెనీ నిర్వాహకులు చెబుతున్నారు. గతేడాది నెలకు రూ.10కోట్ల టర్నోవర్ చేసి, ఈ సంవత్సరం ప్రారంభం నుండి నెలకు రూ.2కోట్ల టర్నోవర్ కూడా చేయలేని పరిస్థితికి వచ్చామని ఆయా కంపెనీల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్మికులకు ఉపాధి దూరం..!

కార్మికులకు ఏండ్ల పాటు ఉపాధి కల్పించిన ఈ సిరామిక్ కంపెనీలు ప్రస్తుతం డీలా పడిపోయాయి. గతంలో ఒక్కో కంపెనీలో సుమారు 60మంది నుంచి 100మంది వరకు ప్రతి రోజూ ఉపాధి పొందేవారు. లోడింగ్, అన్‌లోడింగ్, బట్టి ఫైరింగ్, మట్టిని తయారు చేయడం, పైపులను వాహనాల్లో తరలించడం లాంటి విభాగాల్లో కార్మికులు పని చేసి ఉపాధి పొందేవారు. క్రమంగా మట్టి పైపుల వినియోగం తగ్గడంతో కార్మికులు ఈ కంపెనీల నుండి వెళ్లిపోయి ఇతర పనులు వెతుక్కుంటున్నారు. ఒకప్పుడు మంచిర్యాల పైపుల కంపెనీలలో పని చేసి ఉపాధి పొందే వారి సంఖ్య 5వేల వరకు ఉండగా ఇప్పుడు వందల్లోకి దిగజారింది. ఒక్కో కంపెనీలో 10 నుండి 15 మంది వరకే పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. మట్టి పైపుల వాడకం తగ్గడంతో క్రమంగా కంపెనీలు మూసివేసే దిశగా అడుగులు పడుతున్నాయి. దీంతో ఈ పరిశ్రమను నమ్ముకొని జీవించే వేలాది కుటుంబాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం నెలకొంది.

ప్రస్తుతం పని దొరకడం లేదు

కమల, కార్మికురాలు, సోమగూడెం

నేను నా భర్త 20ఏండ్లుగా మట్టి పైపుల తయారు చేసే కంపెనీలో పనిచేస్తున్నాం. మాకు ముగ్గురు ఆడ బిడ్డలు. ఇందులో పనిచేసుకుంటూనే పోగు చేసిన డబ్బులతో ఇద్దరు పిల్లలకు పెండ్లి చేశాం. కంపెనీలో గతంలో ఉన్నంత పని ప్రస్తుతం లభించడం లేదు. ప్రతి రోజు పని కోసం వచ్చి ఖాళీగా కూర్చోవాల్సి వస్తోంది. ఇదే నిత్యం కొనసాగితే బతుకుడు ఎలా అనే భయం వేస్తోంది. ప్రభుత్వం స్పందించి మట్టి పైపుల తయారీ కంపెనీలను ప్రోత్సహిస్తే మా లాంటి కార్మికులు ఎందరో ఉపాధి పొందుతారు.

మండలంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటన



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని ఆరేపల్లి, బుర్కపల్లి గ్రామాలలో మంగళవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి ఆత్రం సక్కుని గెలిపించాలన్నారు. బుర్కపల్లిలో పెండ్లి చేసుకున్న నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ రాథోడ్ సజన్, పలువురు కార్యకర్తలు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | మే 01, 2024 | www.navatelangana.com

యూపీఎస్సీ ర్యాంకర్‌కు కలెక్టర్ సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుడిహత్నూర్ మండలంలోని మన్నూర్ గ్రామానికి చెందిన చౌహాన్ రాజ్‌కుమార్ ఇటీవల యూపీఎస్సీ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో చౌహాన్ రాజ్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. మునుముందు ప్రజలకు విశేష సేవలు అందించాలని సూచించారు. జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



ఉద్యోగంలో పనితీరు గుర్తింపు ఇస్తుంది

ఆసిఫాబాద్ : ఉద్యోగంలో పనితీరు గుర్తింపు ఇస్తుందని, అదే జీవితాంతం వెంట వస్తుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లాలో ముఖ్య ప్రణాళిక అధికారిగా మూడు సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తూ పదవి విరమణ చెందిన రవీందర్‌కు అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా రవీందర్ జిల్లా అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు చేసిన పని ప్రత్యేక గుర్తింపు తీసుకు వస్తుందని, అదే జీవితకాలం ఉంటుందన్నారు. రవీందర్ శేష జీవితం సుఖ సంతోషాలతో గడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సీపీవో రవీందర్, జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చెన్నూర్‌లో శ్రీశ్రీ జయంతి వేడుకలు

నవతెలంగాణ-జైపూర్

మహాకవి శ్రీశ్రీ 114వ జయంతి వేడుకలు చెన్నూరులోని ఉత్తరవాహిని కార్యాలయంలో ఘనంగా జరిగాయి. శ్రీశ్రీ కళావేదిక, మంజీర సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత కవులు శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కళా వేదిక రాష్ట్ర అధ్యక్షులు మామిడి అక్షిత మాట్లాడుతూ విప్లవ భావజాలాన్ని తన కలంతో విస్తరించి ఎందరినో ప్రేరేపించి నవ సమాజ నిర్మాణకారులుగా మలిచిన గొప్ప కవి అని, ఆయన అడుగు జాడల్లోనే శ్రీశ్రీ కళావేదిక ఎందరినో తన వినూత్న కార్యక్రమాలతో ఉత్తేజ పరిచి సాహిత్య అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. మంజీర సంఘం అధ్యక్షులు బొడ్డు మహేందర్ మాట్లాడుతూ చిన్న వయసులోనే వీర విప్లవ నారిలా ఒకవైపు సామాజిక సమస్యలపై పోరాటం చేస్తూనే మరోవైపు తెలుగు సాహిత్యం కోసం పాటుపడుతూ రాష్ట్ర స్థాయికి ఎదిగిన అక్షితను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం సంఘం ప్రధాన కార్యదర్శి మేకల రామస్వామి శ్రీశ్రీ కవితా విశేషాలను ఒక్కొక్కటిగా వర్ణిస్తూ సభికులను అలరించారు. ఈ కార్యక్రమంలో కవులతో పాటు దబ్బెట రాజమల్లు, మామిడి బాపు, పోచయ్య, మౌనిక, సంపత్, విహాన్ నందన్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బజార్‌హత్నూర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి కలిసి చదువుకున్న విద్యార్థులు 18సంవత్సరాల తరువాత మంగళవారం ఒకచోట కలుసుకున్నారు. ఇన్ని సంవత్సరాల తర్వాత నాటి స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు రాజేశ్వర్, వెంకటరమణ, రవి, ఆర్.ప్రకాష్, సంజీవ్, ప్రేంసింగ్, సంజీవ్, శ్రీనివాస్, అంబరీష్‌ను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుటూ సాయంత్రం వరకు సందడిగా గడిపారు.

పది ఫలితాల్లో ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ



ఆదిలాబాద్‌టౌన్ : పదవ తరగతి ఫలితాలలో పట్టణంలోని ఎస్ఆర్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పాఠశాలలో చదువుతున్న 11 మంది విద్యార్థులు పి.శ్లోక, సిహెచ్.హరిప్రియ, ఆర్.కావేరి, ఎన్.ద్రివిత, సుమిత్ రమేష్, ఎన్.విగ్నేష్‌రెడ్డి, జి.ప్రణవి, సిహెచ్.అభిష్టరెడ్డి, ఈ.విశ్వేష్‌రావు, బి.పార్థ్, కె.అక్షర పదికి పది జీపీఏ సాధించారు. 20 మంది విద్యార్థులు 9.8 జీపీఏ, 9.7జీపీఏతో 27 మంది, 9.5 జీపీఏతో 16 మంది, 9.3 జీపీఏతో 21 మంది, 9.2 జీపీఏతో 28 మంది 9.0 జీపీఏతో 20మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాదించారు. మొత్తంగా 100 శాతంతో ఉతీర్ణత సాధించి మన్ననలు పొందారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను, తల్లితండ్రుల సమక్షంలో మంగళవారం పాఠశాల యాజమాన్యం పుష్పగుచ్ఛాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ సంతోష్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపల్స్ క్రాంతికుమార్, కిరణ్ కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత

నార్నూర్ : పదో తరగతి ఫలితాల్లో మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 88 మంది పరీక్షలు రాయగా అందరూ పాసై వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన సిహెచ్ సమర్థ్ 9.8 గ్రేడ్ పాయింట్ సాధించి టాపర్‌గా నిలిచాడు. కేజీ బివి నార్నూర్‌లో 30 మందికి 30మంది ఉత్తీర్ణత సాధించారు. నార్నూర్ మండలంలోని ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో 22మందికి 22 మంది పాసయ్యారు. మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో 18 మందికి 18 మంది అదేవిధంగా జిల్లా పరిషత్ సెకండరీ తెలుగు మీడియం పాఠశాలలో 28 మంది పరీక్షలు రాయగా అందులో 25 మంది ఉత్తీర్ణత సాధించారు. భీంపూర్ జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో 22 మంది పరీక్షలు రాయగా 20 మంది పాసయ్యారు. జెడ్పీ ఎస్ఎస్ తాడిహత్నూర్‌లో 28 మంది పరీక్షలు రాయగా అందులో కేవలం 13మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. మాన్యాపూర్ ఆశ్రమ పాఠశాలలో 35 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 25 మంది పాసయ్యారు. తాడిహత్నూర్ ఆశ్రమ పాఠశాలలో 34 మంది పరీక్షలు రాయగా 29 మంది ఉత్తీర్ణత సాధించారు. జామడ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 36 మంది పరీక్షలు రాయగా 21 మంది ఉత్తీర్ణత సాధించారు. గాదిగూడ మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో 32 మంది పరీక్షలు రాయగా 32 మంది, అర్జుని ఆశ్రమ పాఠశాలలో 26 మంది పరీక్షలు రాయగా 26 మంది ఝరి ఆశ్రమ పాఠశాలలో 23 మంది పరీక్షలు రాయగా 23 మంది గాదిగూడ కేజీబీవీలో 40 మంది పరీక్షలు రాయగా 40 మంది పాసై వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఉమ్మడి నార్నూర్, గాదిగూడ మండలంలో మొత్తం 14 ఉన్నత పాఠశాలలు ఉండగా గాదిగూడ మండలంలోని నాలుగు పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. నార్నూర్ మండలంలో మొత్తం 10 పాఠశాలలు ఉండగా అందులో నాలుగు పాఠశాలలో వంద శాతం ఫలితాలు వచ్చాయి.

సర్వీస్‌లో చేసిన సేవలు గుర్తింపునిస్తాయి

ఆదిలాబాద్‌టౌన్ : ఉద్యోగి తన సర్వీస్‌లో చేసిన సేవలు ఆయనకు గుర్తింపు నిస్తాయని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాధన అన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ఆఫీస్ సబ్ ఆర్డినేట్‌గా పనిచేస్తున్న మనపల్లి రమేష్ దంపతులను ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సాధన మాట్లాడుతూ తన సర్వీస్ కాలంలో ఎలాంటి రిమార్క్ లేకుండా ఉద్యోగ విరమణ పొందడం గొప్ప విషయని తెలిపారు. శేష జీవితం ఆయురారోగ్యాలతో కొనసాగాలని అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ అధికారులు వామన్‌రావ్, మధుసూదన్‌రావ్, సిహెచ్‌వోలు బాబూలాల్, ఆనంద్‌రావ్, సూపరింటెండెంట్ గోపి, శ్రీకాంత్, సునీత, ఇంద్రవేణి, కిరణ్, రాజు, డీపీఓ అనిల్, గితేష్, రమణచారి సిబ్బంది పాల్గొన్నారు.

పదిలో మళ్లీ నిర్మల్ టాప్..!

- వరుసగా రెండో సారి రాష్ట్రంలో అగ్రస్థానం
- 17వ స్థానంలో ఆదిలాబాద్..మంచిర్యాలకు 20వ స్థానం
- 31వ స్థానంలో నిలిచిన కుమురంభీం ఆసిఫాబాద్
- స్థానాలు తగ్గినా..ఉత్తీర్ణతశాతంలో మాత్రం మెరుగు
- నాలుగు జిల్లాల్లోనూ బాలికలదే పైచేయి

పదో తరగతి ఫలితాల్లో మళ్లీ నిర్మల్ జిల్లాకే అగ్రస్థానం దక్కింది. వరుసగా రెండోసారి రాష్ట్రంలోనే టాప్‌లో నిలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. 99.05శాతంతో అగ్రస్థానంలో నిలిచింది. గతేడాది ఫలితాల కంటే 0.9శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించడం విశేషం. మరోపక్క మిగితా మూడు జిల్లాలు మాత్రం పదో తరగతి ఫలితాల్లో వెనుకబడ్డాయి. ఆదిలాబాద్ జిల్లా 92.93శాతంతో రాష్ట్రంలో 17వ స్థానంలో నిలవగా.. 92.42శాతం ఉత్తీర్ణతతో మంచిర్యాల జిల్లా 20వ స్థానంతో సరిపెట్టుకుంది. మరోపక్క ఇంటర్ ఉత్తీర్ణతలో మంచి ప్రతిభ కనబర్చిన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పదో తరగతి ఫలితాల్లో మాత్రం వెనుకంజలో నిలిచింది. రాష్ట్రంలో ఏకంగా 31వ స్థానంలో నిలిచింది. ముఖ్యంగా రాష్ట్రంలో స్థానాల పరంగా చూస్తే ఈ మూడు జిల్లాలు ఫలితాల్లో వెనుకబడినప్పటికీ ఉత్తీర్ణత శాతంలో మాత్రం మెరుగైన ఫలితాలే సాధించడం గమనార్హం.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

పదో తరగతిలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ఉమ్మడి నాలుగు జిల్లాల్లో నిర్మల్ జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలవగా.. మిగితా మూడు జిల్లాలు మాత్రం ఉత్తీర్ణత శాతంలో ఫర్వాలేదనిపించినా.. స్థానాల్లో వెనుకబడ్డాయి. ఉమ్మడి జిల్లాలో 34,958మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 32,368మంది ఉత్తీర్ణులయ్యారు. కేవలం 2590మంది విద్యార్థులు మాత్రమే అనుత్తీర్ణులయ్యారు. విద్యార్థులపై



ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ.. అధికారుల పర్యవేక్షణ ఫలితంగా పదో తరగతిలో ఉమ్మడి జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చేందుకు కారణమయ్యాయి. ముఖ్యంగా ఈ నాలుగు జిల్లాల్లోనూ ఉత్తీర్ణత శాతంలో బాలుర కంటే బాలికలే పైచేయి సాధించడం విశేషం.

నిర్మల్ జిల్లాలో 8908 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 8823మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 4300మంది పరీక్ష రాయగా 4246మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 4608మంది పరీక్ష రాయగా 4577మంది పాస్ కాగా జిల్లాలో 99.05శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో నెంబర్ 1గా నిలిచారు.

ఆదిలాబాద్ జిల్లాలో 10374 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 9641మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 5179మంది పరీక్ష రాయగా 4744మంది పాసయ్యారు. బాలికలు 5195మంది పరీక్ష రాయగా 4897మంది ఉత్తీర్ణతతో జిల్లాలో 92.93శాతం సాధించారు.

మంచిర్యాల జిల్లాలో 9283మంది విద్యార్థులు పరీక్ష రాయగా 8579మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 4748మంది పరీక్ష రాయగా 4338మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 4535మంది పరీక్ష రాయగా 4241మంది పాసయ్యారు. జిల్లాలో 92.42శాతం ఉత్తీర్ణత సాధించారు.

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 6393మంది విద్యార్థులు పరీక్ష రాయగా 5325మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 3008మంది పరీక్ష రాయగా 2366మంది పాసయ్యారు. బాలికలు 3385మంది పరీక్ష రాయగా 2959మంది పాస్ కాగా 83.29శాతం ఉత్తీర్ణత సాధించారు.

ప్రత్యేక ప్రణాళికతో సాధ్యమైంది : రవీందర్‌రెడ్డి, డీఈఓ, నిర్మల్ జిల్లా

పదో తరగతి ఫలితాల్లో వరుసగా రెండోసారి రాష్ట్రంలోనే అగ్రస్థానం సాధించడం చాలా సంతోషంగా ఉంది. ఇందుకు మూడేండ్ల నుంచి ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్లాం. ఉదయం, సాయంత్రం రెండు పూటలా ప్రత్యేక తరగతులు నిర్వహించడం, పాఠశాలలో వందశాతం హాజరు, ఛాప్టర్ల వారీగా టెస్టులు నిర్వహించడంతో పాటు సబ్జెక్టు ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా తరగతులు నిర్వహించడం వంటి కారణాలతో ఇది సాధ్యమైంది. మరోపక్క ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టు ఉపాధ్యాయులు, పిల్లలతో జిల్లా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ వారిలో స్ఫూర్తి నింపడంతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయి.



సొంత గూటికి ఆ నలుగురు ..!

- గండ్రత్ సుజాత, భార్గవ్, సాజిద్‌ఖాన్, సంజీవ్‌రెడ్డిలపై సస్పెన్షన్ ఎత్తివేత
- జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక
- లోక్‌సభ ఎన్నికల ముంగిట వారి క్యాడర్‌లో హర్షం



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నుంచి సస్పెన్షన్‌కు గురైన ఆ నలుగురు నాయకులు తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు టీపీసీసీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు భార్గవ్ దేశ్‌పాండే, సాజిద్‌ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ సంజీవరెడ్డిలపై సస్పెన్షన్ ఎత్తివేస్తూ కాంగ్రెస్ క్రమ శిక్షణ సంఘం నిర్ణయం తీసుకుంది. మంగళవారం సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, కిసాన్ సెల్ జాతీయ అధ్యక్షుడు కోదండరెడ్డి హైదరాబాదులో వీరికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. దీంతో లోక్‌సభ ఎన్నికల ముంగిట ఈ కీలక నేతలు తిరిగి హస్తం పార్టీలో చేరడం పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ముంగిట ఈ కీలక నేతలు పార్టీలో చేరడం ఆ పార్టీకి అదనపు బలం చేకూరనుందనే ప్రచారం జరుగుతోంది.

నలుగురిపై సస్పెన్షన్ ఎత్తివేత..!

అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. కానీ ఎన్నికల సమయంలో టికెట్ల వ్యవహారం ఆదిలాబాద్ నియోజకవర్గంలో చిచ్చురేపింది. కాంగ్రెస్ నుంచి ఆదిలాబాద్ టికెట్ కోసం గండ్రత్ సుజాత, సాజిద్‌ఖాన్, సంజీవరెడ్డిలు పోటీపడ్డారు. తమలో ఒకరికి టికెట్ కేటాయించాలని అధిష్టానాన్ని కోరారు. కానీ ఆ పార్టీ అధిష్టానం మాత్రం కంది శ్రీనివాస్‌రెడ్డికి అసెంబ్లీ టికెట్ కేటాయించింది. అసంతృప్తికి గురైన ఈ ముగ్గురు నేతలు పార్టీకి రాజీనామా చేశారు. సంజీవ్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయగా మిగిలిన ఇద్దరు నేతలు ఆయనకు మద్దతు తెలిపి ప్రచారం నిర్వహించారు. భార్గవ్ దేశ్‌పాండే సైతం సంజీవరెడ్డికే మద్దతు తెలిపారు. ఈ ఎన్నికల్లో సంజీవ్‌రెడ్డి ఓటమి చెందారు. అప్పటి నుంచి పార్టీకి దూరంగా ఉన్న ఈ నేతలు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి పార్టీలో చేరుతారని తొలుత ప్రచారం జరిగినా చేరిక జరగలేదు. తాజాగా ఏఐసీసీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ క్రమ శిక్షణ సంఘం వీరిపై సస్పెన్షన్ ఎత్తివేయడంతో పాటు పార్టీలో చేర్చుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఎన్నికల ముంగిట జోష్..!

రాష్ట్రంలో అధికారం సాధించిన కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికలను సైతం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ఉపాధ్యాయురాలు, ఆదివాసీ హక్కుల ఉద్యమకారిణి ఆత్రం సుగుణను ఎన్నికల బరిలో నిలిపిన సంగతి తెలిసిందే. ఇప్పటికే నామినేషన్ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్‌కు వచ్చి బహిరంగ సభలో పాల్గొని ప్రచారం నిర్వహించారు. లోక్‌సభ సీటును గెలుచుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంది. మంత్రి సీతక్క లోక్‌సభ పరిధిలోనే ఉంటూ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. తాజాగా ఆదిలాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ క్యాడర్, ప్రజల్లో గట్టి పట్టుకలిగిన ఈ నలుగురు నేతలు తిరిగి పార్టీలోకి రావడంతో వారి క్యాడర్‌లో హర్షం వ్యక్తమవుతోంది. ఎన్నికల ప్రచారానికి మరో పది రోజుల సమయం ఉండటం.. ఈ క్రమంలో వారు పార్టీలో చేరడం కాంగ్రెస్‌కు అదనపు బలం చేకూరనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోపక్క ఇన్నాండ్లు పార్టీకి దూరంగా ఉన్న వారి క్యాడర్ కూడా తాజాగా ప్రచారంలో పాల్గొననున్నట్లు తెలిసింది.

పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటిన వివేకానంద

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని వివేకానంద ఉన్నత పాఠశాల పదవ తరగతి ఫలితాల్లో సత్తా చాటింది. వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రత్నాకర్‌రావు తెలిపారు. పాఠశాలలో 24 మంది విద్యార్థులకు గాను 24 మంది ఉత్తీర్ణత సాధించారు. అప్పారావ్‌పేట గ్రామానికి చెందిన వినంతి 9.5 గ్రేడ్ పాయింట్స్ సాధించి మండలంలో టాపర్‌గా నిలిచింది. పాఠశాల కరస్పాండెంట్ రమణారావు, మండల ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని వినంతినికి అభినందనలు తెలిపారు.



నేడు, రేపు ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నేటి నుండి ప్రారంభం కానున్న పిఓ, ఏపీఓఓపిఓ ఎన్నికల సిబ్బందికి మే 1, 2 తేదీలలో శిక్షణ కార్యక్రమాన్ని మాస్టర్ ట్రైనర్లతో నిర్వహించడం జరుగుతుందని జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో మాస్టర్ ట్రైనర్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులను ఉదయం 9.30గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉదయం పోలింగ్ రోజు చేయవలసిన పనులు, ఈవీఎంల ప్రాక్టీస్, మధ్యాహ్నం 17 సిపిఓ డైరీ, మాక్‌పోల్ సర్టిఫికెట్ ఏ విధంగా పూరించాలనే తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం ఎన్నికల సిబ్బందికి పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఏఎల్ఎంటీలతో రిసెప్షన్ కేంద్రాల ఏర్పాట్లు, కౌంటర్లు, టేబుల్స్ మొదలైన వాటి వివరాలు, నేటి నుండి శిక్షణ సమయంలో పోలింగ్ సిబ్బందికి డిఆర్సీ ఏర్పాట్లను చాలా స్పష్టంగా వివరించామని ఏఎల్ఎంటిలకు తెలపాలన్నారు. ప్రతి శిక్షణా గదిలో ఎన్నికల మెటీరియల్స్, పోస్టల్ బ్యాలెట్ కవర్‌లను ఉంచిన స్థలాలు, శిక్షణ సమయంలో పోలింగ్ సిబ్బందికి చూపించి వివరించాలని తెలిపారు. 7అసెంబ్లీ సెగ్మెంట్‌ల విఎఫ్సీ స్థానాలను కమ్యూనికేట్ చేసి తేదీలు, సమయాలను స్పష్టంగా తెలియజేయాలని, ఉద్యోగులు మాత్రమే ఓటరుగా నమోదు చేసుకున్న సంబంధిత ఏఎస్ఎస్, విఎఫ్సిలలో ఓటు వేయడానికి 3వ తేదీ నుండి 8వ తేదీ వరకు ఉద్యోగులందరికీ వారు ఎంచుకున్న ఎంపిక ప్రకారం ఓటు వేయాలని అన్నారు. శిక్షణ సమయంలో పీవోలు/ఏపీఓలు తప్పనిసరిగా పీవో డైరీ, ఫారం 17సీ మొదలైనవాటిని వ్రాయాలని చివరిలో చిన్న పరీక్షను కూడా నిర్వహించి వారికి పూర్తిగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమాలు పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బోథ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇచ్చోడ, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, ఉట్నూర్, నిర్మల్, భైంసా ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాల్లో కేటాయించిన ఎన్నికల సిబ్బంది అందరూ పాల్గొని ఎన్నికలను సజావుగా నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలి

- ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐ వెంకటరమణారెడ్డి
- సత్కరించి సాగనంపిన ఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉద్యోగ విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ జీవించాలని ఎస్పీ గౌస్ ఆలం సూచించారు. సుదీర్ఘ కాలం పాటు పోలీసు డిపార్ట్మెంట్‌లో పనిచేసి విజయవంతంగా పదవీ విరమణ పొందుతున్న ఆదిలాబాద్ రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ గడ్డం వెంకటరమణారెడ్డి పదవీ విరమణ కార్యక్రమం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో మంగళవారం నిర్వహించారు. 1985 సంవత్సరంలో నిజామాబాద్ జిల్లాలో పోలీసు కానిస్టేబుల్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించిన రమణారెడ్డి అంచలంచలుగా 2009లో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొంది తదుపరి 2012లో ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. 2018లో ఎస్సైగా పదోన్నతి పొందారు. ఉద్యోగంలో భాగంగా ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలలో విధులు నిర్వర్తించారు. కుటుంబ పరంగా ఇద్దరు కుమార్తెలకు వివాహం చేసి ఉన్నత స్థానాలకు ఎదిగేలా విశేషమైన కృషి చేశారు. నేడు పదవీ విరమణ పొందుతున్న జీవి రమణారెడ్డి, విజయ దంపతులకు ఎస్పీ శాలువా పూలమాలలతో సత్కరించి, బహుమతి ప్రదానం చేసి మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. పోలీసు వ్యవస్థకు సుదీర్ఘకాలం పాటు దాదాపు 40 సంవత్సరముల పాటు నిర్విరామంగా ఎటువంటి అడ్డంకులు లేకుండా విజయవంతంగా పదవీ విరమణ పొందుతున్నందుకు శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా పోలీసు వ్యవస్థకు సేవలు అందించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. చివరగా పోలీసు వాహనంలో సాదరంగా ఇంటికి సాగనంపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఆపరేషన్ బి.సురేందర్‌రావు, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, సభ్యులు చిందం దేవిదాస్, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిణి జైస్వాల్ కవిత సిబ్బంది పాల్గొన్నారు.

నూతన జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లా నూతన జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన ప్రభాకర్‌రావును ఎస్పీ గౌష్ ఆలం కలిశారు. సాధారణ బదిలీల్లో భాగంగా జడ్జి డాక్టర్ వీఆర్ఆర్ వరప్రసాద్ బదిలీ కాగా, ఆయన స్థానంలో జిల్లా నూతన జడ్జిగా ప్రభాకర్‌రావు నియమితులయ్యారు. మంగళవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో ఎస్పీ కలిసి పూల మొక్క అందజేసి మర్యాదపూర్వక జిల్లాకు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా పరిస్థితులపై ఇరువురు అధికారులు చర్చించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | మే 01, 2024 | www.navatelangana.com

అంగవైకల్యం చదువుకు అడ్డుకాలేదు

నవతెలంగాణ-దిలావర్‌పూర్

చదువుకోవాలనే ఆసక్తి విద్యార్థికి అంగవైకల్యం అడ్డుకాలేదు. శ్రద్ధ, ఆసక్తి వికలాంగ విద్యార్థుల విజయానికి బాటలు వేశాయి. మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాల ఆవరణలోని భవిత



సెంటర్‌లో చదువుతున్న ఆరుగురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి ఆదర్శంగా నిలిచారు. కదంబ అనూష్ అనే విద్యార్థి పుట్టుక నుంచి అంగవైకల్యం గలవాడు. అతని రెండు కాళ్లు, ఒక చేతు చచ్చుబడిపోయాయి. అయినా చదువు మీద ఆసక్తితో ప్రతి రోజూ పాఠశాలకు వెళ్లి తరగతులకు హాజరయ్యేవాడు. పదో తరగతి ఫలితాల్లో 6.6 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఆదర్శంగా నిలిచాడు.

కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలతో దేశవ్యాప్తంగా ఆ పార్టీకి ఎదురుగాలి వీస్తోందని, కేంద్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణకు మద్దతుగా వారి కుమారుడు సాయుధతో కలిసి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని 170, మీడియా కాలనీల్లో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. చేతిగుర్తుకు ఓటు వేసి సుగుణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, వేముల నాగరాజు, రంజిత్‌రెడ్డి, కరణ్, రెండ్ల రాజన్న, బంటు పద్మ సంగీత, ఫెరోజ్‌ఖాన్, శ్రీను, అడెల్లు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి సభకు తరలిరావాలి



నవతెలంగాణ-నార్నూర్

ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణకు మద్దతుగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 2న ప్రచారానికి వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సభకు ప్రజలు భారీగా వచ్చేట్టు చూడాలని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ మండల నాయకులకు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో మండల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు సంబంధించిన పలు సూచనలు చేశారు. సమావేశంలో మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు దేవ్‌రావ్ లోకండే, రాథోడ్ శేషారావ్, మాజీ జెడ్పీటీసీ బ్రిజులాల్, జేపీసీ మాజీ చైర్మెన్ రాథోడ్ ఉత్తం, నాయకులు దాదే అలీ, కోఆప్షన్ సభ్యులు దస్తగిర్, ఫ్యాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతారావ్, నర్సింగ్ మోరే, కరీం ఖాన్, షేక్ సత్తార్, జాకీరుల్లా ఖాన్, వసంత్, డిగాంబర్, కార్తీక్, జాదవ్ కైలాస్, మహేందర్, షేక్ నసీర్, దేవిదాస్ ఉన్నారు.

కాంగ్రెస్ హయాంలో కనుమరుగైన సంక్షేమ పథకాలు

- పట్టణంలో బీఆర్ఎస్ ప్రచారం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు రావాల్సిన సంక్షేమ పథకాలు కనుమరుగయ్యాయని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మంగళవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. గడపగడపకు ఓటర్లను కలుస్తూ, తెలంగాణ ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకగా ఆత్రం సక్కును బలపరచాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు టాక్సులు కడుతున్న కూడా ప్రజలకు సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు తిరిగి ఇవ్వలేకపోతుందని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గడపగడపకు సంక్షేమ పథకాలు అందించి, బడుగు బలహీన వర్గాలకు అండగా గత కారుగుర్తు ప్రభుత్వం నిలిచిందన్నారు. పేదవారి ఇండ్లలో జరగాల్సిన పెండ్లిలు నిలిచిపోయాయని కళ్యాణలక్ష్మి ఆన్‌లైన్ కేంద్రాన్ని మూసివేయడం జరిగిందని, గ్యాస్ ధరలు, డీజిల్ పెట్రోల్ ధరలు ప్రజలను తీవ్ర సంక్షోభానికి గురి చేస్తున్నాయన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలకు రైతాంగం సుభిక్షంగా ఉండేదని కాంగ్రెస్ పాలనలో ప్రజలతో పాటు రైతాంగం తీవ్ర కరువును ఎదుర్కొనే పరిస్థితులు వస్తున్నాయని అన్నారు. పంటలు ఎండిపోయి జలాశయాలు అడుగంటి తెలంగాణ ప్రజల ఉసురుపోసుకుంటుందన్నారు. తెలంగాణ ప్రజల ఆశయాలను అన్యాయాలను పార్లమెంట్‌లో నిలదీసే వ్యక్తిగా ఆత్రం సక్కుకు కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అజయ్, కౌన్సిలర్లు ధర్మాపాల్, రామ్‌కుమార్, రవి, అన్నెల వసంత్, స్వాగత్, పట్టణ మహిళా అధ్యక్షురాలు స్వరూపరాణి, మమత, పర్వీన్, కరుణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండల నూతన అధ్యక్షుడిగా నల్ల జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-కడెం

బీఆర్ఎస్ మండల నూతన అధ్యక్షుడిగా నల్ల జీవన్‌రెడ్డిని నియమించినట్టు బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్య జాన్సన్ నాయక్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం మండలంలోని కొండుకూర్ ఎస్‌కె ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో నూతన అధ్యక్షులుగా జీవన్‌రెడ్డిని నియమించామన్నారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. అనంతరం నూతన మండల అధ్యక్షులను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండల నూతన అధ్యక్షులు మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల అధ్యక్షులుగా నియమించినందుకు ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ భూక్య జాన్సన్ నాయక్‌కి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి అత్రం సక్కు గెలిపించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజేశ్వర్‌గౌడ్, నిర్మల్ జిల్లా జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ రఫీక్, పలువురు మండల నాయకులు పాల్గొన్నారు.

తునికాకు సేకరణకు వెళ్లి వ్యక్తి మృతి

నవతెలంగాణ-కడెం

తునికాకు సేకరణకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దస్తురాబాద్ మండలం దేవునిగూడెం గ్రామానికి చెందిన మోకిరాల బక్కన్న(61) గత ఆదివారం తునికాకు సేకరణకు మండలంలోని గంగాపూర్ అటవీ ప్రాంతానికి వెళ్లారు. కాగా భోజనం సమయంలో మీరు తినండి అని చెప్పి తునికాకు సేకరణకు అటవీలోకి వెళ్లాడు. తోటి వ్యక్తులు ఎంత పిలిచినా బక్కన్న రాకపోయేసరికి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు గత రెండు రోజులుగా అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో అల్లంపెల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో మృతదేహం లభ్యమైనట్లు స్థానికులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని కడెం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుడు బక్కన్న వడదెబ్బతో మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

ఈసారి మెరుగైన ఫలితాలు సాధించాం : డీఈఓ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గత సంవత్సరం కంటే ఈ సారి ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించామని, రాష్ట్ర వ్యాప్తంగా 92.93 శాతంతో 17వ స్థానంలో ఉన్నామని జిల్లా విద్యాశాఖాధికారిణి ప్రణిత తెలిపారు. మంగళవారం పదో తరగతి ఫలితాలు విడుదలైన నేపథ్యంలో ఆమె కార్యాలయంలో ఫలితాల వివరాలను మీడియాతో వెల్లడించారు. గత సంవత్సరం 19వ స్థానంలో నిలిచిన ఆదిలాబాద్ రాష్ట్రంలో ఈసారి 17వ స్థానంలో నిలిచిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైన ఫలితాల్లో ఆదిలాబాద్ పర్వాలేదనిపించిందని అన్నారు. మార్చిలో ప్రారంభమైన పరీక్షల్లో ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 10,374 మంది పరీక్షలు రాయగా, 9,641 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఇందులో బాలురు 4,744, బాలికలు 4,897 మంది పాస్ అయ్యారని తెలిపారు. మొత్తం 92.93 ఉత్తీర్ణత శాతం వచ్చిందన్నారు. గతంలో 88.68 శాతం వచ్చిందని తెలిపారు. ఈ సంవత్సరం కూడా బాలికలదే పైచేయి ఉందన్నారు. సప్లిమెంటరీలో ఉత్తీర్ణత శాతం పెంచేలా కృషి చేస్తామన్నారు.

జూన్ 3 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు..

పదో తరగతి అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13 వరకు ఉంటాయని తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. సప్లిమెంటరీ పరీక్ష ఫీజును మే 1 నుంచి 15 వరకు చెల్లించాలని విద్యార్థులకు సూచించారు. రీకౌంటింగ్ కోసం రూ.500, ఆన్సర్ షీట్ ఫొటో కాపీ కోసం రూ.1000 చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

నూతన జిల్లా జడ్జీని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా నూతన జడ్జీగా బాధ్యతలను స్వీకరించిన ప్రభాకర్‌రావును బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం కలిశారు. జిల్లా జడ్జి వరప్రసాద్ రావు బదిలీ కావడంతో ఆయన స్థానంలో మంగళవారం బాధ్యతలను స్వీకరించిన నూతన జడ్జీ ప్రభాకర్‌రావును అసోసియేషన్ అధ్యక్షులు నగేష్, ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, ఉపాధ్యక్షురాలు రజితరెడ్డి, జాయింట్ సెక్రటరీ రాహుల్, ముజాహిద్ ఉస్సేన్ కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు.

ప్రథమ స్థానంలో మహాలక్ష్మివాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల





నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదో తరగతి ఫలితాల్లో పట్టణంలోని మహాలక్ష్మీవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎనబై శాతం ఉత్తీర్ణత సాధించి, మొదటి స్థానంలో నిలిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిల్లి కిషన్ పేర్కొన్నారు. మంగళవారం ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో మొత్తం విద్యార్థుల్లో 88 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో మమతా పాటిల్ 9.3 జీపీఏ, ఆర్.సంధ్య 9.2 జీపీఏ, నందిని 8.3 జీపీఏలతో పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో అత్యుత్తమ జీపీఏ సాధించారని పేర్కొన్నారు. వారిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆశ్రమాల్లో వందశాతం ఫలితాలు

- మండల టాపర్‌గా గురుకులం విద్యార్థిని జాదవ్ వరలక్ష్మీ 9.8 జీపీఏ
- అట్టడుగున ధనోర జెడ్పీహై స్కూల్





నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఆశ్రమ పాఠశాలల్లో గతంలో కంటె మెరుగ్గ వందశాతం ఫలితాలు సాధించాయి. టీటీడబ్ల్యూఆర్ కళాశాల (బాలికలు) విద్యార్థిని జాధవ్ వరలక్ష్మీ 9.8 జీపీఏతో మండల టాపర్‌గా నిలిచారు. అదే కళాశాల విద్యార్థిని ఆరెల్లి నవ్య 9.7 జీపీఏతో పాటు స్థానిక జెడ్పీ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఆర్.నీరిక్ష, బి.గాయత్రి, ఎ.సలోని, జె.చరణ్‌కు 9.7 జీపీఏ సాధించారు. మండలంలో మొత్తం నాలుగు ఆశ్రమ పాఠశాలలు ఉండగా వీటిలో రెండు బాలికల ఆశ్రమ పాఠశాల లు ఉన్నాయి. కేస్లాపూర్ ఆశ్రమ పాఠశాల (బాలికలు) మొత్తం 59 గాను 59 విద్యార్థినులు ఉత్తీర్ణులై వంద శాతం ఫలితాలు సాధించారు. ఇంద్రవెల్లి ఆశ్రమ పాఠశాల(బాలికలు) 64 గాను, 64 ఉత్తీర్ణులయ్యారు. వడగావ్ ఆశ్రమ పాఠశాలలో 35 గాను 35 ఉత్తీర్ణులయ్యారు. పిట్ట బొంగరం ఆశ్రమ పాఠశాలలో మొత్తం 46 విద్యార్థులకు గాను, 44 ఉత్తీర్ణులయ్యారు.(95.7) కేజీబీవీలో 38 గాను, 37 విద్యార్థినులు ఉత్తీర్ణులయ్యారు. మొత్తం మూడు ఆశ్రమాల్లో వందశాతం ఫలితాలు సాధించాయి. స్థానిక జెడ్పీ పాఠశాలలో మొత్తం 256 గాను, 241, జెడ్పీ పాఠశాల ముత్నూర్‌లో 20లో 18 మంది ఉత్తీర్ణులు కాగా అట్టడుగున ధనోర పాఠశాలలో మొత్తం 34 మంది విద్యార్థుల్లో 17 మంది ఉత్తీర్ణులై, 50శాతం ఫలితం సాధించి, మండలంలో అట్టడుగు స్థాయిలో నిలిచింది. మండలంలో పదిలో మొత్తం 81శాతం ఫలితం రాబట్టుకుంది. స్థానిక టీటీడబ్ల్యూఆర్ కళాశాల విద్యార్థినులు 9.8 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలువడంతో ఆ కళాశాల ప్రిన్సిపాల్ పెందూర్ శ్రీప్రియా అభినందనలు తెలిపారు.

పదిలో సత్తా చాటిన కృష్ణవేణి విద్యార్థులు















నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. మండల టాపర్‌లుగా నిలిచి ఉత్తమ ప్రతిభను కనబరిచారు. 2023-24 ఎస్సెస్సీ ఫలితాల్లో జె.శివచరణ్ 10/10 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. అంతేకాకుండా రెండో స్థానంలో ఎస్.మైత్రేయి, పి.సాహితీలు 9.8జీపీఏ సాధించి, ఉత్తీర్ణత సాధించారు. ఎస్.రితిక, ఇస్రా, ఫిరాసత్‌బి, మహమ్మద్ ముదసిర్ హుస్సేన్‌లు 9.7 పాయింట్లతో ఉత్తీర్ణులయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను డైరెక్టర్ గాండ్ల శ్రీనివాస్ ప్రిన్సిపాల్ శ్వేతలు అభినందించారు.

ప్రచారంలో సన్మానాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని చించుఘాట్ గ్రామానికి ప్రచారానికి వచ్చి మాజీ మంత్రి జోగు రామన్న, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కులను మంగళవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఆత్రం సక్కును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంద్రత్ రమేష్, బీఆర్ఎస్ నాయకులు సెవ్వ జగదీష్ యాదవ్, కుమ్ర రాజు, జంగు బాపు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కళాశాలలో ఇంగ్లీషు గ్రామర్‌పై ఉపన్యాసం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్‌లో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో యూజ్ ఆఫ్ ఇంగ్లీష్ గ్రామర్ ఇన్ డే టు డే లైఫ్ కమ్యూనికేషన్ అనే అంశంపై విస్తృత ఉపన్యాసాన్ని నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పట్టణంలోని విద్యార్థి డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకుడు బి.మల్లేష్ పాల్గొని, విద్యార్థులకు విస్తృత ఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అచ్చి శ్రీనివాస్, ఆంగ్ల విభాగ హెచ్‌ఓడీ డి.దయాకర్, బి.ఆనందం, కె.భువనేశ్వరి, రాజ్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

పదిలో బాలికలదే పైచేయి

నవతెలంగాణ-తలమడుగు



పదో తరగతి పరీక్షల్లో బాలికలు వందశాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 77 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 72 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. ఇంగ్లీష్ మీడియంలో అవినాష్ 9.2 జీపీఏ, నేతుల రామ్‌చరణ్ 9.0 జీపీఏ సాధించినట్టు తెలిపారు. బాలురు 47 మంది బాలికల 30 పరీక్షలు హాజరుకాగా 42 మంది బాలురు 30 మంది బాలికలు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికల ఉత్తీర్ణత శాతం వంద కాగా బాలుర 89శాతం మొత్తం 94 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. ఉత్తమ జీపీఏ సాధించిన అవినాష్, నేతుల రామ్‌చరణ్‌కు పుష్పగుచ్ఛాన్ని అందించి సన్మానించారు.

మండల టాపర్‌గా హర్షిత..

కజ్జర్ల గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన హర్షిక 9.5 శాతం ఉత్తీర్ణత సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

కార్యకర్తలే మాబలం..బలగం : జాన్సన్ నాయక్

- కష్టపడి పని చేద్దాం ఆత్రం సక్కుని గెలిపించుకుందాం
- బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్య జాన్సన్ నాయక్



నవతెలంగాణ-కడెం

కార్యకర్తలే మాబలం బలగమని ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ భూక్య జాన్సన్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని కొండుకూర్ గ్రామంలోని ఎస్‌కె ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో కడెం, ఖానాపూర్, పెంబి, దస్తురాబాద్, జన్నారం, మండలాల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూక్య జాన్సన్ నాయక్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో సమిష్టిగా పనిచేసి ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుని గెలిపించుకుందామని అన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో గద్దెనెక్కిందని అన్నారు. త్వరలో మళ్లీ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ నాయకత్వంలో కీలకంగా మారడం ఖాయమని అన్నారు. అనంతరం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు వచ్చే పార్లమెంట్ ఎలక్షన్‌లో తప్పకుండా ఓటుతో బుద్ధి చెప్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే పార్లమెంట్ ఎలక్షన్‌లో కారు గుర్తుకు ఓటు వేసి తనను పార్లమెంట్ సభ్యునిగా గెలిపిస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజల అభివృద్ధికి ఎల్లప్పుడు కృషి చేస్తానని వారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న, ఖానాపూర్ నియోజకవర్గ పార్లమెంట్ ఇన్‌చార్జ్ మర్సుకొల సరస్వతి బీఆర్ఎస్ ఆయా మండలాల ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఉపాధ్యక్షులు బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన కేజీబీవీ విద్యార్థులు



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించి, ప్రభంజనం సృష్టించారు. 10 జీపీఏ సాధించిన విద్యార్థి కే.స్ఫూర్తిని పుష్పగుచ్ఛం అందించి, డీఈఓ రవీందర్‌రెడ్డి, ఎంఈఓ శంకర్‌లు అభినందించారు. ఎంతో శ్రద్ధ, ఆసక్తితో చదివి కేజీబీవీ విద్యార్థులు అత్యున్నత ఫలితాలు సాధించడం గర్వకారణంగా ఉందని అన్నారు. ఎస్ఓ అపర్ణ విద్యార్థులను కొనియాడారు. ఉన్నత చదువుల్లో కష్టపడి చదివి భవిష్యత్తులో గొప్ప స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. 29 మంది విద్యార్థులకు గాను 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. 10 జీపీఏ ఒక్కరు, 9 జీపీఎ 16 మంది విద్యార్థులు, 8 జీపీఏ 9 మంది విద్యార్థులు, 7 జీపీఏ ముగ్గురు సాధించారని ఎస్ఓ తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించి ఘన కీర్తిని నిలిపారు. దిలావర్‌పూర్‌లోని కేజీబీవీ 29 విద్యార్థులకు గాను 29 మంది మొదటి స్థానం 10 జీపీఏ, జెడ్పీఎస్ఎస్ 45 విద్యార్థులకు గాను 45 మంది మొదటి స్థానం 9.0జీపీఏ, జెడ్పీఎస్ఎస్ గుండంపల్లి 21 విద్యార్థులకు గాను 21 మంది మొదటి స్థానం 9.0జీపీఏ, బన్సపల్లిలో 20 విద్యార్థులకు గాను 20 మంది మొదటి స్థానం 8.8 లిటిల్ స్కాలర్స్ స్కూల్ న్యూలోలంలో మొదటి స్థానం 9.8, ఫ్లేయర్ స్కూల్ సిర్గాపూర్‌లో మొదటి స్థానం 9.8 ర్యాంకులతో వందశాతం ఉత్తీర్ణత సాధించారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కార్డెన్ సెర్చ్

నవతెలంగాణ-కుభీర్

శాంతిభద్రతల పరిరక్షణకు కార్డెన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నామని కుభీర్ సీఐ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కుభీర్ మండలంలోని సెరిపెల్లి గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రధాన రోడ్డుపై ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ప్రజలకు భద్రత కోసం పోలీసులు ఉన్నారని అన్నారు. గ్రామాల్లో ఎక్కువగా యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా ఉండాలని తెలిపారు. గ్రామంలో గంజాయి, దేశీదారు వంటివి విక్రయాలు జరిగినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. సమాచారం అందించిన వ్యక్తుల విషయాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. మండలంలో ఉన్న అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకుంటే 1 సీసీ కెమెరా 100 మందితో సమానం అని గుర్తు చేశారు. అదే విధంగా వాహనదారులు ఏదైనా వాహనాన్ని కొనుగోలు చేసినప్పుడు వాటికి అవసరమైన పత్రాలు సరిగ్గా ఉన్నాయా లేవా అని తెలుసుకున్న తర్వాత వాహనాన్ని కొనుగోలు చేపట్టాలని అన్నారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో సరైన ధృవపత్రాలు లేని 56 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు సీజ్ చేశామని అన్నారు. అదే విధంగా పార్లమెంట్ ఎన్నికలో ఎలాంటి మద్యం, డబ్బులు లభించినట్లైతే వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరూ పార్లమెంట్ ఎన్నికలో ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకొని మీకు నచ్చిన అభ్యర్థిని ఓటు వేసుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బైంసారూరల్ ఎస్సై శ్రీకాంత్, కుభీర్ ఎస్సై రవీందర్, కుంటల ఎస్సై రజినీకాంత్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మద్యం దుకాణం సీజ్ చేసిన అధికారులు

నవతెలంగాణ-బెజ్జూరు



మండల కేంద్రంలోని శ్రీనిధి వైన్‌షాపును మంగళవారం ఎక్సైజ్ ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో సీజ్ చేశారు. సోమవారం ఎస్‌సీఎఫ్ బృందం మద్యం షాపును తనిఖీ చేయగా ఎక్కువ ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నట్టు తేలడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీజ్ చేసినట్టు ఎక్సైజ్ ఎస్ఐ తెలిపారు. ఎక్కువ ధరకు మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని, ఎంఆర్‌పీ ధరకే మద్యాన్ని విక్రయించాలన్నారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు మద్యం దుకాణం సీజ్ చేసి ఉంటుందని తెలిపారు. ఇందులో కానిస్టేబుల్ హుస్సేన్, మండల్ ఉన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని కొండపెల్లి గ్రామంలో మంగళవారం మైనర్ బాలికకు వివాహం జరగుతున్న విషయాన్ని తెలుసుకున్న జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు గ్రామానికి చేరుకొని అడ్డుకున్నారు. అనంతరం బాలిక తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. మైనర్ల వివాహం ద్వారా ఎదురయ్యే సమస్యల గురించి కుటుంబ సభ్యులు, గ్రామపెద్దలకు వివరించారు. ఈ సందర్భంగా డీసీపీఓ బూర్ల మహేష్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్య నేరమన్నారు. అమ్మాయికు18, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహాలు చేయాలన్నారు. లేనిపక్షంలో బాల్య వివాహాల నిషేద చట్టం 2006 ప్రకారం కేసులు నమోదుచేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. బాల్య వివాహాలు జరిగుతున్న సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ హజార్ అలీ, బాలరక్ష భవన్ సిబ్బంది ప్రవీన్‌కుమార్, డోంగ్రి చంద్రశేఖర్, అంగన్‌వాడీ టీచర్ సంతోషి పాల్గొన్నారు.

విద్యార్థులకు మౌళిక సదుపాయాలు కల్పించాలి

- అదనపు లెక్టర్ దీపక్ తివారీ



నవతెలంగాణ-కౌటాల

వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి విద్యార్థులకు అన్ని పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అధికారులకు సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్మాణంలో భాగంగా మంగళవారం మండలంలోని పలు పాఠశాలలను పరిశీలించారు. అదేవిధంగా గురుడుపేట్, కన్నెపెల్లి పోలింగ్ సెంటర్లను పరిశీలించి ఎలక్షన్ నాటికి అన్ని సౌకర్యాలు కలిగి ఉండాలని అధికారులకు ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నాణ్యతతో కూడిన పనులు చేయాలన్నారు. నీటి సరఫరా, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, ఎలక్ట్రిసిటి పనులన్నింటినీ పూర్తిచేయాలన్నారు. ఆయన వెంట మండల విద్యాధికారి సోమయ్య, ఎంపీడీఓ నస్రుల్లాఖాన్ ఉన్నారు.

హక్కుల సాధనకు మేడేను ఘనంగా నిర్వహిద్దాం



నవతెలంగాణ-రెబ్బెన

హక్కుల సాధనకు 138వ మేడేను ఘనంగా నిర్వహిద్దామని టీబీజీకేయస్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం గోలేటిలో మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. బొగ్గు గనులను సింగరేణికి నామినేటెడ్ పద్ధతిలో కేటాయించాలని, ప్రయివేటు వారికి కేటాయించే పద్ధతి మానుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులకు ఇంకమ్‌ట్యాక్స్ రద్దు చేయాలని, సొంతింటి పథకం అమలుచేయాలని, ప్రతి కార్మికుడికి వడ్డీ లేని గృహ రుణాన్ని అందించాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు హైపర్ కమిటీ వేతనాలు అందించాలన్నారు. కార్మిక వర్గమంతా ఐకమత్యంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ నాయకులు మంగీలాల్, ఏరియా నాయకులు రాజేశం, శ్రీనివాస్, గణపతి, మల్లయ్య పాల్గొన్నారు.

మండలంలో తగ్గిన పదో తరగతి ఫలితాలు

నవతెలంగాణ-బెజ్జూరు

మండలంలోని జీపీఏల శాతం తగ్గింది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది జీపీఏల ఉత్తీర్ణత శాతం తగ్గింది. మండలంలో ఐదు ఆశ్రమ పాఠశాలలు, రెండు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలు, కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయం ఉన్నాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మొత్తం 90 మంది విద్యార్థులు వార్షిక పరీక్షలు రాయగా 73 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సలుగుపెల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 23 మంది విద్యార్థులకు గాను 20 మంది, మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయంలో 38 మంది విద్యార్థులకు గాను 36 మంది ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని నాలుగు ఆశ్రమ పాఠశాలల్లో మొత్తం 92 మంది విద్యార్థులు వార్షిక పరీక్షలు రాయగా 87 మంది ఉత్తీర్ణులు కాగా 8.7 జీజీప సాధించగా 95 శాతం ఉత్తీర్ణత సాధించారు. బెజ్జూరు హైస్కూల్లో 8.7 జీపీఏ సాధించగా సలుగుపెల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 8.5 జీపీఏ సాధించారు. మండలంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలల, ఆశ్రమ పాఠశాలలో గతంతో పోల్చితే ఈ ఏడాది ఫలితాలు తగ్గాయి. ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో ఫలితాలు రాగా ప్రస్తుతం ఫలితాలు నిరాశ జనకంగా వచ్చాయి.


వేసవి క్రీడా శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మే ఒకటి నుండి 31 తారీకు వరకు జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 11 క్రీడలకు సంబంధించి నిర్వహించే వేసవి క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడల అధికారిని రమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రీడలకు సంబంధించిన సమాచారం కోసం అథ్లెటిక్స్ కోసం కే రాకేష్ 8247096710, వాలీబాల్ కోసం తిర్యానికి చెందిన లక్ష్మణ్ 9492324005, హ్యాండబాల్ కోసం ఆసిఫాబాద్‌కు చెందిన అరవింద్ 9550909870, కబడ్డీ కోసం సిర్పూర్ (యు)కు చెందిన ధర్మారావు 9441734946, బాక్సింగ్ కోసం కాగజ్‌నగర్ కు చెందిన ఎం. శేఖర్ 9177112942, యోగ కోసం గోలేటికి చెందిన అలేఖ్య 8096923672, కాగజ్‌నగర్‌కు చెందిన ఏడుకొండలు 9704010779, నెట్ బాల్ కోసం ఆసిఫాబాద్‌కు చెందిన తిరుపతి 7981254389, సాఫ్ట్ బాల్ కోసం కాగజ్‌నగర్‌కు చెందిన గురువేందర్ 9533117323, ఫుట్ బాల్ కోసం గోలేటికి చెందిన ఎం.కృష్ణ 9700071606, ఖోఖో కోసం ఆసిఫాబాద్‌కు చెందిన జి సాయి 7675845102 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎంపీపీగా బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-సిర్పూర్(టి)



సిర్పూర్ మండల ప్రజా పరిషత్ ఎంపీపీ చునార్కర్ సువర్ణపై గత నెల 30వ తేదీన అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా నెగ్గింది. దీంతో వైస్ ఎంపీపీ ఈర్ల సత్యనారాయణను మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడిగా ఎన్నుకోవాలని జెడ్పీ సీఈఓ ఆదేశాల చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించినట్టు ఎంపీడీఓ సత్యనారాయణ అన్నారు.

శాతం పెరిగింది..ర్యాంకు తగ్గింది

- 83 శాతంతో 31వ స్థానంలో నిలిచిన జిల్లా
- ఐదు పాఠశాలలో 100శాతం ఉత్తీర్ణత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పదో తరగతి విద్యార్థుల ఫలితాలు మంగళవారం ఉదయం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఎస్ఎస్‌సీ బోర్డు అధికారులు విడుదల చేశారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఆసిఫాబాద్ జిల్లా 31వ స్థానం సాధించి 83 శాతం ఫలితాలు పొందింది. పది పరీక్షల ఫెయిలైన విద్యార్థులు త్వరలో జరగనున్న సప్లిమెంటరీ పరీక్షలకు ఈనెల 16వ తేదీ వరకు ఫీజులు చెల్లించవచ్చని ఎస్ఎస్‌సీ బోర్డు అధికారులు తెలిపారు.

జిల్లా శాతం పెరిగింది..ర్యాంకు తగ్గింది

గత సంవత్సరం ఫలితాలతో పోలిస్తే ఈ సంవత్సరం విడుదల చేసిన ఫలితాల్లో ఫలిత శాతం పెరిగినప్పటికీ, ర్యాంకు తగ్గింది. గత సంవత్సరం 75శాతంతో ఫలితాలల్లో 29వ స్థానం సంపాదించగా ప్రస్తుత సంవత్సర ఫలితాల్లో 83శాతం ఫలితాలు సాధించి రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 31వ స్థానాన్ని పొందింది. జిల్లాలో 6393 మంది విద్యార్థులకు గాను 5325 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పరీక్షలు రాసిన వారు 3008 మంది బాలురు, 3385 మంది బాలికలు ఉండగా, 2366 మంది బాలురు, 2959 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు.

100 శాతం ఫలితాలు సాధించిన 5 పాఠశాలలు

జిల్లాలో ఐదు పాఠశాలలు 100శాతం ఫలితాలు సాధించి ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలిచాయి. జైనూర్ మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాల, కేజీబీవీ పాఠశాల, రెబ్బెన మండలం నంబాల జడ్పీఎస్ఎస్, కెరమెరి మండలం ఝరి జడ్పీఎస్ పాఠశాల, లింగాపూర్ మండలం కేజీబీవీ పాఠశాలల్లో 100శాతం ఫలితాలు వచ్చాయి.

ఫలితాల్లో సత్తా చాటిన పాఠశాలలు

మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో పలు పాఠశాలలు తమ సత్తా చాటాయి. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పీటీజీలో 44 మంది విద్యార్థులకు 40 మంది ఉత్తీర్ణులు కాగా, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 72 మందికి 70 మంది, జడ్పీఎస్ఎస్ బాలుర పాఠశాలలో 70కి 35 మంది, బాలికల పాఠశాలలో 84 కు 37 మంది, జనకాపూర్ ఉన్నత పాఠశాలలో 86కు 35 మంది, మహాత్మ జ్యోతిబాపూలేలో 72కు 70 మంది, గిరిజన గురుకుల పాఠశాలలో 77కు 72 మంది, కేజీబీవీలో 41కు 35 మంది, బాలుర ఆశ్రమ హై స్కూల్ 48కి 27 మంది, బాలికలలో 43కి 24మంది, తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 100కి 95 మంది, మైనారిటీ గురుకులంలో 57కి 53 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఏపీజే అబ్దుల్ కలాం పాఠశాల ప్రభంజనం

జిల్లా కేంద్రంలోని ఏపీజే అబ్దుల్ కలాం పాఠశాల ఫలితాల్లో ప్రభంజనం సృష్టించింది. పాఠశాలకు చెందిన విద్యార్థిని జోయా ఆఫ్షీన్ పది పాయింట్లు పది సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచింది. పాఠశాల 100 ఉత్తీర్ణత సాధించి ఆదర్శంగా నిలిచింది. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ అబ్దుల్ హసన్, ప్రిన్సిపల్ లోనారే కిరణ్ అభినందించారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు మరిన్నీ విజయలు సాధించాలని ఆకాంక్షించారు.

ఏకాగ్రతతో చదివి మరింత ముందుకు సాగాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థి దశలో ఏకాగ్రతతో చదివి మరింత ముందుకు సాగుతూ జిల్లా, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లాలో మంచి మార్కులు సంపాదించిన 11మంది విద్యార్థులను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్‌తో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతి సంవత్సరం ఆసిఫాబాద్ జిల్లా తన ప్రత్యేకతను చాటుతుందన్నారు. రాష్ట్రంలో ఏడవ స్థానంలో నిలవడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు మరింత ఏకాగ్రతతో చదివి జిల్లాకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వారికి అవసరమైన సూచనలు సలహాలు చేయాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు సంపత్, బాలాజీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పార్టీల సహకారంతో శాంతియుత ఎన్నికలు

- కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల్లో శాంతియాత నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీల సహకరిస్తేనే సాధ్యమవుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదుల కోసం సివిజిల్ యాప్ పనిచేస్తున్నట్లు తెలిపారు. అలాగే సభలు సమావేశాలు అనుమతుల కోసం 48 గంటలు ముందుగా వివిధ అప్లికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేశామని ఎక్కడైనా ఇబ్బందులు పార్టీల ప్రతినిధులు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇంటి నుండి ఓటింగ్ ప్రక్రియలో భాగంగా జిల్లాలో మొత్తం 157 మంది దరఖాస్తు చేసుకున్నారని, 128 మంది సిర్పూర్, 29 మంది ఆసిఫాబాద్ నియోజకవర్గం నుండి ఓటు వేయనున్నారని తెలిపారు. మే 3 నుండి మే 8 వరకు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీఓ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవచ్చని, ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 వరకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఆర్డీఓ లోకేశ్వరరావు, తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్పాండే, ఎన్నికల సూపరింటెండెంట్ మధుకర్, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

పదిఫలితాల్లో కృష్ణవేణి ముందంజ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు మంగళవారం విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో ముందంజలో నిలిచారు. మొత్తం 56 మంది విద్యార్థులు పరీక్ష రాయగా ముగ్గురు పది జీపీఏ, 9.8 జీపీఏ ముగ్గురు, 9.7 జీపీఏ ఇద్దరు, 9.5 ఒకరు సాధించారు. 8 నుంచి 10 జీపీఏ మధ్యలో 38 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గత పదిహేను సంవత్సరాలుగా విద్యర్థులు, ఫలితాల నిష్పత్తిలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వరుసగా తన ఆధిపత్యాన్ని చాటుకుంటోంది. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, విద్యాబోధన చేసి ఉపాధ్యాయులను పాఠశాల కరస్పాండెంట్ సురవర్ధన్ అభినందించారు.

పది వార్షిక ఫలితాల్లో వెనుకబడ్డ దహెగాం

- గత సంవత్సరం కంటే తగ్గిన ఫలితాలు



నవతెలంగాణ-దహెగాం

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌళిక వసతులు కల్పిస్తున్నా వార్షిక ఫలితాల్లో మాత్రం వెనుకబడుతూనే ఉన్నాయి. పది ఫలితాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, ప్రత్యేక బడ్జెట్‌లు కేటాయించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నప్పటికీ వాటి ఫలితాల తీరు మెరుగుపడకపోగా మరింత వెనుకబడి పోతున్నాయంటే వాటికి కారణాలు వేరే చెప్పనక్కరలేదు. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం విడుదలైన పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో దహెగాం మండలం సుమారు 9 శాతం ఫలితాలు తగ్గాయి. గత సంవత్సరం 72శాతం ఉండగా 63 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో మొత్తం ఎనిమిది ఉన్నత పాఠశాలలుండగా వాటిలో ఐదు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, మరో ఆశ్రమ పాఠశాలతో పాటు ఎస్‌టీ ఫ్రాన్సిస్ ప్రయివేటు పాఠశాలలున్నాయి. ఇందులో మొత్తం 269 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకాగా కేవలం 170 మంది మాత్రమే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలల వారీగా చూస్తే ఎస్‌టీ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం ప్రయివేటు పాఠశాలలో అత్యధికంగా 52 మందికి గాను 48 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా 92.31 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల వారీగా కేజీబీవీలో 34 మంది విద్యార్థులకు గాను 28 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా ఉత్తీర్ణత శాతం 82.35గా నమోదైంది. అత్యల్పంగా బీబ్రా జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 19 మంది విద్యార్థులకు గాను కేవలం నలుగురు మాత్రమే ఉత్తీర్ణత సాధించగా ఉత్తీర్ణత శాతం 21 శాతం నమోదు కాగా మండలంలోనే అట్టడుగు స్థానాన్ని కైవసం చేసుకుంది. అలాగే దహెగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 49 మందికి గాను కేవలం 18 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. కొంచవెల్లి పాఠశాలలో ఉత్తీర్ణత శాతం 59.26గా, ఇట్యాలలో 61.36గా, చిన్నరాస్పెల్లిలో 68 శాతం ఫలితాలు నమోదు కాగా సెయింట్ ఫ్రాన్సిస్ ప్రయివేటు పాఠశాలకు చెందిన చపిడ మహతి 9.3 శాతం జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

మండల టాపర్ షణ్ముఖి ప్రియ

నవతెలంగాణ-రెబ్బెన



మండలంలోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో చదువుతున్న షణ్ముఖ ప్రియా 9.7 జీపీఏతో మండల టాపర్‌గా ర్యాంకు సాధించింది. సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ చైతన్య షణ్ముఖ ప్రియాను అభినందించారు. పాఠశాలలో మొత్తం 80 మంది విద్యార్థులు ఉండగా 78 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 78 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. తమ గురుకుల పాఠశాలలో చదువుతున్న ఎస్ జాహ్నవి 9.5 జీపీఏతో ద్వితీయ ర్యాంకు సాధించిందని తెలిపారు.

షాడో పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- అదనపు కలెక్టర్ దాసరి వేణు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

షాడో పోలింగ్ కేంద్రాలలో పరిస్థితిపై అధికారులకు సమాచారం అందించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు తెలిపారు. మంగళవారం జిల్లా అదనపు ఎస్పీ ప్రభాకర్ రావుతో కలిసి పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలలో భాగంగా ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని జిల్లాలో 61 పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి నెట్‌వర్క్ అందుబాటులో లేనందున ఆ పోలింగ్ కేంద్రాలను షాడో పోలింగ్ కేంద్రాలుగా గుర్తించడం జరిగిందన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వైర్‌లెస్ సెట్లపై పంచాయితీ కార్యదర్శులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ రోజు ప్రతి 2 గంటలకు పోలింగ్ శాతాన్ని పై అధికారులకు తెలియజేయాలని, పోలింగ్ రోజు ఆయా పోలింగ్ కేంద్రాలలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు సెట్ ద్వారా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ఉమర్ హుస్సేన్, కమ్యూనికేషన్ అధికారి సందీప్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



జన జాతర సభను విజయవంతం చేయండి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మే 2న ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న జన జాతర మహాసభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాం నాయక్ అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్ ప్రక్కన గల మైదానంలో జన జాతర మహాసభ గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బాధ్యులు, నాయకులు హాజరవుతున్నారన్నారు. ఈ సభకు జిల్లాలోని పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు విలాస్ బానోత్, నియోజకవర్గ అధికార ప్రతినిధి రాచబత్తుల మల్లికార్జున్, నియోజకవర్గ కోఆర్డినేటర్ రాపర్తి మురళీ, మాలి సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.

శాంతి భద్రత పరిరక్షకేణ కార్డెన్ సెర్చ్ : డీఎస్పీ



నవతెలంగాణ-చింతలమానేపల్లి

శాంతిభద్రతల పరిరక్షణ కోసమే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ అన్నారు. మంగళవారం గుప్పగుడ, లంబడెట్టి గ్రామంలో కౌటాల సీఐ సాధిక్ పాషా, ఎక్సైజ్ పీఐ రావి కుమార్‌తో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటా సోదాలు చేసి 90 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకోని 13 మందిపై కేసు నమోదు చేసి 2000 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్టుట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ గ్రామస్తులకు పార్లమెంట్ ఎన్నికల కోడ్ గురించి అవగాహన కల్పించారు. గుడుంబా అమ్మిన, తయారు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానిత వ్యక్తులు కనబడితే సమాచారం అందించాలన్నారు. యువత వ్యవసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణ, గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కల్పించడం, నేరాలు నిర్మూలించేందుకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. గుట్కా, గంజాయి సాగు, అమ్మకం, కలప అక్రమ రవాణా, బెల్ట్ షాపుల నిర్వహణ తదితర నేరాలకు పాల్పడితే వారి సమాచారం పోలీసులకు అందించాలని సూచించారు. ఇందులో సీఆర్పీఎఫ్, టీఎస్పీఎస్పీ, ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆదర్శ పాఠశాలలో వేసవి క్రీడా శిక్షణ శిబిరం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో మే 1 నుంచి జూన్ 1 వరకు వాలీబాల్, నెట్ బాల్ వేసవి క్రీడా శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు పాఠశాల పీడీ తిరుపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ పాఠశాలల్లో చదువుతూ చుట్టుపక్కన గ్రామాలలో ఉన్న 6 సంవత్సరాల నుంచి 16 సంవత్సరాల బాల, బాలికలు వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ఉపయోగించుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ నెంబర్ 9949300668ను సంప్రదించాలన్నారు. వేసవి శిబిరానికి వచ్చే క్రీడాకారులు ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో తప్పనిసరిగా తీసుకునిరావాలని సూచించారు.

పదిలో 66 శాతం ఉత్తీర్ణత

నవతెలంగాణ-కౌటాల



పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలో 66 శాతం ఉత్తీర్ణులయ్యారు. మండలంలో ఐదు ప్రభుత్వ పాఠశాలలు జడ్పీహెచ్ఎస్ కౌటాల, ముత్తంపేట్, గుండాయిపేట్, బోదంపెల్లి, కేజీబీవీతో పాటు ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. మొత్తం 230 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 152 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ముత్తంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని చౌదరి నారాయణ, నరిగె అశోక్‌కు 8.7 జీపీఏ వచ్చాయి. అదేవిధంగా మండలంలో రెండు పాఠశాలలు ఉండగా ఓ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించగా ఇన్ఫంట్ జీసెస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో అభిరామ్ అనే విద్యార్థి 9.5 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి మండల టాపర్‌గా నిలిచిన ఇద్దరు విద్యార్థులను పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు గావుడె హన్మంతు, ఉపాధ్యాయులు అభినందించారు.

నవతెలంగాణ
మంచిర్యాల
4
బుధవారం | మే 01, 2024 | www.navatelangana.com

పది ఫలితాల్లో ఎంజేపీ విద్యార్థుల హవా




నవతెలంగాణ-లక్షెట్టిపేట

రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో మహాత్మా జ్యోతి బా పూలే తెలంగాణ బీసీ గురుకుల పాఠశాల(బాలుర) లక్షెట్టిపేటకు చెందిన విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు ఉత్తమ జీపీఏ సాధించిన ప్రతిభను చాటారు. 67 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 67 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇద్దరు విద్యార్థులు చంద్ర మౌళి, సచిన్ కుమార్ 9.8 జీపీఏ, 7 మంది విద్యార్థులు 9.5 జీపీఏ 22 మందికి 9.0 జీపీఏ సాధించారు. విద్యార్థులను, ఉత్తమ ఫలితాలు పొందేలా కృషి చేసిన ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ ఎం.గౌతమ్ కుమార్ రెడ్డి అభినందించారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

నవతెలంగాణ-నస్పూర్

వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని సద్వినియం చేసుకోవాలని డీజీఎం పర్సనల్ అరవిందరావు అన్నారు. మంగళవారం ప్రగతి స్టేడియంలో వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ శ్రీరాంపూర్ ఏరియా ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి ఉచిత క్రీడా శిక్షణ శిబిరానికి ఆయన అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల వల్ల మానసికోల్లసం పెంపొందుతుందని, నిష్ణాతులైన శిక్షకులచే ఫుట్ బాల్, వాలీ బాల్, అథ్లెటిక్స్, బాక్సింగ్, బాస్కెట్ బాల్ క్రీడలలో 25 రోజులపాటు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని సింగరేణి ఉద్యోగుల పిల్లలు ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, హనరరీ సెక్రటరీ పాల్ సృజన్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ తోట సురేష్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

• ఎస్‌టీపీపీ మేనేజర్ బసివిరెడ్డి



నవతెలంగాణ-జైపూర్

ప్రకృతి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ జనరల్ మేనేజర్ బసివిరెడ్డి అన్నారు. తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నిజామాబాద్ సూచనల మేరకు మంగళవారం ఎస్‌టీపీపీలో మిషన్ లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్యాని నివారించడం కోసం కృషి చేయాలని, అవసరానికి మించి విద్యుత్ వినియోగించకూడదని తెలిపారు. అవసరమైతే తప్ప విద్యుత్ సంబంధించి ఫ్యాన్లు లైట్లు బల్బులు వినియోగించరాదని సూచించారు. ప్రకృతిని కాపాడుకోవడం మనందరి బాధ్యతని పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం కోసం సింగరేణి లక్షల్లో మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు జేఎస్ సింగ్, సముద్రాల శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, రామశాస్త్రి పాల్గొన్నారు.

సేంద్రీయ వ్యవసాయంపై సీఎం ప్రత్యేక దృష్టి

• ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు



నవతెలంగాణ-మంచిర్యాల

సీఎం రేవంత్‌రెడ్డి సేంద్రీయ వ్యవసాయంను ప్రోత్సహించేందుకు ప్రణాళిక రచిస్తున్నారని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. మంగళవారం మంచిర్యాలలోని వైశ్య భవన్‌లో హాజీపూర్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ, సేంద్రీయ ఆహార ఉత్పత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిసాన్ మేళాను మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వివేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయంకు చేయూత ఇవ్వడం వల్ల రైతులకు పెట్టుబడి, ప్రజలకు ఎరువు రహిత ఆహార ఉత్పత్తులు అంది ఆరోగ్యంకు రక్షణ ఇస్తుందని చెప్పారు. ఇప్పటికే ముఖ్యమంత్రి ఆర్గానిక్ వ్యవసాయం ఎలా చేయాలని ప్రభుత్వ సహకారం ఎలా అందించాలనే కోణంపై మంత్రులు, అధికారులతో సమాలోచన చేశారని తెలిపారు. ముఖ్యమంత్రితో సేంద్రీయ వ్యవసాయ రైతులతో సమావేశం ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు కోరిక మేరకు మంచిర్యాలలో ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తానని భరోసా ఇచ్చారు. మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి, చెన్నూర్, మంచిర్యాల నియోజకవర్గాల్లో పండ్లు, కూరగాయలు పండించే రైతులు, చేపలు, పాడి, రైతులకు అందుబాటులో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన పిదప భూసేకరణ చేయాలని అధికారులను పురమాయిస్తామని అన్నారు. మంచిర్యాలలో చేనేత దారులకు సౌకర్యంగా ఇండస్ట్రీ పార్క్ ఏర్పాటు చేస్తానని ప్రేమ్ సాగర్‌రావుకు హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ మంచిర్యాలలో ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రం, ఇండస్ట్రీ పార్క్ ఏర్పాటు చేయాలనే వినతికి సానుకూలంగా స్పందించిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం శ్రామిస్తుందన్నారు. రైతులు మూడు దశల్లో పంట మార్పిడి పంటలు వేయాలని సూచించారు. మొదటి దశలో వరి, రెండవ దశలో పప్పు దినుసులు, మూడవ పంటగా కూరగాయలు పండించాలని కోరారు. పంట మార్పిడి విధానం వల్లనే రైతులకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకునే విధానముకు రైతులు స్వస్తి పలకాలని సూచించారు. ఇక్కడ వనరులు, ఉత్పత్తులు, ఆదాయం ఇక్కడి వారే అనుభవించాలని ఆకాక్షించారు. ఆర్గానిక్ ఆహార ఉత్పత్తులు స్వీకరించడం వలన అనారోగ్య సమస్యలు తలెత్తవని అన్నారు. విద్యాధికులు వ్యవసాయ రంగం వైపు మక్కువ చూపాలని ఎమ్మెల్యే వివేక్ పిలుపునిచ్చారు. ఆర్గానిక్ వ్యవసాయ రైతులకు ప్రభుత్వం ప్రోత్సహం అందించాలని గోనే శ్యామ్ సుందర్‌రావ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హాజీపూర్ జడ్పీటీసీ పుస్కూరు శిల్ప శ్రీనివాస్ రావు, బొడ్డు శంకర్, తిరుపతి, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొత్త గనుల ఏర్పాటుకు కృషి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో కొత్త గనుల ఏర్పాటుకు కృషి చేస్తామని, పనిచేసే కార్మికులకు సొంతింటి కల నేరవేర్చేందుకు కృషి చేస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మికులకుశుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నవతెలంగాణతో మాట్లాడుతూ సింగరేణి బీఐఆర్‌ఎఫ్‌లో నుండి బయటపడటానికి ఏఐటీయూసీ నాయకులు కొమురయ్య కార్మికులను చైతన్య పరిచారని తెలిపారు. 1981లో వారసత్వ ఉద్యోగాలకు శ్రీకారం చుట్టామన్నారు. కార్మికులు 21 సంవత్సరాల నుంచి తీసుకుంటున్న లాభాల వాటాను ఏఐటీయూసీ సాధించిందన్నారు. గతంలో 2,3 సంవత్సరాలకు ఒకసారి కొత్త గనుల ఏర్పాటుకు అంగీకారం చేశామని గుర్తు చేశారు. నర్సింగరావు చైర్మన్‌గా ఉన్న సమయంలోనే ఓన్ యువర్ ఓన్ హౌస్ పేరుతో సొంత ఇల్లు కోసం పోరాటం చేశామని భూపాలపల్లిలో మొదలు పెట్టామని కార్మికులు సుముఖత చూపకపోవడంతో ఆగిపోయిందన్నారు. ఇప్పుడు ఇచ్చిన హామీల ప్రకారం పెర్క్స్ పై ఐటీ మాఫీ, సింగరేణిలో ఉన్న ఖాళీలను ఇంటర్నల్ ఉద్యోగులతోనే భర్తీ చేయాలన్నారు.

విద్యార్థులను అభినందించిన జీఎం సంజీవరెడ్డి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి ఉన్నత పాఠశాలలో అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ పదవ తరగతిలో అత్యధిక గ్రేడ్ పాయింట్లు తెచ్చుకున్న విద్యార్థిని, విద్యార్థులుపై చదువులలో కూడా అత్యధిక మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులకు విద్య నేర్పిన గురువులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం వి పురుషోత్తమరెడ్డి, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు కే వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం పర్సనల్ పి అరవిందరావు, పర్సనల్ మేనేజర్, కరస్పాండెంట్ ఏ.రాజేశ్వర్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

పది ఫలితాలలో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-మందమర్రి

పదవ తరగతి ఫలితాలలో మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటారు. పరీక్షకు హాజరైన 98 మంది విద్యార్థులూ ఉత్తీర్ణులై వరుసగా రెండవసారి 100 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ జయకృష్ణ తెలిపారు. కె నవదీప్, బి రిషిత వర్మ ఇద్దరు విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. ముగ్గురు విద్యార్థులు బి రోహిత్ వర్మ, కె భార్గవి, ఎం చిన్మయి 9.8, 6 గురు 9.7, 3 గురు 9.5, 7 గురు 9.3 సాధించారు. 98 మంది విద్యార్థులలో 43 మంది విద్యార్థులు 9 పైన జీపీఏ సాధించడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ మర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను, సహకరించిన తల్లిదండ్రులను, శ్రమించిన ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ జయకృష్ణరెడ్డి అభినందించారు.

ఉపాధి హామీని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తాం

• ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-జన్నారం

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుక పేదింటి బిడ్డయిను ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని ఇందన్ పల్లి, రెండ్లగూడా, మొర్రిగూడా, టీజీపల్లె, దేవునిగూడా, గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలతో కలసి ముచ్చట్టించారు. ఈ సందర్భంగా కార్మికులతో కలిసి ఉపాధి హామీ పనిలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అదే విధంగా కామన్ పల్లె, జన్నారం గ్రామాల్లో జోరుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం 100 రోజుల ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశ పెట్టిన ఘనత కాంగ్రెస్‌దేనని అన్నారు. పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ చేసేదే చెప్తుంది. ఈ ప్రాంత సమస్యలపై నిరంతరం పోరాటం చేసే ఆత్రం సుగుణను హస్తం గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించి చట్ట సభల్లో పంపాలన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయిన వెంటనే 5 న్యాయాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తామన్నారు. ఉపాధి హామీని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, జిల్లా నాయకులు గుర్రం మోహన్‌రెడ్డి, ఏనుగు సుభాష్‌రెడ్డి, మిక్కిలినేని రాజశేఖర్, మత్స్య శంకరయ్య, ముత్యం సతీష్ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రియాజుద్దీన్, మాజీ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఇసాక్, పసియుల్లా, నాయకులు దాముఖ కరుణాకర్ పాల్గొన్నారు.

నారాయణ విద్యార్థుల విజయభేరి

నవతెలంగాణ-మంచిర్యాల

విడుదల అయిన పదో తరగతి ఫలితాల్లో మంచిర్యాల పట్టణంలోని నారాయణ పాఠశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి విజయభేరి మోగించారు. పాఠశాలలో ఉన్న 30 మంది విద్యార్థులకు గాను 7 మంది 10 జీపీఏ, 13 మంది 9 జీపీఏ సాధించారాని కరీంనగర్ జోన్ ఏజీఎం అన్నం చైతన్య రావు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, అందుకు దోహదపడ్డ ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కవిత, హై స్కూల్ డీన్ వెంకటస్వామి, ఏఓ సంతోష్, పాటశాల సిబ్బంది పాల్గొన్నారు.

దొంగతనాల నిర్మూలనకు ప్రజలు సహకరించాలి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పిల్లలకు వేసవి కాలం సెలవులు రావడంతో విహార యాత్రలు, తీర్థ యాత్రలు, ఊళ్లకు వెళ్ళే వారి ఇండ్లలలో దొంగతనాలు జరుగకుండా నిర్మూలించడానికి సహకరించాలని మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేసవి కాలం సెలవుల్లో ప్రయాణాలు చేసేవారు ఇంటి పక్కన వారికి సమాచారం ఇవ్వాలని, మేడ పైన, ఆరుబయట నిద్రించే వేళలో బంగారు ఆభరణాలు ధరించకూడదని పేర్కొన్నారు. ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమమని, ఇంటి ఆవరణలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం, పెంపుడు కుక్కలను పెంచుకోవడం వల్ల దొంగ తనాలను అరికట్టవచ్చని తెలిపారు. కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో, లేదా100కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఫిర్యాదు ధారుని వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు.

ఉపాధి హామీ పనుల పర్యవేక్షణ



నవతెలంగాణ-మందమర్రి

పంచాయతీలలో ఉపాధి హామీ పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్ రాజేశ్వర్ పర్యవేక్షించారు. మంగళవారం మామిడిగట్టు, పొన్నారము, ఆదిల్ పేట్, సారంగపల్లి గ్రామ పంచాయతీలలో ఎంపీడీఓ ఎస్ రాజేశ్వర్ పర్యటించారు. ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. ఉపాధి హామీ సిబ్బందికి, సంబందిత పంచాయతీ కార్యదర్శులకు పనుల పై అవసరమైన సూచనలు చేశారు. ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్స్‌ను ఇచ్చారు. ఈ గ్రామ పంచాయతీలలో షెడ్ నెట్, నీటి సదుపాయం పనులను పరిశీలించారు. సారంగపల్లి గ్రామ పంచాయతీలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులను పశువుల నీటి తొట్టె లను పరిశీలించిన అనంతరం సివిల్ రైట్స్ డే కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవీందర్, పంచాయతీ కార్యదర్శులు హరీష్, సంధ్య, హిమ బిందు, టెక్నికల్ అసిస్టెంట్ తిరుమల్‌గౌడ్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల పని వేళలు మార్చాలని వినతి



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల మున్సిపాలిటీలో పని చేసే కార్మికుల పని వేళలు మార్చాలని కోరుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు సుద్దమల్ల హరికృష్ణ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు ముదురుతున్న నేపథ్యంలో మున్సిపల్ కార్మికులకు పనివేళల్లో మార్పు చేయానలి ఉదయం 5 గంటల నుండి 11 గంటల వరకు మార్చాలన్నారు. కార్మికులకు ఎండ దెబ్బ తగలకుండా మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌లు కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పని వేళల్లో మార్పు చేయాలని కోరారు. కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శ్యాం కుమార్, ప్రధాన కార్యదర్శి ఆత్మకూరు తిరుపతి, ఉపాధ్యక్షుడు కుమారస్వామి, రామస్వామి, దుర్గమ్మ, ఆవుల శ్రీనివాస్, ఇప్ప రవి బూడిద తిరుపతి, అవునూరి లింగయ్య, సవిన్, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

పది ఫలితాల్లో మండలంలో 92.37 శాతం ఉత్తీర్ణత

నవతెలంగాణ-జన్నారం




మంగళవారం వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో మండలంలో మొత్తం 616 మంది విద్యార్థులు రాయగా 569 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా మండలంలో 92.37 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ ఎస్ విజయ్ కుమార్ తెలిపారు. మండలంలోని చింతగూడ, బాదంపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 100 శాత ఉత్తీర్ణత సాధించారన్నారు. కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చదివిన రాథోడ్ ఈశ్వర్, 10/10 జీపీఏ సాధించారన్నారు. అలాగే మండల కేంద్రంలోని రాఘవేంద్ర లిటిల్ హాండ్స్ ప్రయివేట్ పాఠశాలలో 34 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ముగ్గురు 10 జీపీఏ సాధించారు. 19 మంది 9 జీపీఏ సాధించారని పాఠశాల కరస్పాండెంట్ అండ్ చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్, ఎర్ర సంపత్‌లు తెలిపారు. అలాగే స్లేట్ ప్రయివేట్ పాఠశాలలో మొత్తం 85 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 9 మంది విద్యార్థులు 10/10 జీపీఏ, 8 మంది 9.8 జీపీఏ, ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపాల్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. మొత్తం మండలంలో, 92.37 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈఓ పేర్కొన్నారు.




పట్టణంలో బీఆర్ఎస్ విస్తృత ప్రచారం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం పట్టణంలోని 5వ వార్డు, అమరవాది గ్రామంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళలు తెలుపుతూ అడ్డగోలు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్ ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కార్ వచ్చినప్పటి నుంచి విద్యుత్ కోతలు, తాగునీటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని గోడువెల్లబోసుకున్నారు.

బీఎస్పీ, కాంగ్రెస్ నాయకులు చేరిక

పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆర్నె సతీష్, మంచిర్యాల జిల్లా బీఎస్పీ అధ్యక్షుడు గుణ బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి బాల్క సుమన్ ఆహ్వానించారు. అనంతరం బీఆర్ఎస్ పట్టణ నాయకులతో సమావేశం నిర్వహించారు. పట్టణంలో కొనసాగుతున్న ఎన్నికల ప్రచార సరళి, రానున్న రోజుల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పర్యటనకు సంబంధించిన వివరాలను నాయకులకు వివరించారు. మే 4వ తేదీన మంచిర్యాల పట్టణంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్ షో విజయవంతం చేయాలని సమీక్షించారు.

పది ఫలితాల్లో బాలికలదే పైచేయి



నవతెలంగాణ-జైపూర్

మండల పరిదిలో విడుదలైన పది ఫలితాల్లో బాలికలు అత్యధికంగా ఉత్తీర్ణత సాధించారు. జైపూర్ మండలంలో 91 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ రాధాకృష్ణ తెలిపారు. పాఠశాల వారీగా ఉత్తీర్ణత ఫలితాలను పరిశీలిస్తే జైపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల నుండి 95 శాతం ఇందారం పాఠశాల 91, ముదిగుంట 57, కుందరం 100, పొవునూరు పాఠశాల 100, శెట్టిపల్లి పాఠశాలలో 96, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. జైపూర్ మండల పరిధి వివిధ పాఠశాలలకు చెందిన 184 మంది బాలురు పరీక్షలు హాజరు కాగా 165 ఉత్తీర్ణత సాధించారు. 123 మంది బాలికలు పరీక్షలు హాజరు కాగా 115 మంది సాధించారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి ఆదర్శ 9.8 జీపీఏతో ప్రథమ స్థానంలో నిలిచారు..

భీమవరం మండలంలో

భీమారం మండలలో 98 శాతం ఫలితాలు సాధించారు. మండల పరిధిలో 127 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 125 మంది ఉత్తీర్ణులయ్యారు. భీమారం ప్రభుత్వ పాఠశాల నుండి 77 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 76 మంది ఉత్తీర్ణత సాధించగా పాఠశాలకు చెందిన హబ్సిబా 9.8 జీపీఏతో అగ్ర స్థానంలో నిలిచారు. నర్సింగాపూర్ పాఠశాలలో 100 శాతం, ఆశ్రమ పాఠశాలలో 100 శాత ఉత్తీర్ణత సాధించారు. భీమారం మండల పరిధిలో 98 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు రాధాకృష్ణ తెలిపారు.

స్వీట్లు పంపిణీ చేసిన ఏఐటీయూసీ నాయకులు

నవతెలంగాణ-నస్పూర్

మే డే సందర్భంగా శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో ఏఐటీయూసీ నాయకులు అధికారులకు, సిబ్బందికి మంగళవారం స్వీట్స్ పంపిణి చేశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియా కార్మికులకు, వారి కుటుంబసభ్యులకు మే డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జీఎం ఆఫీస్ పిట్ సెక్రటరీ గొల్లపల్లి రాంచందర్ పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సీ ఫలితాల్లో మంచిర్యాల 20వ స్థానం



మంచిర్యాల : పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాలు మంగళవారం వెలవడ్డాయి. పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర వ్యాప్తంగా మంచిర్యాల జిల్లా 20వ స్థానంలో నిలిచింది. గత యేడాది 23వ స్థానంలో ఉండగా ఈ సారి 20వ స్థానం చేరింది. గత ఏడాది కంటే ఈ ఏడాది జిల్లా ఉత్తీర్ణతలో మెరుగైన ఫలితాలు వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా 9283 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 8579 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 704 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. బాలురు 4338 మంది, బాలికలు 4241 మంది ఉత్తీర్ణత సాధించినట్లు డీఈఓ ఎస్.యాదయ్య తెలిపారు. జిల్లాలో బాలికలే ఉత్తీర్ణత శాతంలో పై చెయ్యి సాధించారు. మంచిర్యాలలోని తీగల్ పహాడ్ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థి ఎస్.చరణ్ తేజ్‌ను డీఈఓ అభినందించారు.

నవతెలంగాణ
5
ఆదిలాబాద్
బుధవారం | మే 01, 2024 | www.navatelangana.com

పదో తరగతిలో మండల టాపర్‌గా రేవంత్‌సాయి

నవతెలంగాణ-వాంకిడి




పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రేవంత్‌సాయి 10కి10 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. కొబ్రాగడె సాత్విక 10కి తొమ్మిది సాధించి రెండవ స్థానంలో నిలిచింది. జిల్లా పరిషత్ పాఠశాలలో 136 మంది విద్యార్థులు హాజరుకాగా 117 మంది ఉత్తీర్ణులయ్యారు. కిర్డీ గ్రామంలో 17 మంది హాజరుకాగా 12 మంది, ఇందాని 22 మంది హాజరుకాగా 16 మంది, ఆశ్రమ పాఠశాల వాంకిడిలో 71 మందికి 71 మంది, బంబారా పాఠశాలలో 28 మందికి 25 మంది, గ్రీనుడ్ పాఠశాలలో 14 మందికి 12 మంది, కస్తూర్బాగాంధీ పాఠశాలలో 36 మందికి 35 మంది ఉత్తీర్ణత సాధించారు. మండలంలో మొత్తం 89 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈఓ మణికుమార్ తెలిపారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ పొడిగింపు

నవ తెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా, ప్రశాంతతను పెంపొందించేందుకు జిల్లా అంతటా మే 1 నుండి 29 వరకు పోలీస్ యాక్ట్ 1861 అమల్లో ఉంటుందని ఎస్పీ సురేష్ కుమార్ ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నతాధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగ్లు, ఊరేగింపులు, ధర్నాలు జరుపరాదని సూచించారు. నిషేదిత ఆయుధాలు కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు, ప్రేలుడు పదార్థాలు, నేరాన్ని పురిగోల్పే ఎటువంటి ఆయుధాలు వాడరాదన్నారు. జిల్లాలో 30 ఆక్ట్ అమల్లో ఉన్నందున నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే ఈ నియమ నిబంధనలు విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు, మిలిటరీ అధికారులకు, విధినిర్వహణలో ఉన్న హోంగార్డ్స్, అంత్యక్రియ ఊరేగింపులకు వర్తించవని పేర్కొన్నారు.

పది ఫలితాల్లో జ్యోతిబాపూలే విద్యార్థుల ప్రతిభ





నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పదవ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ విద్యార్థులు ప్రతిభ చాటారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో మండలంలోని గన్నారంలోగల మహాత్మా జ్యోతీబాపూలే గురుకుల పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. ఇదే పాఠశాలలో గుజ్జ సంజన, నాగుల శ్రీజ, కె. శివానీ పది జీపీ సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ జయప్రధ అభినందించారు. కాగజ్‌నగర్ కేజీబీవీలో 37 మంది విద్యార్థులకు గానూ 32 మంది ఉత్తీర్ణులై 86 శాతం ఫలితాలు సాధించారు. ఇదే పాఠశాలలో గంగారాణి 9.5 జీపీ సాధించారు. విదార్థినీని ప్రిన్సిపాల్ రమ, ఉపాధ్యాయులు అభినందించారు. రాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 25 మంది విద్యార్థులకు గానూ 21 మంది ఉత్తీర్ణులై 84 శాతం ఫలితాలు సాధించారు. ఈజ్‌గాం విలేజ్ నెంబర్ 5 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 80 మంది విద్యార్థులకు గానూ 50 మంది ఉత్తీర్ణులై 75 శాతం, గన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 12 మంది విద్యార్థులకు గానూ ఏడుగురు ఉత్తీర్ణులై 58 శాతం, చింతగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 24 మందికిగానూ 13 మంది ఉత్తీర్ణులై 54 శాతం, ఆరెగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 37 మందికి గానూ 21 మంది ఉత్తీర్ణులై 57 శాతం, గజ్జిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8 మందికిగానూ నలుగురు ఉత్తీర్ణులై 50 శాతం ఫలితాలు సాధించారు.

పది ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్




రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం వెలువడిన పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో మండల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో 32 మంది విద్యార్థులకు గాను 31 మంది, జిల్లా పరిషత్ పాఠశాలలో 57 మందికి 50 మంది, జిల్లా పరిషత్ చెడ్వాయి పాఠశాలలో 26 మంది విద్యార్థులకు గాను 24 మంది, కమ్మర్‌గాం ఆశ్రమ పాఠశాలలో 12 మందికి గాను ఎనిమిది మంది, ఎల్లూరు ఆశ్రమ పాఠశాలలో 16 మంది విద్యార్థులకు గాను16 మంది ఉత్తీర్ణత సాధించినట్టు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థిని అలేఖ్య, ఎల్లూరు ఆశ్రమ పాఠశాల విద్యార్థి దుర్గం నిల్‌కుమార్ 9.0 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచారు. ఎల్లూరు ఆశ్రమ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రధానోపాధ్యాయుడు అశోక్ తెలిపారు.

ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎటువంటి అర్హత లేకుండా ఉన్న వైద్యులతో ఆస్పత్రులు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కొన్ని ప్రయివేటు ఆస్పత్రులలో ఎటువంటి అర్హత లేకుండా కూడా వైద్యులు చికిత్స చేస్తున్నారని ఆరోపించారు. దీంతో వైద్యం కోసం వచ్చే జిల్లాలోని గిరిజనులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. జిల్లాలో 27 ప్రయివేట్ ఆస్పత్రులు ఉండగా వీటిలో కొన్నింటిలో కనీస నియమ నిబంధనలు పాటించడం లేదన్నారు. గతంలో జిల్లాలో ప్రయివేట్ ఆస్పత్రిల్లో రోగులు మరణించిన సంఘటన అనేకం జరిగాయని గుర్తు చేశారు. భవిష్యత్తులో అటువంటివి జరగకుండా జిల్లా వైద్యాధికారి వెంటనే తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గెడం టికనంద్, నాయకులు దుర్గం నిఖిల్, జాడి తిరుపతి పాల్గొన్నారు.

పదవి విరమణ పొందిన కార్మికుడికి సన్మానం

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓపెన్‌కాస్టు విధులు నిర్వహించి మంగళవారం పదవి విరమణ పొందిన హెచ్‌ఈఎంఎం సెక్షన్ జనరల్ మజ్దూర్ మోహింద్ పాషాను సింగరేణి కాలరీస్ వర్కర్స్‌యూనియన్ ఏఐటీయూసీ ఖైరిగూడ ఫిట్ కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానించారు. పదవి విరమణ పొందిన అనంతరం మోహింద్ పాషా ఆయురారోగ్యాలతో ఉండాలని, ఆయన శేష జీవితాన్ని సుఖ సంతోషాలతో గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో గోలేటి బ్రాంచ్ నాయకులు కె కిరణ్, ఉయిక చంద్రశేఖర్, శైనారావు, దేవరకొండ దివాకర్, కృష్ణమోహన్, షిఫ్టు ఇన్‌చార్జి ఎండీ షకీల్, సేఫ్టీ, ఫిట్ కమిటీ సభ్యులు ఎస్.నరేష్, జి.తిరుపతి, అల్లాడి కోటి, శశికిరణ్, తాళ్లపెల్లి కుమారస్వామి, అన్నం రాజ్‌కుమార్, సుధాకర్, శ్రీనివాస్, శ్రీకాంత్, రవి, గోపాల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలో డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావుతో కలిసి ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పర్యటిస్తు, ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. ఆత్రం సుగుణకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణ మాట్లాడుతూ పేదలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఉపాధిహామీ చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆడే సవిత బాయి, జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు బొల్లోజు నర్సయ్య, ఎంపీటీసీ వెంకట రమణరెడ్డి, విలాస్ రావు, నారాయణరెడ్డి, మారుతి, హది, శ్రీనివాస్ రెడ్డి, రాజ్ మహమ్మద్, తేజ్ నాయక్, సత్యపాల్‌రెడ్డి, మసీర్, సురేందర్, సింగం భోజగౌడ్, నవీన్ రెడ్డి, జగదీశ్వర్, ముక్తార్, గంగాధర్, భీంరావు, సలీం గంగాధర్, సాయికృష్ణ గౌడ్, ప్రశాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఓటరు స్లిప్పుల పంపిణీ

నవతెలంగాణ-ఉట్నూర్

ఉట్నూర్ గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి మంగళవారం శాంతినగర్, మోబిన్‌పురలో ఇంటింటికీ తిరుగుతూ ఓటరు స్లిప్పుల పంపిణీ చేశామని ఆర్ఐ శోభారాణి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ పార్లమెంట్ ఎన్నికల్లో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓట్లును వృధా చేయకుండా తప్పని సరిగా ఓట్లు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతి సిబ్బంది, కాలనీవాసులు, యువతలు పాల్గొన్నారు.

మే డే పోస్టర్ విడుదల

నవతెలంగాణ-నస్పూర్



ప్రపంచ కార్మిక పోరాట దినోత్సవం 138వ మే డే వారోత్సవాల సందర్భంగా రూపొందించిన పోస్టర్లను ఆర్కే-7 గనిపై ఎస్‌సీఎల్‌యూ(టీఎన్‌టీయూసీ) ఉపాధ్యక్షుడు గద్దల నారాయణ మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మణిరాం సింగ్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మారుస్తూ కార్మికులను కట్టు బానిసలుగా చేసే కుట్రకు పూనుకుందన్నారు. 8 గంటలకు బదులుగా 12 గంటలు పని చేసే విధానాన్ని తీసుకువచ్చి కార్పొరేట్ బహుళ జాతి సంస్థలకు అనుగుణంగా వ్యవహరిస్తుందని, అలాగే రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి రైతులను మోసం చేసిందని అన్నారు. దేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజల మధ్య ఐక్యతను, శ్రమజీవుల మధ్య ఐక్యతపై దాడి చేస్తుందన్నారు. కార్మిక వర్గం ఇటువంటి విభజన విధానాలను తిప్పికొట్టాలని, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విదానాలను కార్మిక లోకం ఐక్య పోరాటాలు నిర్వహించవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అలాగే సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఇన్కంటాక్స్ రద్దు, సొంత ఇంటి పథకం అమలు పెండింగ్ సమస్యల పరిష్కారం పెర్క్స్ పై ఇన్కంటాక్స్ రద్దు చేసి ఆ డబ్బులను తిరిగి చెల్లించాలని, సింగరేణిలో ప్రయివేటీకరణ రద్దుచేసి కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలను చెల్లించాలని లేనిపక్షంలో కార్మికులంతా ఐక్య పోరాటాలకు సిద్ధంగా ఉండాలని మే డే సందర్భంగా కార్మికులకు టీఎన్‌టీయూసీ పిలుపునిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీహసన్, బొల్లు మల్లయ్య, జి తిరుపతి, డి చంద్రమౌళి, నవీన్ కుమార్, పాండే, ఖాసీం, పంబాల రమేష్ పాల్గొన్నారు.

'పది'లో ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-సిర్పూర్(టి)






పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో సిర్పూర్ మండలంలోని పాఠశాలలు గమ్యంగా ఉత్తీర్ణత శాతాన్ని నెరవేర్చాయి. సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయంలో వంద శాతం, తెలంగాణ సాంఘీక సాంక్షేమ బాలికల పాఠశాలలో 99 శాతం, సాంఘీక సంక్షేమ బాలికల కాగజ్‌నగర్ గురుకుల వంద శాతం, కేజీబీవీ 97 శాతం, బాలుర ఆశ్రమ పాఠశాల 85 శాతం, బాలికల ఆశ్రమ పాఠశాల 66 శాతం, జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల 65 శాతం, ప్రయివేటు ఇడెన్ గార్డెన్ హైస్కూల్ వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు తెలిపారు.

సత్తా చాటిన మండల పదో తరగతి విద్యార్థులు...

పదో తరగతి పబ్లిక్ పరీక్షలో ప్రకటించిన ఫలితాల్లో సాంఘీక సంక్షేమ బాలుర పాఠశాలలో పెరుగు సాయికుమార్ 10, కుమ్మరి శివకుమార్ 9.3, కాగజ్‌నగర్ గురుకుల బాలికల పాఠశాల సీహెచ్ శిరీష 9.7, కె వైష్ణవి 9.3, ఇడెన్ గార్డెన్ ప్రయివేటు హైస్కూల్ మానెపెల్లి అఖిల్‌సాయి వరప్రసాద్ 9.8, నితిన్ 9.3, కేజీబీవీ జి.అంజలి 9.0, బాలుర ఆశ్రమ పాఠశాల డి.వెంకటేశ్ 8.3, బాలికల ఆశ్రమ పాఠశాల



ఎం.మమత 8.3, టి.రవలిక 8.2, జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల లెండుగురె సోని 9.0తో ఉత్తీర్ణత సాధించి ప్రయివేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలు కూడా తక్కువేమీ కాదని విద్యార్థులు ప్రతిభ చాటారు. మండల టాపర్‌లుగా పెరుగు సాయికుమార్ 10 జీపీఏ, ఇడెన్ గార్డెన్ ప్రయివేటు పాఠశాల మానెపెల్లి సాయిరాం 9.8జీపీఏ మండల టాపర్లుగా నిలిచారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, మిత్రులు అభినందించారు.

మృతదేహంతో కుటుంబీకుల ఆందోళన

- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమని ఆరోపణ
- ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా
- ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే జేఎల్ఎం పవన్ కళ్యాణ్ మృతిచెందాడని ఆరోపిస్తూ కుటుంబీకులు, బంధువులు ఆందోళనకు దిగారు. సోమవారం విద్యుత్ స్తంభంపై మరమ్మత్తులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సప్లయ్ కావడంతో స్తంభంపై నుండి కిందపడి పవన్ కళ్యాణ్ మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే మంగళవారం జిల్లాకేంద్రంలోని ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయం వద్ద మృతదేహంతో నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం కావాలంటూ నినదించారు. ముమ్మాటికీ ఏఈ తప్పిదం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువకుడు ఉద్యోగంలో చేరిన నెలరోజులకే ప్రాణాలు కోల్పోవడం దిగ్భ్రాంతికి గురిచేస్తోందని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించడంతో పాటు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. అటు వీరికి నాయిబ్రాహ్మణ సంఘం జిల్లా నాయకులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ మద్దతు పలికారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసే విధంగా వెంటనే చర్యలు తీసుకోవాలంటూ వారు డిమాండ్ చేశారు.

అదుపు తప్పి బోల్తాపడిన బొలెరో వాహనం



- 22 మంది ప్రయాణికులు.. 18 మందికి గాయాలు
- పెళ్లికి హాజరై తిరిగి వస్తుండగా ఘటన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అదుపు తప్పి ఓ బొలెరో వాహనం జాతీయ రహదారిపై బోల్తాపడి 18 మందికి గాయాలైన ఘటన ఆదిలాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. వాహన డ్రైవర్ మణిక్ రావ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర మహోర్‌కు చెందిన వారు జైనూర్ మండలంలోని పోనాల గ్రామంలో బంధువుల పెళ్లికి ఈనెల 29న వెళ్లారు. అక్కడి నుంచి మంగళవారం ఆదిలాబాద్ మీదుగా మహోర్ వెళ్లడానికి బోలేరో వాహనం నంబర్ ఏపీ 16 టీఎఫ్ 4001లో జైనూర్ నుంచి ఉదయం బయల్దేరారు. మధ్యాహ్న సమయంలో దేవాపూర్ చెక్ పోస్టు వద్ద ఓ కారు వీరిని ఓవర్ టెక్ చేయడంతో డ్రైవర్ దాన్ని తప్పించే క్రమంలో వాహనం బోల్తాపడింది. ఇందులో 22 మంది ప్రయాణిస్తుండగా 18 మందికి స్వల్ప గాయలయ్యాయి. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్స్ సహాయంతో క్షతగాత్రులను రిమ్స్‌కు తరలించారు. ఎవరికి ప్రాణహాని జరగకపోవడం అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు రిమ్స్‌లో క్షతగ్రాతుల నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.



రేపు మామిడి ఫలసాయం బహిరంగ వేలం

నవతెలంగాణ-ముధోల్

మండలంలోని ముధోల్‌లోని ప్రభుత్వ నర్సరీలో గురువారం మామిడి చెట్ల పంటను బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్టు నిర్మల్ జిల్లా ఉద్యాన వన పట్టు పరిశ్రమ అధికారి ఆలిమా ఫాతిమా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు రూ.5వేల ధరావత్తు చెల్లించి పాల్గొలని తెలిపారు. బహిరంగ వేలంలో ఎక్కువ మొత్తం బిడ్ పెట్టిన వారికి మాత్రమే వేలం అనుమతించవచ్చని పేర్కొన్నారు. వేలంలో నెగ్గిన వారు పాట మొత్తంలో సగం సొమ్మును వెంటనే చెల్లించాలని తెలియజేశారు. పూర్తి సొమ్ము మే10 వరకు చెల్లించాలని తెలిపారు. మామిడి వేలం కాలపరిమితి జూన్10కి ముగిస్తుందని తెలిపారు. వేలం పాట ఉదయం 11 గంటలకు నిర్వహించానున్నట్టు తెలిపారు.

గురుకులంలో 93.33 శాతం ఉత్తీర్ణత

నవతెలంగాణ-ఉట్నూర్



పదో తరగతి ఫలితాల్లో లాల్‌టెక్డి బాలురు గురుకుల పాఠశాల విద్యార్థులు 93.33 శాతం ఉత్తీర్ణత సాధించారని ఆర్‌సీఓ గంగాధర్ తెలిపారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో మొత్తం 75 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 70మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఐదు గురు విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఇందులో ఎం. వినయ్‌కి 9.3, ఎం. రాజశేఖర్‌రెడ్డికి 9.3, పి.శ్రీకాంత్‌కి 9.2 జీపీఏను సాధించారు. విద్యార్థులను ఆర్‌సీఓతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కాసిపేటలో 89 శాతం ఉత్తీర్ణత

నవతెలంగాణ-కాసిపేట

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో కాసిపేట మండలంలో 89 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఎంఈఓ వాసాల ప్రభాకర్ తెలిపారు. మొత్తం 441 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 391 మంది ఉత్తీర్ణులైనట్లు వివరించారు. మల్కేపల్లి, దేవాపూర్ ఆశ్రమ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. దేవాపూర్ డీఏవీ స్కూల్ నుంచి ముగ్గురు విద్యార్థులు షేక్ ఉజ్మా, వరద హన్మయి శ్రీ, కొమ్మల స్వతంత్ర 10 జీపీఏ సాధించారు. టీఎస్ డబ్ల్యూర్ఎస్(బాలుర) విట్టల్ లక్ష్మీ నివాస్ 9.8 జీపీఏ సాధించాడు. ధర్మారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వర్ధిని 9.3 జీపీఏ సాధించింది. కాసిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు మీడియంలో సున్నా శాతం, ఇంగ్లీష్ మీడియంలో 86 శాతం, మల్కేపల్లి ఆశ్రమ పాఠశాలలో 100 శాతం, దేవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 87 శాతం, లంబాడితాండ(ఎస్) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 40 శాతం, ధర్మారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు మీడియంలో 87 శాతం, ఇంగ్లీష్ మీడియంలో 94 శాతం, ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 43 శాతం, దేవాపూర్ ఆశ్రమ పాఠశాలలో 100 శాతం, కాసిపేటలో కేజీబీవీలో 87 శాతం, రేగులగూడ ఆశ్రమ పాఠశాలలో 67 శాతం, కాసిపేట మోడల్ స్కూల్లో 81 శాతం, టీఎస్ డబ్ల్యూఆర్ఎస్ 99 శాతం, దేవాపూర్ డీఏవీ స్కూల్లో తెలుగు మీడియంలో 90 శాతం, ఇంగ్లీష్ మీడియంలో 99 శాతం ఉత్తీర్ణత సాధించారు.

పదవ తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలదే పైచేయి

నవతెలంగాణ-దండేపల్లి




మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. మంగళవారం వెలువడిన పదో తరగతి ఫలితాల్లో మొత్తం పాఠశాలలో 362 మంది విద్యార్థులకు గాను 332 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదివిన అలిశెట్టి సహస్ర 9.8 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచారు. లింగపూర్ ఆదర్శ పాఠశాలకు చెందిన సాయి శ్రీకర్ 9.7 జీపీఏ సాధించి రెండు స్థానంలో నిలిచారు. కాగా మండలంలో పదవ తరగతిలో 93.7 ఉత్తీర్ణత శాతం నమోదయింది.

పది ఫలితాల్లో మెరిసిన ముధోల్ విద్యార్థులు

- 12 ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత

నవతెలంగాణ-ముధోల్

పదో తరగతి ఫలితాల్లో ముధోల్ మండలంలోని 06 ప్రభుత ఉన్నత పాఠశాలలు, 04 ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆశ్రమ ఉన్నత పాఠశాల, కస్తూరిభా గాంధీ పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించగా, ముధోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 99శాతం ఉత్తీర్ణత సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మండలంలోని, ఎడ్‌బిడ్, బొరిగాం, ఆష్టా, మచ్కల్, ముధోల్ ప్రభుత్వ ఉన్నత, బాలికల తెలుగు, ఉర్దు మీడియం పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే బాలుర గురుకుల, ఆశ్రమ పాఠశాల, బాలికల గిరిజన పాఠశాల, కస్తూరిబా, మహాత్మా జ్యోతిబాపూలే, బాలికల మైనార్టీ పాఠశాలతో పాటు రభీంద్రా, శిశుమందీర్, పాఠశాలలు వందశాతం పదిలో ఉత్తీర్ణత సాధించాయి. ముధోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 99శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈఓ మైసాజి తెలిపారు. ఆష్టా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మనోహర్ 10 జీపీఏ, కస్తూరిభా గాంధీ పాఠశాలలో జె.ప్రియాంక 10 జీపీఏ సాధించారు. మచ్కల్ ఉన్నత పాఠశాలలో సాయి చరణ్, సుజాత అనే విద్యార్థులు 9.7 జీపీఏ, బాలికల మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో దివ్య, ఐశ్వర్య, మాధవి అనే విద్యార్థులు 10 జీపీఏ, సాధించారు. ముధోల్‌లోని రభింద్రా పాఠశాలలో 10 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు మొత్తం 15కు గాను, 14 పాఠశాలలు పది ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడంతో ఉపాధ్యాయులు, పోషకులు విద్యార్థులను అభినందించారు. మొత్తం మండలంలో ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలో 99.84 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

నేడు అలుపెరుగని పోరాటం పుస్తకావిష్కరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని యాదవ సంఘ భవనంలో నేడు ఉదయం నిర్వహించబోయే 'అలుపెరుగని పోరాటం' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్యక్రమ కన్వీనర్ ఓరగంటి అశోక్ పిలుపునిచ్చారు. మంగళవారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి, ప్రజా వాగ్గేయకారుడు జయరాజు ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. ఈ పుస్తకం ప్రముఖ జర్నలిస్టు, న్యూస్‌క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పురకాయస్థ రచించినదని తెలిపారు. ఎమర్జెన్సీ కాలం నుంచి నేటివరకు తన జీవితంలో జరిగిన సంఘటనలు, తాను ఎదుర్కొంటున్న నిర్బంధాలను జర్నలిస్టులు, అభ్యుదయవాదులు, ప్రశ్నించే గొంతుకలపై జరుగుతున్న ఆకృత్యాలను ఈ పుస్తకంలో ఆయన వివరించారని తెలిపారు. ఈ పుస్తకాన్ని ప్రతీ ఒక్కరూ చదవాలని ఈ కార్యక్రమానికి జిల్లాలోని కవులు, కళాకారులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ప్రగతిశీల మేధావులు, ప్రజాస్వామ్యవాదులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు ఎ స్వామి, టి.సూర్యకుమార్, మెడపట్ల సురేష్, పూసం సచిన్, అన్నమొల్ల కిరణ్, చిన్నన్న పాల్గొంటారని తెలిపారు.

సారంగాపూర్ పదిలో 97 శాతం ఉత్తీర్ణత

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలో పదో తరగతి ఫలితాల్లో మొత్తం 97శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈఓ మధుసూదన్ తెలిపారు. మంగళవారం పదో తరగతి ఫలితాలు వెలువడగా 13 ప్రభుత్వ పాఠశాల్లో 385 మంది విద్యార్థులకు గాను 374 మంది విద్యార్థులు 97శాతం ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. మండల టాపర్‌గా జామ్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఐదుగురు 9.5 జీపీఏ సాధించి, మొదటి స్థానంలో నిలిచారు. కస్తూర్బా గాంధీ పాఠశాల, ఆశ్రమ పాఠశాల విద్యార్థులు 9.3 జీపీఏ సాధించి, రెండో స్థానంలో నిలిచింది. చించోలి(బి), బీరవెల్లి ప్రభుత్వ పాఠశాలలు 9.0 జీపీఏ సాధించి మూడో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. మండలంలోని వివేకానంద పాఠశాల విద్యార్థిని మండల టాపర్‌గా నిలిచింది.